Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 117 మేడ్చల్ మల్కాజ్‌గిరి 19 మే 2023 శుక్రవారం పేజీలు : 4

### ఢిల్లీలో 4 శాతానికి సమీపించిన పాజిటివిటీ రేటు..!

ఢిల్లీ: దేశంలో ప్రస్తుతం కరోనా వ్యాప్తి అదుపులోనే ఉంది. మరోరోజు వెయ్యికి సమీపంలోనే కొత్త కేసులు వచ్చాయి. అయితే ఢిల్లీలో మాత్రం మరోదఫా వైరస్ విజృంభిస్తోన్న సూచనలు కనిపిస్తున్నాయి. హెూం ఐసోలేషన్‌లో ఉండేవారి సంఖ్య పెరుగుతోంది. అలాగే పాజిటివిటీ రేటు నాలుగు శాతానికి సమీపించడం ఆందోళన కలిగిస్తోంది. శనివారం కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించిన గణాంకాల ప్రకారం.. నిన్న 3 లక్షల మందికి నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా.. 975 మందికి పాజిటివ్‌గా తేలింది. అందులో ఒక్క ఢిల్లీ నుంచి వచ్చిన కేసులే 366గా ఉన్నాయి. అక్కడ పాజిటివిటీ రేటు 3.95 శాతానికి చేరింది. ఫిబ్రవరి 3 తర్వాత ఇదే అత్యధికం కావడం గమనార్హం. దేశవ్యాప్తంగా ఇప్పటివరకూ 4.30 కోట్ల మందికి కరోనా సోకింది.

# 'కర్ణాటకానికి' తెర..

# సీఎం డిప్యూటీ సీఎం వీరే!





మే 13న ఫలితాలు వెలువడి కాంగ్రెస్ గెలిచినప్పటి నుంచి కర్ణాటకలో ముఖ్యమంత్రి ఎవరనేదానిపై తీవ్ర ఉత్కంఠ నెలకొన్న సంగతి తెలిసిందే. ఓవైపు మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఇంకోవైపు కర్ణాటక పీసీసీ అధ్యక్షుడు ఆ పార్టీ ట్రబుల్ షూటర్ డీకే శివకుమార్ ముఖ్యమంత్రి పదవి కోసం పోటీ పడ్డారు. 224 అసెంబ్లీ స్థానాలు ఉన్న కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ 135 స్థానాలు గెలుచుకున్న సంగతి తెలిసిందే. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మ్యాజిక్ ఫిగర్ 113ను ఆ పార్టీ దాటింది.

దీంతో ఎవరి మద్దతు అవసరం లేకుండానే సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది. దీంతో మంత్రి పదవులు దక్కించుకోవడానికి నేతల మధ్య తీవ్ర పోటీ ఉంది. కాగా ముఖ్యమంత్రి పీఠంపై ఎట్టకేలకు చిక్కుముడి వీడింది. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ప్రతినిధులు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అగ్ర నేతలు సోనియా గాంధీ రాహుల్ గాంధీ చర్చోపచర్చల తర్వాత ముఖ్యమంత్రి అభ్యర్థిని ఖరారు చేశారు. ముఖ్యమంత్రిగా దాదాపు 100 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉన్న సిద్ధరామయ్యను ఫైనల్ చేశారు. ఇక దాదాపు ఒంటి చేత్తో కాంగ్రెస్ కు విజయాన్ని కట్టబెట్టిన డీకే శివకుమార్ కు ఉప ముఖ్యమంత్రి పదవిని ఇచ్చారు. కర్ణాటక పీసీసీ అధ్యక్ష పదవి కూడా శివకుమార్ వద్దే ఉంటుంది. శివకుమార్ తోపాటు దళితులు మైనారిటీలు లింగాయత్ ల నుంచి ఒక్కోరు డిప్యూటీ సీఎంగాలుగా ఉంటారని వార్తలు వచ్చినా శివకుమార్ ఒక్కరే డిప్యూటీ సీఎంగా ఉంటారని కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించింది. ఈ మేరకు కాంగ్రెస్ అధికార ప్రతినిధి కేసీ వేణుగోపాల్ ప్రకటించారు. సీనియారిటికే పార్టీ హైకమాండ్ ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ఎమ్మెల్యేలు సైతం సిద్ధరామయ్యకే మద్దతు ఇస్తుండటంతో సీఎంగా ఆయననే ఎంపిక చేశారని తెలుస్తోంది. దీంతో కర్ణాటక ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య ఉప ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ అలాగే మరికొంతమంది మంత్రులు మే 20 ప్రమాణస్వీకారం చేస్తారని కేసీ వేణుగోపాల్ ప్రకటించారు. రాహుల్ గాంధీతోపాటు ఎమ్మెల్యేల్లో ఎక్కువ మంది సిద్ధరామయ్యను సపోర్ట్ చేశారని సమాచారం. ఇక సోనియా గాంధీతోపాటు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే డీకే శివకుమార్ వైపు మొగ్గు చూపారు. అయితే డీకే శివకుమార్ పై ఈడీ సీబీఐ కేసులు ఉండటం ఆయనకు ప్రతిబంధకంగా మారిందని అంటున్నారు. ఈ నేపథ్యంలో సిద్ధరామయ్యను సీఎంగా ప్రకటించారని తెలుస్తోంది. కాగా 2013 నుంచి 2018 వరకు సిద్ధరామయ్య ఐదేళ్లపాటు కర్ణాటక సీఎంగా పనిచేశారు. ఎలాంటి వివాదాలు పెద్దగా అవినీతి ఆరోపణలు లేకుండా తన పదవీకాలాన్ని పూర్తి చేశారు. అంతేకాకుండా అహింద వర్గాల (దళితులు బీసీలు మైనార్టీలు) ప్రతినిధిగా సిద్ధరామయ్యకు పేరుంది. దీంతో ఆయన వైపే కాంగ్రెస్ అధిష్టానం మొగ్గు చూపిందని చెబుతున్నారు. ఇక డీకే శివకుమార్ కు కర్ణాటక పీసీ అధ్యక్ష పదవితో పాటు ఉప ముఖ్యమంత్రి కీలక మంత్రిత్వ శాఖలు దక్కుతాయి. ఇప్పటికే పార్టీ అధిష్ఠానం నిర్ణయాన్ని శిరసావహిస్తానని డీకే శివకుమార్ స్పష్టం చేశారు. పార్టీ తనకు కన్నతల్లి లాంటిదని పార్టీని చీల్చబోనని వెన్నుపోటు పొడవబోనని వెల్లడించారు. కాగా తాను సీఎం రేస్ నుంచి ఎందుకు తప్పుకున్నానో డీకే శివకుమార్ ఇండియా టుడేకి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. తనకు సీఎం పదవికంటే కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తు ఎక్కువ అని చెప్పారు. పార్టీకి చెడ్డపేరు రాకూడదు అని తాను సీఎం రేసు నుంచి తప్పుకున్నానని వెల్లడించారు. తన పదవి కంటే ప్రజల యోగక్షేమాలు ముఖ్యం అని డీకే శివకుమార్ చెప్పారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసి ప్రజలకు ఇచ్చిన హామీలు అన్ని నేరవేర్చడానికి తమకు అవకాశం వచ్చిందని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడానికే సీఎం సీటు కోసం రాద్ధాంతం చెయ్యకూడదని తాను సీఎం సీటు రేస్ నుంచి తప్పుకున్నానని పేర్కొన్నారు.

## భజరంగ్‌దళ్ నిషేధానికి కేసీఆర్ కుట్ర

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం బీజేపీ ఓబీసీ సమ్మేళనంలో మాట్లాడిన ఆయన.. తెలంగాణలో భజరంగ్‌దళ్‌ను నిషేధించేందుకు కేసీఆర్ కుట్ర చేస్తున్నారని అన్నారు. భజరంగ్‌దళ్‌ను నిషేధించడంలో కాంగ్రెస్‌తో కేసీఆర్ పోటీ పడుతున్నారని మండిపడ్డారు.




కేసీఆర్ కుట్రను తిప్పికొట్టటానికి హిందువులంతా ఏకంకావాలని పిలుపునిచ్చారు. బండి సంజయ్ ఇంకా మాట్లాడుతూ... బీసీలకు గొర్రెలు, బర్రెలు ఇవ్వటం వెనుక కుట్ర దాగుందన్నారు. బీసీబంధు ప్రకటించటానికి ఇబ్బంది ఏంటో సీఎం కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు.

త్వరలో హైదరాబాద్ వేదికగా లక్షల మందితో బీసీ శంఖారావ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. రామ రాజ్యం కోసం ఐదు నెలలు సమయం ఇవ్వాలని క్యాడర్‌కు బండి పిలుపునిచ్చారు.

## కేసీఆర్ కు ఊరట.. ఆ గుర్తులు తొలగింపు!



హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అధినేత కేసీఆర్ కు ఊరట దక్కింది. బీఆర్ఎస్ పార్టీ గుర్తు అయిన కారును పోలి ఉన్న నాలుగు గుర్తులను ఈసీ నిషేధించింది. ఈ మేరకు ఆటోరిక్షా హ్యాట్ (టోపీ) ఇస్త్రీ పెట్టె ట్రక్ గుర్తులను నిషేధిస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. తమ పార్టీ గుర్తు అయిన కారును పోలినట్టు ఉన్న గుర్తుల వల్ల తమకు ఎన్నికల్లో నష్టం జరుగుతోందని.. ఇందుకు పలు ఆధారాలున్నాయని బీఆర్ఎస్ పార్టీ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తమ పార్టీ గుర్తు అయిన కారును పోలి ఉన్న పలు గుర్తులపై బీఆర్ఎస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఏపీ తెలంగాణల్లో కారును పోలి ఉన్న గుర్తులను ఎవరికీ కేటాయించవద్దని విజ్ఞప్తి చేసింది. బీఆర్ఎస్ పార్టీ విజ్ఞప్తి మేరకు కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఎన్నికల్లో ఆయా పార్టీలకు కేటాయించే గుర్తుల జాబితాను ఈసీ విడుదల చేసింది. ఈసారి జారీ చేసిన గుర్తుల జాబితాలో బీఆర్ఎస్ అభ్యంతరం వ్యక్తం చేసిన గుర్తులను రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎవరికీ కేటాయించకుండా ఆదేశాలు జారీ చేసింది. ఇక తెలంగాణలో నాలుగు పార్టీలకు మాత్రమే ఈసీ గుర్తింపు దక్కింది. బీఆర్ఎస్ కు కారు గుర్తు ఎంఐఎం (మజ్లిస్) పార్టీకి గాలిపటం (పతంగి) టీడీపీకి సైకిల్ గుర్తు వైఎస్సార్సీపీకి ఫ్యాన్ గుర్తును ఖరారు చేసింది. కాగా ఏపీలో బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ హెూదాను కోల్పోయింది. సాధారణంగా రాష్ట్ర పార్టీగా గుర్తించాలంటే ఏదైనా ఓ రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో పోలైన ఓట్లలో పార్టీ 3 శాతం ఓట్లు పొందాల్సి ఉంటుంది. లేదంటే 3 అసెంబ్లీ సీట్లు గెలుచుకోవాలి. అలాంటి పార్టీకే రాష్ట్ర హెూదా దక్కుతుంది. ఏపీలో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీ చేయలేదు. దీంతో ఆ పార్టీ ఏపీలో రాష్ట్ర పార్టీ హెూదాను కోల్పోయింది. దేశంలోని పలు పార్టీలు కూడా కొన్ని రాష్ట్రాల్లో రాష్ట్ర పార్టీ హెూదాను కోల్పోయాయి. మణిపూర్ లో పీడీఏ పుదుచ్చేరిలో పీఎంకే ఉత్తరప్రదేశ్ లో ఆర్ఎల్డీ పశ్చిమ బెంగాల్లో ఆర్ఎస్పీ మిజోరంలో ఎంపీసీ కూడా రాష్ట్ర పార్టీ హెూదాను కోల్పోయాయి. ఇక ఆంధ్రప్రదేశ్ లో రెండే రెండు పార్టీలను ఎన్నికల సంఘం గుర్తించింది. వైసీపీకి సీలింగ్ ఫ్యాన్ తెలుగుదేశం పార్టీకి సైకిల్ గుర్తు ఖరారు చేసినట్లు ఈసీ పేర్కొంది. కాగా కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా మొత్తం 193 ఎన్నికల గుర్తులను తాజా జాబితాలో పేర్కొంది.

# ప్రగతిశీల మార్గంలో తెలంగాణ పరిశ్రమల విధానాలు

## అమెరికా పర్యటనలో ఉన్న మంత్రి కేటీఆర్

### పలు సంస్థలతో కీలక ఒప్పందాలు - తెలంగాణకు భారీగా పెట్టుబడులు!





న్యూయార్క్: తెలంగాణ ఐటీశాఖ మంత్రి కేటీఆర్.. అమెరికా పర్యటనలో ఉన్న విషయం తెలిసిందే. న్యూయార్క్‌లో జరిగిన ఇన్వెస్టర్ రౌండ్‌టేబుల్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. ఆ సమావేశాన్ని కౌన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా, యూఎస్ ఇండియా స్ట్రాటజిక్ పార్ట్నర్‌షిప్ ఫోరమ్ సంయుక్తంగా నిర్వహించాయి. రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ఉద్దేశిస్తూ మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. న్యూయార్క్ సిటీతో తనకు ఉన్న లోతైన అనుబంధాన్ని ఆయన పంచుకున్నారు. న్యూయార్క్ సిటీలోనే తాను చదువుకుని, పనిచేసినట్లు ఆయన గుర్తు చేశారు. పెట్టుబడులకు తెలంగాణ రాష్ట్రం చాలా ఆదర్శవంతంగా ఉంటుందని, ఎటువంటి వ్యాపారాన్ని అయిన మొదలుపెట్టేందుకు తెలంగాణ రాష్ట్రంలో అన్ని వనరులు ఉన్నట్లు మంత్రి కేటీఆర్ వెల్లడించారు. తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ ట్విట్టర్‌లో మంత్రి కేటీఆర్ మాట్లాడిన విషయాలను ట్వీట్ చేశారు. పరిశ్రమల ఏర్పాటు విషయంలో తెలంగాణ సర్కార్ ప్రగతిశీల పథంలో వెళ్తున్నట్లు ఆయన మంత్రి తెలిపారు. తమ విధానాలు పరిశ్రమలకు అనుకూలంగా ఉన్నాయన్నారు. ఇన్నోవేషన్ వ్యవస్థను ఉత్తేజ పరిచే విధంగా ఉన్నట్లు మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం మొత్తం 14 రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ఆ రంగాలకు విస్తృత రీతిలో అవకాశాలను కూడా కల్పిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇండియాను లక్ష్యంగా ఎంపిక చేసుకునే పెట్టుబడిదారులకు తెలంగాణ స్వర్గధామంగా నిలుస్తుందని మంత్రి కేటీఆర్ వెల్లడించారు.

**మంత్రి కేటీఆర్‌ను కలిసిన ఆరన్ క్యాపిటల్ చైర్మెన్** : ప్రఖ్యాత ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ కంపెనీ ఆరన్ క్యాపిటల్ ఇవాళ తెలంగాణ సర్కార్‌తో డీల్ కుదుర్చుకున్నది. అమెరికా పర్యటనలో ఉన్న మంత్రి కేటీఆర్‌ను ఆరన్ క్యాపిటల్ చైర్మన్ డేవిడ్ వోల్ఫే నేతృత్వంలోని ఎగ్జిక్యూటివ్ బృందం కలిసింది. న్యూయార్క్‌లో ఆ భేటీ జరిగింది. తెలంగాణ ప్రభుత్వం, ఆరన్ క్యాపిటల్ మధ్య సహకారం గురించి చర్చించారు. తెలంగాణలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉన్నట్లు మంత్రి కేటీఆర్ వెల్లడించారు. ఆవిష్కరణ వ్యవస్థతో పాటు అత్యుత్తమ మౌళికసదుపాయాలు, నైపుణ్యవంతమైన వర్క్‌ఫోర్స్ కూడా ఉన్నట్లు మంత్రి తెలిపారు. కంపెనీలను విలీనం చేయడంలో, కొనుగోలు చేయడంలో, పెట్టుబడులను ఆకర్షించడంలో, ఫైనాన్సింగ్, అడ్వైజరీ సేవల్లో ఆరన్ క్యాపిటల్ సంస్థ ప్రత్యేకత కలిగి ఉంది. అనేక రకాల పరిశ్రమలకు చెందిన క్లయింట్లు ఆ కంపెనీకి ఉన్నారు. మీడియా, హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్, కన్జ్యూమర్ ప్రాడక్ట్స్, సర్వీసెస్, ఫుడ్ అండ్ బివరేజెస్, పరిశ్రమలు, టెక్నాలజీ, రియల్ ఎస్టేట్ లాంటి రంగాల్లో ఆ కంపెనీకి క్లయింట్లు ఉన్నారు.

# సంపాదకీయం

## బీఆర్ ఎస్ ఎంత పని చేసింది?

## ఢిల్లీకి గులాములు అన్న మాట రాకుండా చేసిందే?

కొన్ని కావాలంటే కొన్ని వదులుకోవాలంటారు. కానీ.. వదులుకోవాల్సినవి ఎక్కువై.. కావాల్సినవి తక్కువైనప్పుడు కలిగే ఇబ్బంది అంతా ఇంతా కాదు. తాను సొంతంగా ఏర్పాటు చేసుకున్న పరిమితులే తనను ఇబ్బంది పెడుతున్న వేళ.. అలాంటి వారు పడే ఇబ్బంది అంతా ఇంతాకాదు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కమ్ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విచిత్రమైన ఇబ్బందిని ఎదుర్కొంటున్నారు. ఉద్యమనేతగా.. టీఆర్ఎస్ అధినేతగా ఉన్నంత కాలం వేదిక ఏదైనా సరే.. కేసీఆర్ నోటికి హద్దు అదుపు ఉండేది కాదు. టార్గెట్ చేసినోళ్లు ఎవరైనా సరే.. ఆయన విసురుకు వణికే వారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలోనూ ఆయన భావోద్వేగంతో చేసే వ్యాఖ్యల కారణంగా పార్టీలకు.. ఆయా పార్టీ నేతలకు జరిగిన డ్యామేజ్ అంతా ఇంతా కాదు. తాము కేసీఆర్ కు టార్గెట్ కాకూడదన్న ఉద్దేశంతో కేసీఆర్ అండ్ కో ను పల్లెత్తు మాట అనేందుకు సాహసించేవారు కాదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి.. ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన తర్వాత కూడా ఆయన కొందరిని లక్ష్యం చేసుకునే వారు. విషయం ఏదైనా.. భావోద్వేగ ఆయుధంతో ప్రత్యర్థి మీద సంధించేవారు. ప్రాంతీయ పార్టీలకు ఉండే అడ్వాంటేజ్ ను అవసరానికి అనుగుణంగా వాడేవారు. కేంద్రాన్ని ఇరుకున పెట్టే వారు. ఢిల్లీకి గులాములుగా ఉండాలా? అంటూ ఫీంకరించే వారు. వ్యూహాత్మకంగా తమను ఇరుకున పెడుతున్న కేసీఆర్ ను ఏమీ అనలేక రాజకీయ పక్షాలు మౌనంగా ఉండేవి. కాలక్రమంలో ప్రభుత్వాధినేతగా చేసే తప్పులు.. ప్రభుత్వ నిర్ణయాల్లోని లోపాలు ఆయన్ను వేలెత్తి చూపేలా చేశాయి. ఇలాంటి వేళలోనే ఆయన తన ప్రాంతీయ పార్టీ పేరును మార్చేసి.. బీఆర్ఎస్ పేరుతో జాతీయ పార్టీని ఏర్పాటు చేశారు. తెలంగాణలో తాము సక్సెస్ ఫుల్ గా అమలు చేసిన ఫార్ములాను దేశ వ్యాప్తంగా అమలు చేసేందుకు ఆయన వ్యూహరచన చేశారు. ప్రాంతీయ పార్టీనుంచి జాతీయ పార్టీగా మారిన తర్వాత వచ్చే లాభాల కంటే కూడా ఎదురయ్యే కష్టాలే ఎక్కువన్న పలువురి మాటలకు తగ్గట్లే కేసీఆర్ తాజా పరిస్థితి ఉందని చెప్పాలి. ప్రాంతీయ పార్టీ అధినేతగా నోటికి పని చెప్పిన ఆయన.. జాతీయ పార్టీ అధినేతగా కొన్ని అంశాల మీద అస్సలు మాట్లాడలేని పరిస్థితి. తాజాగా కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడి.. నాలుగు రోజులు అవుతున్నా.. ఇంకా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే విషయంలోనూ.. ముఖ్యమంత్రిని ఫైనల్ చేసే విషయంలో కాంగ్రెస్ కిందా మీదా పడుతోంది. జాతీయ పార్టీగా కాకుండా ప్రాంతీయ పార్టీగా ఉండి ఉంటే.. ఢిల్లీకి గులాము చేయాలా? అన్న మాట చూపించే ఎఫెక్టు ఎంతో ఎక్కువ. నాలుగైదు నెలల్లో వచ్చే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల వేళలోనూ.. ఈ మాటకు విలువ ఉండేది. ఇప్పుడు ప్రాంతీయ పార్టీ కాస్తా జాతీయ పార్టీ కావటంతో.. ఆయన నోరు విప్పి.. మాట్లాడలేని పరిస్థితి నెలకొందంటున్నారు. బీఆర్ఎస్ ఏర్పాటు ఏమో కానీ గులాబీ బాస్ కు పెద్ద సమస్యగా మారిందని మాత్రం చెప్పక తప్పదు.

# లక్ష్యం సరే.. సంకల్పమేదీ?



ఖమ్మం : ఆకుపచ్చని తెలంగాణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారం ఇప్పటికి ఏడు విడతలు జరిగింది. ఏడేళ్లుగా ప్రతీ వానాకాలం ఈ హరితహారాన్ని నిరాటంకంగా నిర్వహిస్తూ వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం వానాకాలానికి నెల, రెండు నెలల ముందుగానే ప్రత్యేక సమావేశాలు నిర్వహించడం, నిధులు కేటాయించడం, ప్రత్యేక కార్యాచరణ ప్రకటించడం చేసి.. కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేసేది. అలాంటి ప్రతిష్ఠాత్మక హరితహారం కార్యక్రమం రానురాను అపహాస్యంగా మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. లక్షల కొద్ది మొక్కల నాటాలన్న లక్ష్యం కాస్త నీరుగారిపోయిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కానీ ఈ ఏడాది ఉన్నతస్థాయి మొదలు క్షేత్రస్థాయి వరకు వేళ్లూనుకున్న నిర్లక్ష్యం కారణంగా వర్షాకాలం ప్రారంభమైనా నేటికీ హరితహారం నిర్వహణపై ఓ స్పష్టత లేకపోవడంపట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో వర్షాకాలం ప్రారంభ సమయం వచ్చిందంటే చాలు హరితహారం నిర్వహణపై పెద్ద ఎత్తున ప్రచారం చేసిన అధికారులు, నాయకులు ఈ సారి మౌనంగా ఉన్నారు. అందరూ మొక్కలు నాటేలా అవగాహన కల్పించడంతోపాటు ఇంటింటికి మొక్కలు పంపిణీ చేసిమరీ నాటించేవారు. కానీ ఈ ఏడాది అలాంటి చర్యలేం కనిపించడం లేదు. వర్షాలు పడుతున్నా అధికారికంగా హరితహారం కార్యక్రమం నిర్వహించడంపై ప్రకటన చేయకపోవడంపై హరితలక్ష్యం నిరుగారే అవకాశం ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఖమ్మం జిల్లాలో 50లక్షలు లక్ష్యం.. జిల్లాలో ఈ ఏడాది ఎనిమిదో విడత హరితహారం కార్యక్రమంలో భాగంగా 50లక్షల మొక్కలు నాటేలా ప్రణాళికలు సిద్ధం చేశారు అధికారులు. దానికిగాను గతంలోనే సమావేశాలు ఏర్పాటు చేసి శాఖల వారీగా లక్ష్యాలను సైతం నిర్ధేశించారు. దానికి సంబంధించి సమీక్ష సమావేశాలు కూడా నిర్వహిస్తూ వస్తున్నారు. హరితహారంలో భాగంగా నిర్దేశించిన 32లక్షల మొక్కలను పలు శాఖల ద్వారా నాటించడంతోపాటు 18లక్షల మొక్కలను ఇళ్లకు పంపిణీ చేయాలని నిర్ణయించారు. డీఆర్‌డీఏ ద్వారా అత్యధికంగా 17లక్షలు, అటవీ శాఖ ద్వారా 7లక్షలు, హార్టికల్చర్ ద్వారా 3లక్షలు, వ్యవసాయశాఖ ద్వారా 4.5లక్షలు, మైనింగ్‌కు లక్ష, ఇండస్ట్రీస్‌కు 50వేలు, ఎక్సైజ్ శాఖ లక్ష, విద్యాశాఖకు 50వేలు, విద్యుత శాఖకు 2.20 లక్షలు, నీటిపారుదల శాఖకు 2లక్షలున్నాయి. వాటితోపాటు ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్‌లో లక్ష మొక్కలు నాటాలని, మూడు లక్షల మొక్కలు, మధిర మునిసిపాలిటీలో 43వేలు నాటాలని, 2.50లక్షలు పంపిణీ, వైరా మునిసిపాలిటీలో 43వేలు నాటడం, లక్ష మొక్కలు పంపిణీ, సత్తుపల్లి మునిసిపాలిటీలో 44వేలు నాటాలని, 2.50లక్షలు పంపిణీ చేయాలని లక్ష్యాలను నిర్దేశించారు. కాగా ప్రస్తుతం జిల్లాలో 589 నర్సరీల్లో 94.77లక్షల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. అయితే ప్రస్తుతం అధికారికంగా ఎలాంటి ప్రకటన లేకపోవడంతో డీఆర్‌డీఏ ద్వారా అనధికారికంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్టు తెలుస్తోంది. అయితే కేవలం ఆ ఒక్క శాఖ ద్వారా మాత్రమే ప్రక్రియ కొనసాగుతున్నట్టు తెలుస్తుండగా మిగిలిన శాఖల వారు అధికారిక తేదీల కోసం వేచి చూస్తున్నట్టు తెలుస్తోంది.

గతంలో నామమాత్రంగా నిర్వహణపై ఆరోపణలుఏడో విడత హరితహారంలోనూ శాఖలవారీగా లక్ష్యాలను నిర్ధేశించి మొక్కలు నాటడం మొదలుకుని పంపిణీ వరకు అన్నీ సక్రమంగా చేయడం వాటి పరిరక్షించాల్సిన బాధ్యతలను సంబంధిత శాఖలకు అప్పగించారు. అయితే రాను రాను హరితహారం లక్ష్యంపై సంబంధిత అధికారుల మొదలు స్థానిక నేతల వరకు నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఫలితంగానే మొక్కలు నాటే కార్యక్రమాలను ఇష్టారీతిన నిర్వహించడం, నాటిన మొక్కలకు రక్షణ కరువవడం లాంటి ఎన్నో అంశాలు పునరావృతమవుతూ వస్తూనే ఉన్నాయి. అంతేకాదు శాఖలవారీగా నాటిన మొక్కల విషయం పక్కనపెడితే పురపాలకాలు, నగరపాలకంలో పంపిణీ చేసే లక్ష్యం నిరవేరడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతేడాది చాలా పురపాలకాల్లో ఇళ్లకు మొక్కలు పంపిణీ చేయకుండానే చేసినట్టు లెక్కలు చూపారన్న ఆరోపణలున్నాయి. ఖమ్మం కార్పొరేషన్‌లో చాలా డివిజన్లలో అసలు మొక్కలు పంపిణీ చేయకపోవడం గమనార్హం. కాగా ఈ ఏడాది అయినా మొక్కలు పంపిణీ ప్రక్రియ సక్రమంగా జరిగేలా చూడటంతోపాటు, జిల్లా వ్యాప్తంగా హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని ప్రజలు కోరుతున్నారు.

భద్రాద్రి జిల్లాలోనూ అదే పరిస్థితి

ఈ ఏడాది లక్ష్యం 96లక్షల మొక్కలు కొత్తగూడెం కలెక్టరేట్, : హరిత తెలంగాణ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన హరితహారం కార్యక్రమంలో ఈ ఏడాది జిల్లాలో 95లక్షల62మొక్కలు నాటాలనే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆ మేరకు నర్సరీల్లో మొక్కలు పెంచే కార్యక్రమాన్ని చేపట్టింది. వాస్తవానికి ఇప్పటికే హరితహారం కార్యక్రమం ముమ్మరంగా జరగాల్సి ఉన్నా, ఈ ఏడాది మాత్రం మందకొడిగా సాగుతోంది. ఇప్పటికే శాఖల వారీగా నిర్ధేశించిన మొక్కలు నాటే కార్యక్రమానికి గుంతలు తీయడం కూడా ప్రారంభం కాలేదు. 2016 -17 సంవత్సరం నుంచి 2021-22 వరకు ఏడేళ్లలో ఇప్పటి వరకు 9కోట్ల 3లక్షల మొక్కలకు గాను లక్ష్యాన్ని మించి 9.79కోట్ల మొక్కలు నాటితే 79శాతం మొక్కలు బతికాయి. క్షేత్రస్థాయిలో ఇంకా తక్కువ శాతం మొక్కలు బతికినట్టు తెలుస్తోంది. అంతే కాదు రోడ్డుకిరువైపులా నాటిన మొక్కలు ఏడాది కాగానే విద్యుత తీగలకు తగులుతున్నాయని నరికివేసి వాటి స్థానంలో కొత్త ఏడాది లక్ష్యం ప్రకారం మొక్కలు నాటిన సంఘటనలు అనేకం జిల్లాలో చోటు చేసుకొన్నాయి. ఈ ఏడాది అటవీశాఖ 20లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం నిర్ధేశించగా, మిగిలిన అన్ని ప్రభుత్వ శాఖలు కలిపి మొత్తం 95లక్షల 62వేల మొక్కలు నాటే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. ప్రస్తుతం హరతహారం మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. కానీ గుంతలు తీయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ కలెక్టర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హరితహారంపై మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో టెలికాన్ఫరెన్సు నిర్వహించి హరితహారం పనులను ముమ్మరం చేయాలని ఆదేశాలిచ్చారు.

# ఎక్కడ వేసిన ఇల్లు అక్కడే !

కొత్తగూడెం : పేదలకు సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పథకం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పడకేసింది. ఈ పథకం ప్రారంభించి ఏడేళ్లు కావొస్తున్నా జిల్లాలో ఎక్కడా ఈ పథకం పనులు సాగుతున్న జాడ కనిపించలేదు. జిల్లాకు మొదటి, రెండో దఫాలో 6,443 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటివరకు కేవలం 1,445మందికి మాత్రమే సొంతఇల్లు సమకూరిందంటే ఈ పథకం అమలు తీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. జిల్లా కేంద్రమైన కొత్తగూడెం, పారిశ్రామిక ప్రాంతమైన పాల్వంచలో ఇప్పటి వరకు ఒక్క ఇల్లు కూడా పూర్తికాలేదంటే ఈ పథకంపై ఇక్కడి ప్రజాప్రతినిధులు, అధికారుల చిత్తశుద్ధి ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. జిల్లాలో ట్రైబల్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో 4,643 ఇళ్లు, పంచాయితీరాజ్ శాఖ ఆధ్వర్యంలో 1800 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఇప్పటి వరకు 1445 ఇళ్లు పూర్తయి లబ్ధిదారులకు అప్పగించారు. 968 ఇళ్లు ట్రైబల్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో నిర్మించినవి, 126ఇళ్లు పంచాయితీరాజ్ ఆధ్వర్యంలో నిర్మించిన ఇళ్లు మొత్తం 1,094 పూర్తికాగా వాటిని లబ్ధిదారులకు అప్పగించాల్సి ఉంది. జిల్లాలో నాలుగు ఎస్టీ రిజ్వర్డ్ నియోజకవర్గాల్లో అక్కడక్కడా రెండు పడకల గదుల ఇళ్లు కనిపిస్తున్నా జనరల్ నియోజకవర్గమైన కొత్తగూడెంలో మొండి గోడలు, అసంపూర్తి స్లాబ్‌లే దర్శనమిస్తుండడంతో లబ్ధిదారులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. పాలకులపై తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. ఎన్నికల హామీని నెరవేర్చడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని దుయ్యపడుతున్నారు.

6,443 ఇళ్లకు అనుమతి..ప్రభుత్వం ఏడేళ్ల కాలంలో జిల్లాకు మొత్తం 6,443 ఇళ్లను మంజూరు చేసింది. కానీ వాటిలో ఇప్పటి వరకు కేవలం 1,445ఇళ్లు మాత్రమే పూర్తిచేసినట్లు అధికారిక లెక్కలు చూపుతున్నాయి. నిర్మించిన ఇళ్లు కూడా ఊరికి దూరంగా రెండు మూడు కిలోమీటర్ల దూరంలో నిర్మించడంతో ఆయా ఇళ్లలోకి వెళ్లేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపడంలేదని తెలుస్తోంది.

రెవెన్యూ డివిజన్ల వారీగా.. కొత్తగూడెం డివిజనలో మొత్తం 1,800ఇళు మంజూరు చేశారు. వాటిలో 1,605ఇళ్లను అడ్మినిస్ట్రేషన శాంక్షన వచ్చింది. 1,459 ఇళ్ల నిర్మాణానికి టెండర్‌లు పిలిచారు. వాటిలో 126 ఇళ్లు పూర్తయ్యాయి. 1,333 నిర్మాణంలో ఉన్నాయి. 150



మంది లబ్ధిదారుల ఎంపిక జరిగింది. భద్రాచలం రెవెన్యూ డివిజనలో మొత్తం 4,643 మంజూరు చేశారు. 4,563ఇళ్లకు అనుమతిరాగా 4,167ఇళ్లకు టెండర్ పిలిచారు. వాటిలో 2413 పూర్తయ్యాయి. 1,366 ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి. ఇప్పటి వరకు 110 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. పినపాక నియోజకవర్గం పరిధిలోని మారుమూల గిరిజన మండలమైన గుండాలకు 80ఇళ్లు మంజూరు చేశారు. ఇప్పటి వరకు 40ఇళ్లు పూర్తయ్యాయి. ఇంకా 40ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి. నక్సల్స్ ప్రభావిత ప్రాంతమైన యాపలగడ్డ వద్ద 40 ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి మూడేళ్లయినా వాటిని నేటికీ లబ్ధిదారులకు స్వాధీనం చేయలేదు. దీంతో ఆయా ఇళ్ల శిథిలమైపోతున్నాయి.

అప్పగించట్లేదని ఆక్రమించారుఅశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలోని ములకలపల్లి మండలానికి 280ఇళ్లు మంజూరు చేశారు. పాతగంగారం గ్రామంలో 20ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి మూడేళ్లయింది. అయినా వాటిని పంపిణీ చేయకపోవడంతో ఎంపికైన లబ్ధిదారులు నెలరోజుల క్రితం వాటిని ఆక్రమించుకొని నివాసం ఉంటున్నారు. ఇళ్లు పూర్తయినా సౌకార్యలు మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఇళ్లమధ్య రోడ్లు లేవు. డ్రైనేజీలు నిర్మించలేదు. తలుపులు, కిటికీలు నాసిరకంగా ఉన్నాయి. బాత్రూంనీళ్లు పోవడానికి సరైనమార్గం ఏర్పాటు చేయలేదు. టాయిలెట్స్‌కు వరలు ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రజలు బహిర్భూమికి ఆరుబైటకు వెళ్లాల్సి వస్తోంది.

# శాపాలు.. వేలాడుతున్న యమపాశాలు

కొల్లాపూర్ : జిల్లాలోని పట్టణాలు, పల్లెలు, పొలాల్లో వంగిన విద్యుత్తు స్తంభాలు, వేలాడుతున్న తీగలు ప్రమాదకరంగా మారాయి. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని కోరుతున్నా విద్యుత్తు శాఖ చర్యలు చేపట్టకపోవటం ప్రజలకు శాపంగా మారుతోంది. తీగలు తెగిపడి చాలాచోట్ల పశువులు మృతిచెందుతున్నాయి. గాలి దుమారానికి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని రైతులు, ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. వర్షాకాలం నేపథ్యంలో జిల్లాలో పరిస్థితిపై పరిశీలనా కథనం.

పట్టణాల్లోని చాలా ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ చేపట్టారు. ఆయా చోట్ల ఉన్న పాత విద్యుత్తు స్తంభాలన్నీ రోడ్డు మధ్యకు వచ్చాయి. సీసీ రోడ్లు నిర్మిస్తున్నా వాటిని మాత్రం తొలగించకపోవటం ప్రమాదకరంగా మారింది. జిల్లా కేంద్రంలోనే 49 వార్డుల పరిధిలో 29 విద్యుత్తు స్తంభాలు, రెండు నియంత్రికలు రహదారుల మధ్యలో ఉన్నాయి. 2020లో ప్రారంభమైన తొలి విడత పట్టణ ప్రగతిలోనే వీటిని గుర్తించినా ఇప్పటివరకు తొలగించలేదు. మూడు మాసాల కిందట కలెక్టు వెంకట్‌రావు వీధుల్లో పర్యటిస్తూ నడిరోడ్ల మధ్య ఉన్న విద్యుత్తు స్తంభాలను గుర్తించి ఎందుకు తొలగించలేదని పురపాలక అధికారులను ప్రశ్నించారు. వెంటనే తొలగించాలని ట్రాన్స్‌కో ఎస్‌ఈని ఆదేశించారు. ఇటీవల నాల్గో విడత పట్టణ ప్రగతి ముగిసినా స్తంభాలు తొలగించిన పాపాన పోలేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా పొలాల్లో విద్యుత్తు తీగలు, స్తంభాల సమస్యలు ఉన్నాయి. రైతులు విద్యుత్తు శాఖ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా స్పందన ఉండటం లేదు. ట్రాన్స్‌కో ఆపరేషన్స్ డీఈ చంద్రమౌళిని సంప్రదించగా



పట్టణ, పల్లెప్రగతి కార్యక్రమాల్లో చాలావరకు విద్యుత్తు సమస్యలు పరిష్కరించామన్నారు. ఇప్పటివరకు మహబూబ్‌నగ్క, నారాయణపేట జిల్లాల పరిధిలో పట్టణ ప్రాంతాల్లో 126 విద్యుత్తు స్తంభాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేశామన్నారు. పల్లెటూళ్లలో 2,034 ప్రాంతాల్లో వేలాడే విద్యుత్తు తీగలు బిగించి, మధ్యలో అవసరమైతే స్తంభాలు ఏర్పాటుచేశామని చెబుతున్నారు. సమస్యలు మాత్రం ఎక్కడివక్కడే కనిపిస్తున్నాయి.

ప్రజలు దినదిన గండంగానే కాలం గడపాల్సి వస్తోంది. పల్లె ప్రగతి సందర్భంగా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవటం లేదని గ్రామీణులు చెబుతున్నారు. నవాబ్‌పేట, రాజాపూర్, మిడ్జిల్ మండలాల్లో పరిశీలనలో వెలుగుచూసిన సమస్యలు జిల్లాలో క్షేత్రస్థాయి పరిస్థితికి అద్దంపడుతున్నాయి.

తీగలు కిందపడినా సరిచేయలే

పది రోజులు కిందట నవాబ్‌పేట మండలం రుక్కంపల్లి సమీప పొలంలో విద్యుత్తు తీగలు కిందపడ్డాడాయి. రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య ఇంకా పరిష్కరించలేదు. చెన్నారెడ్డిపల్లి రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్తు స్తంభానికి చెట్టు తీగలు అల్లుకుపోవడంతో సరఫరాలో అంతరాయం ఏర్పడి మోటార్లు కాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఎన్మన్‌గండ్ల శివారులోని పొలంలో రెండు స్తంభాలు ప్రమాదకరంగా ఒకవైపు ఒరిగాయి. ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఏఈ నర్సిములుని సంప్రదిస్తే తన దృష్టికి రాలేదని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. మిడ్జిల్‌తో పాటు ఈ మండలంలోని రాణిపేట, కంచనపల్లి, భైరంపల్లి, దోనూరు, కొత్తపల్లి, కొత్తూరు, వెలుగొముల గ్రామాల్లో వెలాడుతున్న విద్యుత్తు తీగలు ఎక్కువగా ఉన్నాయి. రైతులు భయాందోళనకు గురవుతున్నారు. కొద్దిపాటి వర్షానికి, ఈదురుగాలులకు కూడా సరఫరా నిలిచిపోయి. ఇబ్బందులకు గురవుతున్నారు.

ప్రాణాలు పోతేనే స్పందిస్తారా?

రాజాపూర్ : నా పొలంలో 11 కేవీ విద్యుత్తు తీగలు చేతికి అందే ఎత్తులో ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. ఏడాది నుంచి విద్యుత్తు శాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. తీగలు తాకకుండా నేనే కర్రెలు ఏర్పాటుచేయాల్సి వచ్చింది. గాలి తీవ్రతకు కర్రెలు నేలపై పడిపోతున్నాయి. తీగలు ఒకదానికొకటి తగిలి మంటలు వస్తున్నాయి. చాలాసార్లు ప్రమాదం నుంచి త్రుటిలో బయటపడ్డా. విద్యుత్తు శాఖ అధికారులు ప్రాణాలు పోతే తప్ప స్పందించరా?– తిరుపతయ్య, రైతు, తిర్మలాపూర్(రాజాపూర్)

# ఇసుకతో కాసుల పంట

వనపర్తి : 'తివిరి ఇసుమున తైలంబుదీయవచ్చు'... అన్న నానుడి జిల్లా కేంద్రంలోని ఇసుకాసురులకు చక్కగా వర్తిస్తుంది. ఆర్జనే ధ్యేయంగా కొందరు చెరువుల్లోని ఇసుకను తవ్వుతున్నారు. నిన్నమొన్నటి వరకు చెరువుమట్టిని అక్రమంగా తవ్వుకున్న వారు ప్రస్తుతం ఇసుక రవాణాను ప్రారంభించారు. అడుగుల లోతు నుంచి పిండేస్తున్నారు. సాధారణంగా చెరువు మట్టని వానాకాలానికి ముందు వేసవిలో రైతులు పొలాలకు తరలిస్తారు. జిల్లా కేంద్రం శివారులోని తాళ్లచెరువు మట్టని మాత్రం రైతులకంటే ఎక్కువగా ఇటుక బటల్టీల నిర్వాహకులే పెద్ద మొత్తంలో పోటీపడి మరీ తరలించుకుపోయారు. వారికి అనుమతి ఎవరిచ్చారంటే మేం కాదంటే.. మేం కాదని నీట్జపారుదల, మైనింగ్ శాఖల అధికారులు చెబుతున్నారు. అక్రమార్కులు వందల ట్రాక్టర్ల మట్టని మాత్రం తరలించారు. తాజాగా వారి దృష్టి మట్టి తవ్వగా కనిపించే చెరువులోని ఇసుకపై పడింది. తాళ్లచెరువులో ఇసుకను తవ్వి తరలించి ఈదుల చెరువు చెంతన పెద్దమొత్తంలో కుప్పలుగా పోస్తున్నారు. రైతుల శిఖం భూమిలో నుంచి మట్టిని వారి అనుమతితో తరలించుకున్నామన్న అక్రమార్కులు ఇప్పుడు ఏకంగా చెరువు మధ్య భాగంలో ఇసుకను తీస్తున్నారు.

టిప్పర్ల కొద్దీ తరలింపుగతంలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలించేవారు. ఇప్పుడు పెద్ద యంత్రాలతో తవ్వుతూ టిప్పర్లలో నింపి అక్రమంగా తీసుకెళుతున్నారు. గతంలో మట్టి తవ్వుకుంటే ఎవరూ పట్టించుకోలేదన్న ధీమాతో ఇసుకను తరలిస్తున్నారు. నిబంధనల ప్రకారం చెరువులో అయిదు అడుగులకు మించి మట్టిని తవ్వరాదు. అలాంటిది మట్టి తరవాత ఇసుకనూ తవ్వేస్తున్నారు. టిప్పర్లలో తరలిస్తూ మరో చెరువు చెంతన కుప్పలుగా పోస్తున్నారు. తరవాత ఫిల్టర్ చేసి ఇసుకను విక్రయించాలన్నది వారి ఉద్దేశం. గతంలో పొక్లెయిన్‌తో తవ్వి ఒక ట్రాక్టరులో ఇసుక నింపితే రూ.150 నుంచి రూ.300 తరలించేవారు ఇచ్చేవారు. ఇప్పుడు వానలు కురవక ముందే పెద్ద మొత్తంలో ఇసుకను తరలించేందుకు యంత్రాలను మాట్లాడుకున్నారు. ఒక టిప్పరులో ఇసుకను నింపడానికి రూ.400లను యంత్రం చోదకుడికి ఇస్తున్నట్లు సమాచారం. ఒక టిప్పరులో ఆరు యూనిట్ల (6 ట్రాక్టర్లు) ఇసుక నింపుతారు. అలా వందలకొద్దీ టిప్పర్లను నింపుతున్నారు. ఫిల్టర్ ఇసుకను తయారు చేసి విక్రయించినా ఒక్కో ట్రాక్టరుకు రూ.2,500 వరకు తీసుకుంటారు.

# రహదారులపైనే వాహనాలు

కరీంనగర్ : 'భవన నిర్మాణ అనుమతిలో వాణిజ్య భవనాలకు కచ్చితంగా పార్కింగ్ స్థలాన్ని సూచించినట్లుగా పార్కింగ్ కోసమే వినియోగించుకోవాలి. ఈ ప్రదేశంలో ల్యాబ్‌లు, వాచ్‌మెన్ గదులు, దుకాణాలు, స్టోర్ రూంలు వంటివి నిర్మిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రైవేటు సంస్థలు, ఆసుపత్రులు ఉన్న ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా అంబులెన్సులు, వాహనాలు, కార్లు నిలిపి వీధులను ఇరుకుగా మారిస్తే జరిమానా వేస్తాం.'

ఈనెల 9న సమీక్ష సమావేశంలో నగర మేయర్ సునీల్‌రావు ఆదేశాలు. పెరుగుతున్న జనాభా.. వాహనాలకు తగ్గట్లుగా రహదారులు పెరగడం లేదు. ఉన్న రహదారులు అభివృద్ధి పనుల పేరుతో మరింత కుదించుకుపోయాయి..కొత్త నిర్మించుకునే భవనాలు లోపలకు జరిగి కట్టుకోవాల్సి ఉండగా ఎవరూ పట్టించుకోవడం లేదు. వ్యాపార, వాణిజ్య సంస్థలు, ప్రైవేటు ఆసుపత్రులు, బహుళ అంతస్తులు, కల్యాణ మండపాలు, పాఠశాలలు, ఇతర దుకాణాలు ఏవైనా సరే రోడ్డే పార్కింగ్ స్థలంగా మార్చుకుంటున్నారు. కొందరు సిల్ట్, సెల్లార్లు నిర్మించుకుంటున్నా వాటిని ఉపయోగంలోకి తీసుకోవడం లేదు. ఇంకేముంది రద్దీ సమయాల్లో ప్రధాన, అంతర్గత రహదారులపై రాకపోకలు సాగించాలంటే నరకయాతన అనుభవించాల్సి వస్తోంది.



నివాసానికి అనుమతి.. వాడేది వాణిజ్యం

నిర్మాణ సమయంలో నివాసిత గృహంగా పేర్కొంటూ భవన నిర్మాణాలకు అనుమతి తీసుకుంటున్నారు. ఆ నిర్మాణం పూర్తయిన తర్వాత కల్యాణ మండపాలకు, అతిథిగృహాలకు, ఆసుపత్రులకు, ఇతర వాణిజ్య సంస్థలకు అద్దెకిస్తున్నారు. కొందరు నేరుగా వాణిజ్య భవనాల పేరు మీద అనుమతి తీసుకుంటుండగా పార్కింగ్ స్థలం వదలడం లేదు. ఇలాంటివి తనిఖీ చేస్తే బల్దియాకు ఆదాయం పెరగడంతోపాటు రాకపోకలు సాగించే ప్రజలకు సౌకర్యంగా మారనుంది.

తీరు మారేనా? సెల్లార్లు వాడకుండా, రోడ్లపై పార్కింగ్ చేసి రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్నట్లుగా ఏటా ఫిర్యాదులు వస్తుండగా ఒకటెండ్రు వాణిజ్య భవనాలకు నోటీసులు ఇచ్చి వెనక్కి వస్తున్నారు. నోటీసులు ఇచ్చినా ఎలాంటి ఫలితం ఉండటం లేదు. ఎప్పటిలాగే రోడ్ల మీదనే పార్కింగ్ చేయిస్తున్న వాణిజ్య సంస్థలు, ప్రైవేటు ఆసుపత్రులు లెక్కలేనన్నీ ఉన్నాయి. వర్షాకాలంలో సెల్లార్లలోకి వరద చేరుతున్నా పట్టించుకునే వారు లేరు. నిండిన నీటిని తోడేస్తూ.. రోడ్డు మీదకు వదులుతున్నారు. కొందరు సెల్లార్లకు తాళం వేసుకొని వాహనాలు బయట నిలుపుతున్న వారున్నారు. ఇవన్నీ పట్టణ ప్రణాళిక అధికారులకు తెలిసినా 'మాములు'గా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. నగర మేయర్ వై.సునీల్‌రావు ఆదేశాల మేరకు ఇలాంటి సంస్థలు, ఆసుపత్రులపై నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటారో లేదో చూడాల్సిందే.

అత్యధికంగా కరీంనగర్‌లోనే..జిల్లా కేంద్రం, ఆపై నగరం కావడంతో వాణిజ్య అవసరాలకు సంబంధించిన భవనాలు అత్యధికంగా ఉన్నాయి. నగరంలోని 60 డివిజన్లలో సుమారు 5,364 వాణిజ్య భవనాలు ఉన్నట్లుగా రెవెన్యూ రికార్డులను బట్టీ తెలుస్తోంది. వీటిలో కొన్ని చిన్న దుకాణాలు ఉండగా మిగతావి పెద్ద పెద్ద దుకాణాలు, సంస్థలు ఉన్నాయి. వాటన్నింటికీ టౌన్ ప్లానింగ్ నిబంధనల ప్రకారం పార్కింగ్ స్థలాలు ఉండాల్సిందే.

# అందుబాటులో వసతులు.. అట్టడుగున ఫలితాలు

పెద్దపల్లి : ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలలు వెనుకబడ్డాయి. ఆధునిక వసతులు, సరిపడా బోధనా సిబ్బంది, అందుబాటులో మౌలిక వసతులు, విద్యార్థుల దత్తత, అధ్యాపకులు తరచూ చరవాణిలో తల్లిదండ్రులను సంప్రదించడం.. తదితర కార్యక్రమాలు చేపట్టినా ఫలితం అంతంతమాత్రంగానే ఉంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి ఇంటర్ ఫలితాలు పడిపోయాయి. మూడేళ్ల కిందటి కొవిడ్ మహమ్మారి ప్రభావం ఉత్తీర్ణతపై కనిపించింది. అప్పట్లో ప్రత్యక్ష బోధన స్థానంలో ఆన్‌లైన్ పాఠాలు నిర్వహించారు. అప్పట్లో 8, 9 తరగతులు చదివిన విద్యార్థులు ఇటీవల ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాశారు. వారిలో కనీస విద్యా సామర్థ్యాలు లేకపోవడంతో ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదు. విద్యార్థుల గైర్హాజరు కూడా ఫలితాలు తగ్గడానికి కారణంగా విశ్లేషిస్తున్నారు. మరోవైపు ద్వితీయ సంవత్సరంలో కంటే ప్రథమంలో ఉత్తీర్ణత భారీగా తగ్గింది. గురుకులాలే ప్రథమం

జిల్లాలో ప్రథమ సంవత్సరంలో మంథని బాలుర జూనియర్ కళాశాలలో 71 మందికి అయిదుగురు మాత్రమే ఉత్తీర్ణత(7 శాతం) పొందారు. ముత్తారంలో 65కు 9 మంది(14 శాతం) గట్టెక్కారు. ద్వితీయ సంవత్సరంలో జూలపల్లి అట్టగుడున నిలిచింది. ఇక్కడ 96 మందికి 18 మంది మాత్రమే(18.75) శాతం ఉత్తీర్ణతయ్యారు. ముత్తారంలో 73కు 14 మంది(19.18 శాతం) పాసయ్యారు. ప్రథమంలో మంథని మైనారిటీ గురుకులంలో 95 శాతం, నందిమేడారం సాంఘిక సంక్షేమ గురుకులంలో 90 శాతం, ద్వితీయలో మంథనిలో 96.08 శాతం, నందిమేడారంలో 91.55 శాతం, గర్రెపల్లిలో 89.47 శాతం, గోదావరిఖనిలో 83.12 శాతం, మంథని మైనారిటీ గురుకులంలో 93.10 శాతం ఉత్తీర్ణత పొందారు.

అన్నీ బాగున్నా..

జిల్లాలో 14 ప్రభుత్వ కళాశాలలు, 7 ఆదర్శ, 5 సాంఘిక సంక్షేమ, 4 కస్తూర్బా, 1 గిరిజన, 3 మైనార్టీ, 3 జ్యోతిబాపూలే గురుకుల కళాశాలల్లో కలిపి ఈ ఏడాది ప్రథమంలో 3,783 మందికి 1,775 మంది(46.92 శాతం), ద్వితీయలో 3,849 మందికి 2,321 మంది(60.30 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ కళాశాలలకు పక్కా భవనాలున్నాయి. ప్రయోగ, కంప్యూటరు గదులు అందుబాటులో ఉండగా, విద్యార్థులకు మౌలిక వసతుల కొరత లేదు. బోధనపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించేందుకు అధ్యాపకులు, నిపుణులు వ్యక్తిత్వ వికాస తరగతులు బోధించినా ఫలితాలు ఆందోళన కలిగిస్తున్నాయి.

పర్యవేక్షణ లోపంమండలానికి ఒక గురుకులం, కస్తూర్బా కళాశాలలు ఉన్నాయి. ఉచిత భోజనం, పాఠ్యపుస్తకాలు, నాణ్యమైన విద్య అందుబాటులో ఉండటంతో ప్రతిభావంతులైన విద్యార్థులు గురుకులాల్లో చదువుతున్నారు. ఆర్థికంగా ఉన్న పిల్లలు ప్రైవేటుకు వెళ్తున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో చాలా మంది నిరుపేద విద్యార్థులు కావడంతో గైర్హాజరు శాతం పెరుగుతోంది. తల్లిదండ్రుల పర్యవేక్షణ కొరవడింది. అధ్యాపకులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అధ్యాపకులు లేని చోట అతిథి అధ్యాపకులతో తరగతులు నిర్వహించారు.

# పురిట్లోనే చంపేస్తున్నారు..!!



మహబూబాబాద్ : ఆకాశమే హద్దుగా దూసుకెళ్తున్న ఆడపిల్లలు వారికి బరువవుతున్నారు.. పుట్టేది ఆడబిడ్డ అని తెలుసుకుని తల్లి కడుపులోనే కడతేరుస్తున్నారు. వారి కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాల్సిన వైద్యులూ కాసులకు కక్కుర్తిపడి లింగనిర్ధారణ పరీక్షలు చేస్తూ కడుపులోని బిడ్డను కరిగించేస్తున్నారు. లింగనిర్ధారణ పరీక్షలు ఎక్కువగా వరంగల్ జిల్లా నెక్కొండ, నర్సంపేట, వరంగల్ నగరంలో జరుగుతున్నాయి. నెక్కొండ, నర్సంపేట ప్రాంతాల్లో స్కానింగ్ నిర్వహించి పుట్టబోయే బిడ్డ గురించి చెప్పినందుకు రూ.5 వేలు తీసుకుంటున్నారు. ఈ వ్యవహారం అక్కడి ఆసుపత్రుల్లో పనిచేస్తున్న సిబ్బందితోనే కొనసాగుతుంది. ఆడపిల్ల పుడుతుందని తెలుసుకున్న వారు అదే ఆసుపత్రి వైద్యుడితో మాట్లాడుకొని అబార్షను చేయించుకుంటున్నారు. ఇందుకు రూ.30 వేలు చెల్లిస్తున్నారు.

నర్సంపేట కేంద్రంగా..

గత ఫిబ్రవరిలో మహబూబాబాద్ జిల్లా గంగారం మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళకు మొదటి కాన్పులో ఆడపిల్ల జన్మించింది. రెండోసారి ఆడబిడ్డే అని తెలిసి నర్సంపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి రాగా వైద్యురాలు నోటి మాత్ర ఇచ్చారు. తీవ్ర రక్తస్రావం కావడంతో ఆమెను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడ గర్భవిచ్ఛిత్తి చేసి పంపారు. దీనిపై అప్పట్లో విచారణ జరిపిన వైద్యాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా వదిలేశారు.

గత ఆగస్టులో చెన్నారావుపేట మండలంలోని గిరిజనతండా యువతికి ములుగు జిల్లాలోని ఓ యువకుడితో వివాహమైంది. మొదటి సంతానంగా కుమార్తె జన్మించింది. రెండో కాన్పులో మళ్లీ ఆడపిల్ల అని తెలుసుకొని నర్సంపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో భర్తకు తెలియకుండా గర్భస్రావం చేయడంతో ఆయన గొడవ చేశారు. తర్వాత కొందరు కల్పించుకొని సర్దిచెప్పారు. నర్సంపేట మండలం బోజ్యానాయక్‌తండాకు చెందిన వివాహిత రెండోసారి గర్భం దాల్చగా మళ్లీ ఆడపిల్ల అని తెలడంతో కిందటి నెలలో పట్టపగలే గర్భస్రావం చేసి పంపారు. గతేడాది యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి ఇక్కడకు వచ్చి గర్భస్రావం శస్త్ర చికిత్స చేయించుకుని వెళ్లారంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

మహబూబాబాద్ నుంచి వరంగల్ హంటర్ రోడ్‌కు..

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గుట్టుచప్పుడు కాకుండా అబార్షన్లు జరుగుతున్నాయి. గతంలో మూతపడిన ఓ ఆసుపత్రిని ఇందుకోసమే రెండేళ్ల కింద పునఃప్రారంభించారు. ఈ ఆసుపత్రికి వెళ్లిన గర్భిణులను స్కానింగ్ కోసం వరంగల్‌లోని హంటర్‌రోడ్‌కు పంపిస్తారు. అక్కడికి వెళ్లిన తర్వాత గర్భిణిని ఒక్కరినే ప్రత్యేక వాహనంలో అక్కడ విద్యాసంస్థలు ఉండే ఏరియాలోని ఓ వైద్యురాలి వద్దకు తీసుకెళ్తారు. ఆమె రూ.7 వేలు తీసుకుని లింగ నిర్ధారణ చేసి ఫలితం చెబుతుంది. ఈ స్కానింగ్ నివేదికను తీసుకుని వస్తే దాని ఆధారంగా మహబూబాబాద్ జిల్లాకేంద్రంలోని ఆసుపత్రిలో అబార్షన్ చేస్తున్నారు. ఇందుకు ఇక్కడ రూ.35 వేలు తీసుకుంటున్నారు. ఈ దవాఖానాలో నెలకు 20 వరకు అబార్షన్లు జరుగుతున్నట్లు తెలిసింది. ఈ లెక్కన జిల్లా కేంద్రంతో పాటు తొర్రూరు, ఇతర ప్రాంతాల్లో ఎన్ని జరుగుతున్నాయో లెక్కలేదు. మహబూబాబాద్ జిల్లాలో ఆడపిల్లల నిష్పత్తి తగ్గుతుండడంతో వైద్యాధికారులు అబార్షన్లు జరుగుతున్న తీరుపై దృష్టి సారించారు. 2017-18 నుంచి 2023-24 ఏప్రిల్ వరకు జిల్లాలో 4,003 అబార్షన్లు జరిగినట్లు గుర్తించారు.

మొబైల్ స్కానింగ్ యంత్రాలతోనూ..

ఖమ్మం, వరంగల్ జిల్లాల్లోని కొంత మంది వైద్యులు లింగనిర్ధారణకు మొబైల్ స్కానింగ్ యంత్రాలను వినియోగిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కొన్ని పల్లెల్లో ఆర్‌ఎంపీల సహాయంతో గర్భిణుల ఇళ్లకు మొబైల్ యంత్రాలను తీసుకొచ్చి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. ఇళ్లలో వీలు కాకుంటే శివారుల్లోని మామిడి తోటలు, ఫాంహౌస్‌లలో పరీక్షలు చేస్తున్నట్లు సమాచారం. ఇందుకోసం రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు తీసుకుంటున్నారు. 15 నెలల కిందట మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలంలోని ఓ పంచాయతీలో ఖమ్మం జిల్లాలోని ఓ వైద్యుడు మొబైల్ యంత్రంతో గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు నిర్వహిస్తుండగా విషయం తెలుసుకున్న ఆ గ్రామ పెద్ద మనిషి వారిని మందలించి పంపించారు.

వివిధ ప్రాంతాల నుంచి రాక

వరంగల్ హంటర్‌రోడ్‌లోని రహస్య స్కానింగ్ కేంద్రం, నెక్కొండ, నర్సంపేట ప్రాంతాల్లో స్కానింగ్ నిర్వహిస్తున్న ఆసుపత్రులకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచే కాకుండా ఉమ్మడి నల్గొండ, కరీంనగర్, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి గర్భిణులు వస్తున్నారు. వీరంతా ఆర్‌ఎంపీలు, ఔషధ దుకాణాల నిర్వాహకుల సహకారంతో ఈ స్కానింగ్ కేంద్రాలకు వస్తున్నట్లు తెలిసింది.

ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నాం

-డాక్టర్ బి.హరీష్‌రాజ్, జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారిజిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న గర్భస్రావాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. ఇటీవల కలెక్టరేట్‌లో జిల్లా కమిటీ ప్రత్యేక సమావేశం నిర్వహించి గర్భస్రావాలు, ఆడ పిల్లల విక్రయాలపై చర్చించాం. అవసరం లేకుండా గర్భస్రావం చేసినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని సంబంధిత వైద్య నిపుణులను హెచ్చరించాం. ఇలాంటి సంఘటనలు జరిగితే ఆసుపత్రిని సీజ్ చేయడంతో పాటు చట్టపరంగా కేసులు నమోదు చేస్తాం.

# పురపాలికలో పెరిగిన ఆస్తి పన్ను



భూపాలపల్లి : గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్నుల భారం పెరిగింది. కొత్త పురపాలక చట్టం 2019 ప్రకారం ఆస్తి పన్నును నమోదు చేయడంతో పన్ను చెల్లింపుదారులు లబోదిబోమంటున్నారు. ఏడాది కాలంగా ఆన్‌లైన్‌లో భువన్ సర్వే నమోదును వేగవంతం చేయగా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వాటిని అమల్లోకి తీసుకొచ్చారు. ఇప్పటి వరకు కేవలం ఇంటి నిర్మాణ కొలతల ఆధారంగా మాత్రమే పన్నులు వసూలు చేసిన ప్రభుత్వం.. తాజాగా ఇంటి ఆవరణలోని ఖాళీ స్థలానికి కూడా పన్ను విధించే విధానాన్ని కొత్త సాఫ్ట్‌వేర్‌లో పొందుపరిచారు. దీంతో రెండింతల భారం పడనుందని ప్రజలు వాపోతున్నారు. మరోవైపు ఆస్తుల రిజిస్ట్రేషన్ కార్యాలయంలో నమోదైన విలువను పరిగణనలోకి తీసుకోవడం వల్ల పన్నుల విలువ అమాంతం పెరిగిపోయింది. ఇలా రూపొందించిన సాఫ్ట్‌వేర్‌లో వార్డులోని ఇంటి చిత్రాన్ని నమోదు చేస్తే చాలు, ఎంత మొత్తం పన్ను విధించాలో అదే లెక్కిస్తుంది.

అస్తవ్యస్తంగా సర్వే..

పురపాలక శాఖ ఆదేశాలతో 2020లో మొబైల్ అప్లికేషన్ ద్వారా ఇస్రో భువన్ సర్వేను తాత్కాలిక సిబ్బందితో నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులకు కొంత నగదు అందించి సర్వే చేయించాలని ప్రభుత్వం సూచించింది. అయితే ఇక్కడ మాత్రం అధికారులు స్థానికంగా ఉన్న బిల్లు కలెక్టర్ల ద్వారానే భువన్ సర్వే చేయించి, వివరాలు నమోదు చేయించారు. వారికి అవగాహన లేకపోవడంతో హడావుడిగా కొలతలు తీశారనే ఆరోపణలు అప్పట్లో వినిపించాయి. కొన్ని ఇళ్లకు కొలతలు ఎక్కువ వచ్చాయని ఇళ్ల యజమానులు ఫిర్యాదులు కూడా చేశారు. అదే విధంగా కొన్ని ఇళ్లకు తాళాలు వేసి ఉండడంతో తప్పులతడకగా వివరాలు నమోదు చేశారని పలు వార్డులకు చెందిన ఇళ్ల యజమానులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి వారు కొందరు ఆస్తి పన్ను చెల్లించకపోవడంతో తడిసిమోపెడయ్యాయి. గృహ ఆస్తులకు ఒక మొత్తాన్ని, వాణిజ్య సముదాయాలకు రెట్టింపు పన్నులు విధించేలా సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేశారు. ఈ విధానాన్ని రద్దు చేసి, మరో సారి ఆస్తి కొలతలను లెక్కించాలన్న డిమాండ్ పన్ను చెల్లింపుదారుల నుంచి వినిపిస్తోంది.

శివారు గ్రామాలపై తీవ్ర ప్రభావం

భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో కాశీంపల్లి, వేశాలపల్లి, జంగేడు, పుల్లూరిరామయ్యపల్లి పంచాయతీలు విలీనమైన విషయం తెలిసిందే. కొత్తగా నగర పంచాయతీగా ఆవిర్భవించినప్పుడు జనాభా తక్కువగా ఉందనే కారణంతో ఈ నాలుగు గ్రామాలతో పాటు మరో తొమ్మిది శివారు గ్రామాలను ఇందులో చేర్చడంతో వాటిపై కూడా 'భువన్' ప్రభావం పడింది. చిన్న పంచాయతీలైన ఇవి పురపాలిక పరిధిలోకి వచ్చినా సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. గ్రామాల్లో ఎక్కువగా నిరుపేదలు ఉన్నా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో నమోదు చేసిన విలువ ప్రకారమే పన్నులు చెల్లించాల్సి వస్తోంది. ఇప్పటికే ఇంటి నిర్మాణానికి పడుతున్న ఇబ్బందులకు తోడు పన్నుల బాదుడుపై ఆందోళన చెందుతున్నారు. చాలా వరకు గ్రామాల్లో కొందరు పన్నులు చెల్లించకపోవడంతో లక్ష్యం ప్రకారం ఆస్తి పన్ను వసూలు కావడం లేదని కొందరు బిల్లు కలెక్టర్లు పేర్కొంటున్నారు. ఖాళీ స్థలంలో చిన్న గుడిసె ఉన్నా మొత్తం స్థలానికి పన్ను చెల్లించాల్సి ఉండటంతో నిరుపేదల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. మరో వైపు 75 చదరపు అడుగులలోపు నిర్మాణానికి కేవలం రూ.100 మాత్రమే వసూలు చేయాల్సి ఉన్నా, ఆవరణలోని ఖాళీ స్థలానికి పన్నులు విధించనున్నారు.

ఆసవరాలు తప్పుగా నమోదైతే సరి చేస్తాం

– భాస్కర్, ఆర్ఐ, భూపాలపల్లి మున్సిపాలిటీ

పురపాలకశాఖ ఆదేశాలతో 'భువన్' ద్వారా ఆస్తులను లెక్కిస్తున్నాం. రిజిస్ట్రేషన్ విలువ ఆధారంగా ఆస్తుల విలువలు యాప్‌లో నమోదయ్యాయి. దీంతో వాటంతట అవే నమోదవుతాయి. ప్రక్రియ కూడా పూర్తి దశకు చేరింది. నమోదైన వాటికి కొత్త పన్నులు అమల్లోకి వస్తాయి. ఎవరికైనా ఆస్తుల వివరాలు తప్పుగా నమోదై ఉంటే మా దృష్టికి తెస్తే పరిశీలించి సరి చేస్తాం.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ చికిత్స

గోదావరిఖని : ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో ఐఎస్ఓ తరహాలో నాణ్యతా ప్రమాణాలను పెంపొందించడంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. జాతీయ ఆరోగ్య మిషన్ పరిశీలన బృందం కేటాయించే మార్కుల ఆధారంగా జాతీయ స్థాయిలో అవార్డులు ప్రకటిస్తూ ఆర్థిక ప్రోత్సాహకాలను అందిస్తోంది. తాజాగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు ఆరోగ్య కేంద్రాలు 'ఎన్‌క్వాష్' ధ్రువీకరణకు ఎంపిక కాగా ఇటీవలె గోదావరిఖని, సుల్తానాబాద్ ఆసుపత్రులను 'ముస్కాన్' ధ్రువీకరణ కోసం పరిశీలించారు. తల్లీ బిడ్డల ఆరోగ్యంతో అనుబంధాన్ని పెంచేలా కరీంనగర్, గోదావరిఖని ఆసుపత్రుల్లో 'కంగారూ' విధానాన్ని కొనసాగిస్తున్నారు. ఇటీవల గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిని 'లక్ష్య'కు ఎంపిక చేయగా పెద్దపల్లిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఉమ్మడి జిల్లాలోని పలు ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో 'కాయకల్ప' పరిశీలన పూర్తికాగా ఫలితాలు వెలువడాల్సి ఉంది. నేషనల్ హెల్త్ సిస్టమ్ రిసోర్సు సెంటర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలకు లక్ష్య, ఎన్‌క్వాష్, ముస్కాన్, స్వచ్ఛభారత్ అభియాన్ ఆధ్వర్యంలో 'కాయకల్ప' పోటీలను కేంద్రం నిర్వహిస్తుంది. ఈ పోటీల్లో ఎంపికైన ఆసుపత్రులకు ఇచ్చే ఆర్థిక ప్రోత్సాహకాల్లో 25శాతం సిబ్బందికి చెల్లిస్తూ మిగతా 75 శాతం నిధులను ఆసుపత్రి అభివృద్ధికి వినియోగించాల్సి ఉంటుంది. స్వచ్ఛతలో 'కాయకల్ప'

ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో స్వచ్ఛతను పెంపొందించాలనే లక్ష్యంతో జాతీయ స్థాయిలో స్వచ్ఛభారత్ అభియాన్ ఆధ్వర్యంలో 'కాయకల్ప' పోటీలను నిర్వహిస్తోంది. గతంలో పెద్దపల్లి జిల్లా లక్ష్మీపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరుసగా రెండు సార్లు కాయకల్పకు ఎంపికైంది. తాజాగా జూలపల్లిలోని ప్రాథమిక, అడ్డగుంటపల్లిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, దూళికట్టలోని ఆరోగ్య ఉపకేంద్రం(పల్లె దవాఖానా)ను జిల్లాస్థాయి కమిటీ ఎంపిక చేసింది. త్వరలో రాష్ట్ర, జాతీయ స్థాయి కమిటీలు పరిశీలించాక సంతృప్తికరమైన మార్కులు వస్తే 'కాయకల్ప అవార్డునకు ఎంపిక కానున్నాయి.

మెరుగైన సేవలకు 'లక్ష్య'

సహజ ప్రసవాలు, శస్త్ర చికిత్సతో ప్రసవాల విభాగాల్లో మొత్తం 148 అంశాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి మార్కులు కేటాయిస్తారు. 'లక్ష్య'లో ఎంపికైన ఆసుపత్రికి ఒక్కో విభాగానికి రూ.3 లక్షల చొప్పున రెండు విభాగాల్లో రూ.6 లక్షల ఆర్థిక ప్రోత్సాహకాన్ని వరుసగా మూడేళ్లు ప్రభుత్వం అందిస్తుంది. మూడేళ్ల కిత్రం గోదావరిఖని ఆసుపత్రి 'లక్ష్య'కు ఎంపిక కాగా గడువు ముగియడంతో తాజాగా మరోసారి పరిశీలన పూర్తి చేసి లక్ష్యకు ఎంపిక చేశారు.

చిన్నారుల్లో చిరునవ్వు 'ముస్కాన్'

చిన్నారుల ముఖాల్లో చిరునవ్వులను పెంపొందించాలనే లక్ష్యంతో కేంద్రం 'ముస్కాన్' పథకాన్ని ప్రవేశపెట్టింది. గోదావరిఖని, సుల్తానాబాద్ ఆసుపత్రులను ఇటీవలె ముస్కాన్ ప్రతినిధులు పరిశీలించగా ఫలితాలు వెలువడాల్సి ఉంది. పిల్లల్లో మానసిక, శారీరక ఉల్లాసం కల్పించేలా ఆట వస్తువులతో పాటు ఆసుపత్రిలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని నెలకొల్పాల్సి ఉంటుంది.

నాణ్యతా ప్రమాణాలకు 'ఎన్‌క్వాష్'

ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలను మెరుగు పరచాలనే లక్ష్యంతో 'ఎన్‌క్వాష్'(నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్)ను రూపొందించారు. లక్ష్మీపురం ఆరోగ్యకేంద్రం ఈ పథకానికి ఎంపికవడంతో రూ.3 లక్షల చొప్పున అందించనున్నారు. వివిధ విభాగాల్లో వైద్య సేవలు, నిర్వహణ తీరు, రోగులతో సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు ఆధారంగా మార్కులు కేటాయిస్తారు. ఇప్పటివరకు ఆసుపత్రులు, పీహెచ్‌సీలకు మాత్రమే వర్తింపజేయగా ఈసారి ఉప కేంద్రాలకు వర్తింపజేశారు.

సిబ్బందికి ప్రోత్సాహం.. మెరుగైన వైద్యం

-అనిల్‌కుమార్, జిల్లా నాణ్యతా మేనేజర్

కేంద్రం ప్రవేశపెట్టిన పథకాలతో ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలకు ప్రోత్సాహం అందుతుంది. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ తరహా వైద్య సేవలను అందుబాటులోకి తేవడమే కేంద్రం లక్ష్యం. ఆసుపత్రి స్థాయిలో, జిల్లా స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో, జాతీయ స్థాయిలో మొత్తం నాలుగు విభాగాల్లో పరిశీలనలు ఉంటాయి. .

# ఇక గడువులు లేవు.. వసూలే..!

2021-22 యాసంగి సీఎంఆర్ బియ్యం ఇవ్వాల్సిన మిల్లర్లు ఈ నెలాఖరు వరకు పెట్టాలని మరో గడువు ఇస్తూ కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. ఈనెల 31 వరకు ఉన్న బకాయి బియ్యం లక్ష్యాలను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించింది. ఇక ఈ యాసంగికి సంబంధించి ఎలాంటి గడువు ఇచ్చే ప్రసక్తి లేదని ఉత్తర్వులో పేర్కొన్నారు. దీంతో అప్రమత్తం అయిన ప్రభుత్వం రబీ బియ్యం బకాయి ఉన్న మిల్లులకు నోటీసులు జారీ చేసింది. ఈనెలాఖరు వరకు తమ లక్ష్యాన్ని పూర్తి చేయాలని, లేని పక్షంలో జరిమానాలు విధించి బకాయి బియ్యం వసూలు చేస్తామని అధికారులు మిల్లులకు స్పష్టం చేశారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

ఉమ్మడి జిల్లాలో నల్గొండ జిల్లా జిల్లాకు కేటాయించిన 2,22,053 మెట్రిక్ టన్నుల లక్ష్యాన్ని 100 శాతం పూర్తి చేసింది. యాదాద్రి జిల్లా నుంచి 1,39,357 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ రావాల్సి ఉండగా.. అందులో 1,38,547 మెట్రిక్ టన్నులు ఇచ్చారు. ఇక కేవలం 810 మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రం పెట్టాల్సి ఉంది. ఇక సూర్యాపేట జిల్లాలో మాత్రం 43,984 మెట్రిక్ టన్నుల బియ్యం ఇంకా బకాయి ఉన్నాయి. ప్రతి సంవత్సరం కూడా సీఎంఆర్ పెట్టే విషయంలో సూర్యాపేట జిల్లా మిల్లర్లు కొందరు సతాయిస్తూ వస్తున్నారు. ఈ జిల్లాలోని మిల్లర్లు కోట్ల రూపాయల బియ్యం ఎగవేతకు ప్రయత్నాలు చేస్తున్నారని గత సంవత్సరం ఫిర్యాదులు కూడా వచ్చాయి. జిల్లాలో దాదాపు 36 మంది మిల్లర్లకు గతంలో నోటీసులు ఇవ్వటం, కొన్ని మిల్లులను సీజ్ చేయటం లాంటి చర్యలు తీసుకున్న తరువాత కొందరు మిల్లర్లు ముందు కు వచ్చారు. సూర్యాపేట జిల్లా నుంచి గత యాసంగిలో 1,44,904 మెట్రిక్ టన్నుల బియ్యం లక్ష్యం ఉండగా.. ఇప్పటి వరకు 1,00,920 మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే పెట్టారు. మిగిలిన లక్ష్యం పూర్తి చేసేందుకు ఈనెలాఖరు వరకు గడువు ఇచ్చారు. ఈ మిల్లుల నుంచి బియ్యం లక్ష్యాలను పూర్తి చేసేందుకు పోలీసులు కూడా జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. అయినా నేటికీ లక్ష్యాన్ని పూర్తి చేయలేకపోయారు.

ధాన్యం నిల్వలపై అనుమానాలే..ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ చేసి ఇచ్చేందుకు మిల్లులకు కేటాయిస్తుంది. ధాన్యం తీసుకున్న మిల్లర్లు తీసుకున్న తేదీ నుంచి 15 రోజుల్లో బియ్యం ఇవ్వాలి. కానీ మిల్లర్లు బియ్యం ఇవ్వకుండా కేటాయించిన ధాన్యాన్ని ఇతర వ్యాపార అవసరాలకు వాడుకున్నారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి

# నాలాల పూడికతీత మొదలు

వరంగల్ : నాలాల పూడికతీత పనులకు యంత్రాలు కదిలాయి. ఇంజినీర్లు క్షేత్రస్థాయికి వెళ్లారు. పర్సంటేజీలు తేల్చండి' కథనంపై ఇన్‌ఛార్జి కమిషనర్ ప్రావీణ్య, మేయర్ గుండు సుధారాణి స్పందించి ఇంజినీర్లపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేయడంతో క్షేత్రస్థాయికి వెళ్లారు. హనుమకొండ, వరంగల్, కాజీపేట ప్రాంతాల్లో పూడికతీత పనులు దగ్గరుండి చేయించారు. వరంగల్ ప్రాంతంలో ఎస్సార్‌నగర్, మొగిలిచర్ల, అబ్బనికుంట, పోతననగర్, బొందివాగు, హనుమకొండలో వడ్డేపల్లి మంగళివాగు, రాంనగర్, నయింనగర్, కాజీపేట దర్గా, రామకృష్ణ కాలనీల్లో నాలాల పూడికతీత పనులు జరిగాయి. బల్దియా ఎస్ఈ కృష్ణారావు, ఈఈలు రాజయ్య, శ్రీనివాస్ రావు, డీఈలు సంతోష్‌బాబు, రవికుమార్, రవికిరణ్, ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పనులు పర్యవేక్షించారు. 33 నాలాల పూడికతీత పనులు పారదర్శకంగా జరగాలని, కొత్తగా రూపొందించిన యాప్ రెండు,



మూడు రోజుల్లో అందుబాటులోకి వస్తుందని ఎస్ఈ కృష్ణారావు ఇంజినీర్లకు తెలిపారు. గంటకు వాహనాల పనితీరు, ఎన్ని క్యూబిక్ మీటర్లు పూడిక తీశారో వెంట వెంటనే యాప్‌లో నమోదు చేయాలన్నారు.

నిఘా వర్గాల ఆరా

33 నాలాలు, రూ.2.32 కోట్ల నిధులతో పూడికతీత పనులు ఎలా జరుగుతున్నాయి? పర్సంటేజీలు అడుగుతున్న కార్పొరేటర్లు, పాలకవర్గం పెద్దలు ఎవరెవరు ఉన్నారంటూ నిఘా వర్గాలు ప్రచురితమైన కథనంపై ఆరా తీశారు. కాజీపేట, కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయాల వారీగా నాలాల వివరాలు, నిధులు, గుత్తేదార్ల పేర్లు సేకరించారని తెలిసింది. పూడికతీత ప్రతిపాదనల పెంపుపై విజిలెన్సు ఎన్‌ఫోర్స్‌మెంటు శాఖాధికారులు కూడా ఆరా తీస్తున్నారు.

# పెద్దన్న కష్టాల నుంచి నేర్వాలి పాఠాలు!

మహబూబాబాద్ : ఉమ్మడి జిల్లాలో వరంగల్‌లో మహానగరపాలక సంస్థ కాకుండా మరో తొమ్మిది పురపాలక సంఘాలు ఉన్నాయి.
వర్ధన్నపేట, మరిపెడ, డోర్నకల్, తొర్రూరు కొత్తగా ఏర్పడ్డవి.
జనగామ, భూపాలపల్లి, మహబూబాబాద్, నర్సంపేట, పరకాల పాతవి.
పెద్దవాళ్ల నుంచి మనం అనేక పాఠాలు నేర్చుకుంటాం. పట్టణాల విషయంలో ఇలా జరగడం లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పట్టణాలకు పెద్దన్నలాంటిది వరంగల్ మహానగరం. పది లక్షల జనాభా దాటిన ఈ నగరం ప్రణాళిక లేకుండా విస్తరించడంతో వర్షాకాలంలో ప్రజలు అనేక రకాల సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. నాలాలు పొంగిపొర్లుతున్నాయి. రహదారులు జలమయమవుతున్నాయి. కాలనీలు నీట మునుగుతున్నాయి. వర్షాలు కురిసినప్పుడు తాత్కాలిక హడావుడి చర్యలు చేపట్టడం.. తర్వాత వదిలేయడం.. ఓరుగల్లులో జరిగిన పొరపాట్లే చిన్న పట్టణాల్లో పునరావృతం కాకుండా నేర్వాల్సిన పాఠాలు, ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం.

ఏదీ 'చెత్త'శుద్ధి?

వరంగల్ నగరంలోని చెత్తనంతా మడికొండ డంపింగ్ యార్డులో వేయడంతో అది పేరుకుపోయి పెద్ద సమస్యగా మారింది. మరోవైపు వర్షాకాలంలో మురుగునీరంతా మడికొండలోని చెరువుల్లోకి ప్రవహిస్తోంది. ఫలితంగా స్థానిక ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. చెత్తశుద్ధికి బయోమైనింగ్ మొదలుపెట్టి నిలిపేశారు.

కొత్తగా ఏర్పడిన వర్ధన్నపేటలో సైతం ఇంటింటి చెత్త సేకరణ, దాన్ని పోసేందుకు డంపింగ్ యార్డు సరిగా లేదు. ఆకేరు వాగులోనే చెత్తను పోస్తుండడంతో అది కలుషితమవుతోంది.

ఇలా చేద్దాం: అనేక పట్టణాల్లో డంపింగ్ యార్డులు లేవు. వీటిని రాబోయే పదేళ్లను దృష్టిలో పెట్టుకుని వీటిని ప్రణాళిక ప్రకారం నిర్మించాలి.

పారిశుద్ధ్యం పట్టదా?

వరంగల్‌లో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ లేక వర్షం నీరు రహదారులపై ప్రవహిస్తుంది. వరద నీటి కాలువలు సరిగా లేవు. ఇప్పుడు కొత్త పురపాలికల్లో సైతం రహదారుల పక్కన నాలాలు సరిగా లేక పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయి.

నర్సంపేట మున్సిపాలిటీలో పూర్తిస్థాయిలో డ్రైనేజీ నిర్మాణం కాకపోవడంతో మురుగునీరంతా రహదారులపై ప్రవహిస్తోంది. నగర పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా ఉన్నతీకరణ జరిగినా పట్టణంలో అంతర్గత రహదారులు సరిగా లేవు.

ట్రీట్మెంట్ ప్లాంట్లు కరవుఓరుగల్లులో మురుగునీరు బంధం చెరువు, కోట చెరువు, నాగారం, చిన్నవడ్డెపల్లి చెరువుల్లో కలుస్తోంది. ఈ మహానగరానికి ట్రీట్మెంట్ ప్లాంట్లు లేవు.

ఇదే తరహాలో జనగామ పట్టణం మురుగునీరంతా నెల్లుట్ల చెరువులోకి ప్రవహిస్తోంది. ఇలా చేద్దాం: ప్రతి నగరం, పట్టణంలో మురుగునీటికి ప్రత్యేక ప్రణాళిక ఉండాలి. ఎక్కడా ఇవి కానరావడం లేదు. అన్ని పట్టణాల్లో ట్రీట్మెంట్ ప్లాంట్లు ఏర్పాటుచేస్తే వానాకాలంలో ప్రజలు రోగాల బారిన పడకుండా ఉంటారు.

నాలాలు బాగుచేయాలి

వరంగల్ నగరంలో దశాబ్ద కాలంగా నాలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. వర్షాకాలం వరద నీరు నాలాల్లోకి వెళ్లకుండా కాలనీలను ముంచెత్తుతున్నాయి. రెండేళ్ల కిందట వీటిని విస్తరించేందుకు అక్రమ నిర్మాణాల కూల్చివేత ప్రారంభించారు. అది ఇప్పటికీ పూర్తి కాలేదు. ఇదే తరహాలో అనేక పట్టణాల్లోనూ నాలాలు ఆక్రమణకు గురవుతున్నా పాలక వర్గాలు, అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నాయి.

భూపాలపల్లి పట్టణంలోని కారల్‌మార్క్స్ కాలనీలో ఇప్పటికే కొన్ని నాలాలు ఆక్రమణకు గురయ్యాయి. దీంతో వర్షాలు కురిస్తే లోతట్టు ప్రాంతాలైన కారల్‌మార్క్స్ కాలనీ, రాజీవ్‌నగర్, జవహర్‌నగర్‌లో ఇళ్లు నీట మునుగుతున్నాయి. ఇలా చేయాలి: ఆక్రమణలను గుర్తించి నాలాలను విస్తరిస్తే ఈ సమస్య ఉండదు. నాలాల్లో పూడికతీత చేపట్టాలి.

బృహత్ ప్రణాళికల్లేవ్.. పది లక్షల జనాభా ఉన్న వరంగల్‌లో ఇప్పటికీ కొత్త బృహత్ ప్రణాళికకు ప్రభుత్వం నుంచి ఆమోదం రాలేదు. ఉమ్మడి జిల్లాలో పాత పురపాలక సంఘాల్లో తాతల నాటి ప్రణాళికే అమలవుతోంది. కొత్త పట్టణాల ప్రణాళిక ప్రతిపాదనల దశలోనే ఉంది. ఇలా చేద్దాం: ప్రణాళిక లేకుండా జరిగే అభివృద్ధి వల్ల భవిష్యత్తులో అనేక సమస్యలు ఎదువుతాయి. పట్టణాలు సమగ్ర అభివృద్ధి చెందాలంటే మాస్టర్ ప్లాన్ తప్పకుండా ఉండాల్సిందే.

ఇంకా అనేక సమస్యలుచినుకుపడిందంటే వరంగల్‌లో తాగునీటి పైపులైన్లు లీకేజీ అయ్యి తాగునీరు కలుషితం అవుతోంది. ఇదే తరహాలో డోర్నకల్‌లో అనేక లీకేజీలు ఉన్నాయి పరకాల బీసీ కాలనీ, శ్రీనివాస కాలనీలు లోతట్టు ప్రాంతాలు. ఈ సమస్య పరిష్కరించాలంటే వరద బయటకెళ్లేందుకు చర్యలు తీసుకోవాలి. మరిపెడలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదు. చినుకు కురిస్తే గాంధీ బజార్, గ్యామా తండా, లోక్య తండా తదితర కాలనీలు నీట మునుగుతున్నాయి.

# అత్యాశకు పోవద్దు.. ఆగం కావద్దు



వైరా : సత్తుపల్లి వాసి పాటిబండ్ల ప్రశాంత్, దమ్మపేటకు చెందిన మృదులకు 14ఏళ్ల క్రితం వివాహమైంది. అనంతరం అమెరికాలో స్థిరపడ్డారు. కొన్నేళ్లకు హైదరాబాద్‌కు మకాం మార్చారు. వీరికి ఇద్దరు కుమారులు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు, బెట్టింగులతో ప్రశాంత్ నష్టాల ఊబిలో చిక్కుకుపోయారు. భార్యకు కట్నంగా వచ్చిన ఏడున్నర ఎకరాల భూమిని విక్రయించాలని ఒత్తిడి తీసుకొచ్చారు. తల్లిదండ్రులకు చెప్పుకోలేక, భర్తను మార్చుకోలేక ఇద్దరు కుమారులతో కలిసి మృదుల ఇటీవల బలవన్మరణానికి పాల్పడ్డారు.

క్రికెట్ బెట్టింగ్‌లో రూ.లక్షల్లో పోగొట్టుకున్నాడు వైరాకు చెందిన ఓ వ్యక్తి. తన భార్యకు ఉన్న రూ.7 లక్షల బంగారు ఆభరణాలను దొంగచాటుగా విక్రయించాడు. ఇదేమిటని నిలదీస్తే ముఖం చాటేశాడు. భర్త బెట్టింగ్‌ల గురించి పుట్టింట చెప్పుకోలేక సదరు మహిళ బలవన్మరణానికి యత్నించింది. పుట్టింటివారు చేరదీశారు.

అత్యున్నత స్థాయికి చేరుకునేందుకు అవసరమైన ఆర్థిక పునాదులు రాత్రికిరాత్రే దరిచేరాలనే అత్యాశతో వేసే తప్పటడుగులు ఆలుమగల మధ్య చిచ్చుపెడుతున్నాయి. అవగాహన లేని వ్యాపారాలు, బానిసలుగా మార్చే బెట్టింగులు, ఇతర దురలవాట్లతో కష్టాల సుడిగుండంలో చిక్కుకున్నప్పుడు మాత్రమే అత్తారింటి నుంచి వచ్చిన కట్నకానుకలను అమ్మేసి బయటపడాలనే ఆకాంక్ష ఇటీవల పెచ్చుమీరుతోంది. ఆనందంగా ఉండాల్సిన దాంపత్య జీవితాలు ఆస్తిపాస్తుల విషయంలో ఛిద్రమవుతున్నాయి.

హిందూ సంప్రదాయం ప్రకారం పెళ్లి చేసే క్రమంలో ఏదో ఒకరూపంలో ఆస్తిని కట్నంగా ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. అత్తారింటికి పంపే క్రమంలో అమ్మాయికి తమ అండదండలతో పాటు ఆస్తిపాస్తులున్నాయనే సానుకూల వాతావరణం కల్పిస్తున్నారు. వీటిని ఆసరాగా చేసుకుని అనేక కుటుంబాలు ఉన్నతస్థాయికి ఎదిగాయి. అదే కట్నకానుకలకు అర్రులు చాస్తూ వాటిని విక్రయించాలనే పట్టుదలను ప్రదర్శించే భర్తల వల్లే ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

ఓర్పు, నేర్పు అవసరం

నష్టాల ఊబిలో చిక్కుకున్నప్పుడు కట్నం తాలూకు ఆస్తిపాస్తులను అమ్మాలనే ఆలోచన రావొచ్చు. అయితే వాటిని విక్రయించే సమయంలో అత్తారింటి ఒత్తిళ్లు, పిల్లల భవిష్యత్తునూ పరిగణనలోకి తీసుకోవాలి. ఇలాంటి క్లిష్టపరిస్థితుల నుంచి సున్నితంగా బయటపడేందుకు ఓర్పు, నేర్పు కావాలి. అత్తారింటి అండదండలతో సమస్యను అధిగమించేందుకు యత్నించాలి. అలా కాకుండా భార్యాభర్తల్లో ఎవరు క్షణికావేశానికి లోనైనా కుటుంబ గమనం గాడితప్పుతుంది.

పరిస్థితులకు తగ్గట్టు అడుగులెయ్యాలి..

ఎంతటి వారైనా తమస్థాయికి అనుగుణంగా నడుచుకోవాల్సిందే. ఒక్కరాత్రిలోనే ధనవంతులమైపోవాలనే దురాశ తగదు. ఐపీఎల్ ప్రారంభమయ్యాక ఎంతోమంది బెట్టింగ్‌ల బాట పడుతున్నారు. కుటుంబ పోషణ, పిల్లల భవిష్యత్తు, చదువుల వంటి అంశాలను మదిలో ఉంచుకుంటేనే క్రమశిక్షణతో మెలిగే ఆస్కారముంది. ఇదే సమయంలో వివాహితులు సైతం తీవ్ర మానసిక సంఘర్షణకు గురికాకుండా సమస్య నుంచి బయటపడే మార్గాలను అన్వేషించాలి. ఇంటాబయటా అండగా నిలిచే బంధువులు, స్నేహితుల నుంచి సానుకూల ఆలోచనలను స్వీకరిస్తూ ముందుకు సాగాలి. అభం శుభం తెలియని చిన్నారుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలే కానీ వారిని చిదిమేయకూడదు.

సమస్య లేనివారెవరూ ఉండరు. మానసిక స్థైర్యం పెంచుకోవాలి. క్లిష్టపరిస్థితుల్లో ముఖ్యంగా వివాహితులు ధైర్యాన్ని ప్రదర్శించాలి. తాత్కాలిక సమస్యకు నిండు జీవితాలను బలిచేసుకోవద్దు. పరిష్కారాన్ని అన్వేషించే క్రమంలో సన్నిహితులు, కుటుంబ సభ్యుల సహకారం తీసుకోవాలి.'వీరేందర్ చిట్టె, ఎండీ(మానసిక వైద్యనిపుణుడు)

# వదలని వసూళ్ల రోగం



ఖమ్మం: దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్నట్లు తయారైంది ఖమ్మం జిల్లా సర్వజనాసుపత్రిలోని కొంతమంది అధికారులు, సిబ్బంది తీరు. నిరుపేదల వైద్యానికి భరోసా కల్పిస్తుందని ప్రశంసలు అందుకుంటున్న ఆసుపత్రిపై.. అదేస్థాయిలో వెలుగుచూస్తున్న అవకతవకలు, అవినీతి మరకలు మాయనిమచ్చగా మారుతున్నాయి. ఒప్పంద కార్మికులు, ఫార్మాసిస్టుల నియామకాల్లో అక్రమాలు జరిగిన వైనం మరువకముందే.. కొత్తగా చేపట్టిన నియామకాల్లోనూ ఒక్కొక్కరి నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విచారణ పేరిట కాలయాపన

గతంలోనూ అవకతవకలతో ఆసుపత్రి ప్రతిష్ఠ మసకబారినా విచారణ పేరిట కాలయాపన చేయడమే తప్పితే చర్యలు తీసుకోలేదు. ఏటికేడు అత్యాధునిక వసతులు, హంగులతో అన్నిరకాల వైద్యసేవలు అందుబాటులోకి వస్తుంటే.. ఇదే అదనుగా ఆసుపత్రిలో కొంతమంది అధికారులు, సిబ్బంది తెరలేపిన వసూళ్ల పర్వానికి అడ్డుకట్ట పడటం లేదు. ప్రధానంగా పారిశుద్ధ్యం, భద్రత, పేషెంట్ కేర్ విభాగాల్లో నియామకాలకు ఒక్కొక్కరి నుంచి రూ.2 లక్షలు- 3 లక్షలు దండుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో 150 మంది వద్ద సుమారు రూ.కోటికిపైనే వసూలు చేశారనే ఆరోపణలు వెల్లువెత్తగా.. ఇటీవల చేపట్టిన మరో 150 మంది నియామకాల్లోనూ అదేతంతు పునరావృతమైందని సమాచారం.

వేతనాల్లోనూ కోతలే..

ముడుపులు చెల్లించి సర్వజనాసుపత్రిలో ఉద్యోగాలు పొందిన ఒప్పంద సిబ్బంది పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. విధుల్లో చేరే సమయంలో నెలకు రూ.12వేల జీతం ఇస్తామని చెప్పి ఆ తర్వాత రూ.11వేలే అందిస్తున్నారని గగ్గోలు పెడుతున్నారు. ఏజెన్సీని గుప్పిట్లో పెట్టుకుని సిబ్బంది వేతనాల్లో అడ్డగోలుగా కోత విధిస్తున్నట్లు తెలిసింది.

ఆసుపత్రిలో పనిచేసేందుకు 50-70 మంది అవసరమైతే.. ఏకంగా 150 మందిని నియమించి 70 మంది జీతాలనే అందరికీ పంచుతున్నారని సమాచారం. అంతేకాదు.. ఆసుపత్రిలో పనిచేసే దాదాపు 50 మంది ఒప్పంద కార్మికులకు దక్కాల్సిన రూ.కోటి పీఎఫ్, ఈఎస్ఐ సొమ్మును సైతం మాయం చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్యాంటీన్ నిర్వహణలోనూ పైరవీలకే పెద్దపీట వేస్తున్నారన్న చర్చ సాగుతోంది.

నూతన విభాగాల్లో పరికరాలు, యంత్రాల కొనుగోళ్లలోనూ అవకతవకలు జరిగినట్లు సమాచారం. ధర్మాసుపత్రిలో అవినీతి పర్వంపై కలెక్టర్‌కు ఫిర్యాదులు వెల్లువెత్తినా.. ఈ వ్యవహారంపై విచారణ సాగినా ఏమీ తేల్చకపోవటం విమర్శలకు తావిస్తోంది.

ఉన్నట్టుండి విధుల నుంచి తొలగింపు..


ఒప్పంద ప్రాతిపదికన పారిశుద్ధ్య సిబ్బంది నుంచి రూ.2 లక్షలు, పేషెంట్ కేర్, భద్రత సిబ్బంది నుంచి రూ.3 లక్షల చొప్పున వసూలు చేసినట్లు తెలిసింది. ఉద్యోగాల కోసం డబ్బులు చెల్లించడంతో ఇక తమ విధులకు ఇబ్బందులు లేవని సిబ్బంది నిబ్బరంతో ఉంటే.. కొంతమందిని ఉన్నట్టుండి విధుల నుంచి తొలగించటం గమనార్హం. ఉద్యోగం కోసం తాము చెల్లించిన మొత్తం ఎవరిస్తారని ప్రదక్షిణలు చేస్తుండటంతో ఆసుపత్రిలో వసూళ్ల బాగోతం మరోసారి చర్చనీయాంశమైంది. ఈ తతంగమంతా ఆసుపత్రిలో కీలకంగా వ్యవహరించే కొంతమంది అధికారుల కనుసన్నల్లో జరిగిందనే వాదనలు వ్యక్తమవుతున్నాయి. ఆసుపత్రిలో సిబ్బంది నియామకాల పేరిట వసూళ్లకు పాల్పడితే ఉపేక్షించం. గతంలో కొన్ని ఆరోపణలు ఉన్నట్లు నా దృష్టికి వచ్చింది. ప్రిన్సిపల్‌గా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నాను. అన్యాయం జరిగిందని ఎవరైనా ఫిర్యాదు చేస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. డాక్టర్ రాజేశ్వరరావు, ప్రిన్సిపల్, ఖమ్మం ప్రభుత్వ వైద్యకళాశాల

# కొత్త గనులపైనే సింగరేణి ఆశ

కొత్తగూడెం : ఈ ఉత్పత్తి సంవత్సరం ఉత్పత్తి మొదలవుతుందని అంచనా వేస్తున్న కొత్త గనులపై సింగరేణి కొండంత ఆశలే పెట్టుకొంది. సింగరేణి వ్యాప్తంగా నాలుగు పెద్ద గనులు ప్రారంభించనున్నారు. వాటి అనుమతులు, ఇతర ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. ఎదురయ్యే ఆటంకాలు సత్వరమే పరిష్కరించాల్సిందిగా ఎప్పటికప్పుడు అధికారులతో యాజమాన్యం సమీక్షలు నిర్వహిస్తోంది. ఈ ఉత్పత్తి సంవత్సరంలోనే కొత్త గనుల్లోంచి సుమారు 100 లక్షల టన్నుల బొగ్గు వెలికితీయాలని స్పష్టం చేస్తోంది. వచ్చే ఉత్పత్తి సంవత్సరం (2024-25) ఇది 200 లక్షల టన్నులకు పెరగాలన్నది ప్రణాళిక. కొత్త గనుల్లో రెండు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనివే కావడం విశేషం.

తాజా పురోగతి ఇలా..

నైనీ కోల్‌బ్లాకుకు అన్ని అనుమతులు లభించాయి. గని ప్రారంభించాల్సిన ప్రాంతంలో చెట్లను తొలగించే పనులు చేపట్టాల్సి ఉంది. నెలల్లో ఉత్పత్తి చేపట్టాలన్నది యాజమాన్యం లక్ష్యం. కొత్తగూడెం ఏరియాలోని జీకే ఓసీ, వీకే-7 భూగర్భగనుల విస్తరణతో వీకే ఓసీ ఏర్పాటుకానుంది. అటవీశాఖకు ప్రత్యామ్నాయంగా అప్పగించాల్సిన భూమి విషయంలో



కొంత జాప్యం జరుగుతోంది. త్వరలో సమస్యను అధిగమించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఆసిఫాబాద్ జిల్లా పరిధిలోని గోలేటి పాత భూగర్భగనిని ఓసీగా విస్తరించనున్నారు. కొన్ని అనుమతులు వస్తే వేగంగా ఉత్పత్తి ప్రారంభించే పనిలో స్థానిక అధికారులు నిమగ్నమయ్యారు. ఇల్లెందులోని 21 ఇంక్లైన్, జీకే-5 భూగర్భగనులపై విస్తరించనున్నదే జీకే ఓసీ. ఇటీవల ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. పర్యావరణ అనుమతులొస్తే ఉత్పత్తికి మార్గం సుగమం అయినట్లే.

# జల వ్యాపారం.. జనాలకు ప్రాణసంకటం!

పాలకుర్తి : జిల్లాలో నీటి వ్యాపారం విశృంఖలత్వానికి అడ్డూ అదుపూ లేకుండా పోయింది. అనుమతులు లేకుండా ఆర్వో ప్లాంట్లను విచ్చలవిడిగా ఏర్పాటు చేసి వ్యాపారులు ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. నాణ్యత ప్రమాణాలు లేని జలాలను తాగునీటిగా విక్రయిస్తూ అందినకాడికి సొమ్ము చేసుకుంటున్నారు. ఇక గ్రామాల్లో సైతం ఈ వ్యాపారం విరివిగా సాగుతోంది. ఎలాంటి అనుమతులు, ప్రమాణాలు లేకుండా నీటి కేంద్రాలను నిర్వహిస్తున్నారు.

నిర్వాహకుల ఇష్టారాజ్యం

జనగామ పట్టణంతో పాటు పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రాల్లో నీటి శుద్ధి ప్లాంట్లను ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేశారు. తాగునీటికి సైతం ఈ నీటినే వినియోగిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపుగా 200 వరకు ఆర్వో ప్లాంట్లు ఉండగా వీటిలో అన్ని రకాల అనుమతులు పొందినవి కేవలం వందలోపే ఉన్నట్లు తెలుస్తోంది. ఆర్వో ప్లాంట్ల కోసం విరివిగా బోర్లను వేయడంతో భూగర్భ జలాలకు ముప్పు వాటిల్లుతోంది. వాల్టా చట్టం ప్రకారం రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతోనే ఆర్వో ప్లాంట్లను ఇష్టానుసారంగా ఏర్పాటు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎండాకాలంలో అయితే కొన్ని చోట్ల మున్సిపల్, ప్రైవేటు ట్యాంకర్లతో నీటిని తీసుకొని ఈ నీటినే డబ్బాలో పోసి అమ్ముకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

రూ.లక్షల్లో వ్యాపారం

ఎక్కడైనా బోరు వేస్తే నీళ్లు బాగా పడితే చాలు రూ.2.50 లక్షల నుంచి రూ.5 లక్షలు ఖర్చు చేసి ఆర్వో కేంద్రాన్ని ఏర్పాటు చేయడం



పరిపాటిగా మారింది. ఇందులో ఎలాంటి ప్రమాణాలు పాటిస్తున్నారో అందులో పని చేసే వారికే తెలియదు. వాస్తవంగా ఐ.ఎస్.ఐ అనుమతులతో మినరల్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలనుకుంటే రూ.18లక్షల నుంచి రూ.25లక్షల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ధ్రువీకరణ పత్రం ఆధారంగా ప్లాంట్ ఏర్పాటు చేసిన తర్వాత ప్రతి 3మాసాలకు ఒకసారి ఉన్నతస్థాయి అధికారులు తనిఖీలు చేసి పరిశీలిస్తారు. ప్రస్తుతం ఎలాంటి నిబంధనలు లేకుండా ప్లాంట్లు ఏర్పాటవుతున్నాయి. డబ్బా తాగునీటిని రూ.10, ఇళ్లకు రూ.15 చొప్పున విక్రయిస్తున్నారు. జిల్లాలో నెలకు సుమారుగా రూ.25లక్షల వ్యాపారం సాగుతోందని తెలుస్తోంది.

కాగితాలకే పరిమితమైనా నిబంధనలు

నీటిలో సాయిల్, ఐరన్, యాసిడ్, కోర్లిన్, క్లోరైడ్ వంటి ఆమ్లాలు ఉంటాయి. ఇవి అవసరమైన దానికంటే ఎక్కువ మోతాదులో ఉంటే ప్రజారోగ్యానికి ముప్పు. అందుకే ప్లాంటులో కెమికల్ ఆనాలిసిస్ ల్యాబ్ ఏర్పాటు చేసి కెమిస్టు, మైక్రో బయాలజిస్టులను నియమించుకోవాలి. వీరు ఫిల్టర్ చేసే ముందు నీటిని పరీక్షించాలి. ఫిల్టర్ అయ్యాక నీటి నాణ్యత పరీక్షలు జరిపి తదనంతరం నీటిని అందించాలి. కానీ ఈ నిబంధనలన్నీ కాగితాలకే పరిమితమవుతున్నాయి. ఎలాంటి ప్రమాణాలు పాటించకుండా విక్రయిస్తున్న తాగునీటి కారణంగా ప్రజల్లో రోగనిరోధక శక్తి తగ్గిపోతోందని, కాల్షియం కోల్పోయి మోకాళ్ల నొప్పులతో ఇబ్బందులు పడుతున్నారని వైద్యులు చెబుతున్నారు.

నిబంధనలు పక్కాగా పాటించాలి


-మధుమోహన్, ఆర్డీవో, జనగామ

ఆర్వో వాటర్ ప్లాంట్ నిర్వాహకులు నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలి. తర్వలోనే నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేయిస్తా. ఇతర శాఖలతో కలిసి తరచూ తనిఖీలు జరిపేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటాం. నిబంధనలు పాటించని, అక్రమంగా నెలకొల్పిన ప్లాంట్లపై చర్యలు తీసుకొని మూసివేస్తాం.

# వేసవిలో పైపైకి భూగర్భజలం

కరీంనగర్ : వేసవికాలంలో అడుగంటాల్సిన భూగర్భ జలాలు పైపైకి చేరాయి. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు వ్యవసాయానికి వరప్రదాయనిగా ఉంటుండగా అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాలతో జలాలు వృద్ధి చెందాయి. ఎస్సారెస్పీ కాకతీయ కాలువలతో హుజూరాబాద్, మానకొండూర్, తిమ్మాపూర్, చొప్పదండి, వీణవంక, కేశవపట్నం మండలాల్లో సాగు నీరు అందుతుండగా వ్యవసాయ బావులు, బోరుబావులు రైతులకు అండగా నిలిచాయి. ఇక గంగాధర, రామడుగు మండలాలకు ఎల్లంపల్లి, కాళేశ్వరం జలాలతో చెరువులు, కుంటలు జలకళ సంతరించుకున్నాయి.

జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 2,20,286 ఎకరాలు కాగా యాసంగిలో ఏకంగా 2,92,880 ఎకరాల్లో అన్ని రకాల పంటలు వేశారు. ఇందులో వరి పంటనే 2,71,388 ఎకరాల్లో వేశారు. అకాల వర్షాలు, వడగళ్ల



వానలతో జిల్లావ్యాప్తంగా వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే ఈ ఏడాదిలో భూగర్భ జలాలు వృద్ధి చెందాయి. ఆయకట్టు ప్రాంతాలకు సాగునీటి ప్రాజెక్టుల ద్వారా నీరు సరఫరా కావడంతో పంటల సాగులో రైతులకు ఇబ్బందులు తీరాయి. ఒకప్పుడు కరవు కాటకాలతో ఇబ్బందులు పడ్డ గంగాధర మండలంలో 7.22 మీటర్ల లోతులో నీరుంది. మానకొండూర్ మండలంలో తక్కువ లోతులో ఉండగా, చొప్పదండి మండలంలో ఎక్కువ లోతులో ఉన్నాయి. గతేడాది జిల్లాలోని అన్ని మండలాల్లో సాధారణంగా 8.16 మీటర్ల లోతులో నీళ్లుండగా ఈసారి 7.64 మీటర్ల లోతులో ఉన్నాయి. గతేడాది కంటే ఈసారి భూగర్భ జలాలు పైకి చేరడంతో వచ్చే వానాకాలంలో ఖరీఫ్ పంటల సాగుకు ఎలాంటి ఇబ్బందులుండవని రైతులు గంపెడాశతో ఉన్నారు.

పంటల సాగుకు ఇబ్బంది లేదు

జిల్లాలో నీటి వనరులు ఉండడంతో వచ్చే ఖరీఫ్‌లో సాగునీటికి ఎలాంటి ఇబ్బందుల్లేవు. ఆరుతడి పంటలు సాగు చేసిన మండలాల్లో వినియోగం తగ్గి భూగర్భ జలాలు అందుబాటులో ఉండగా, వరి సాగు చేసిన మండలాల్లో మాత్రమే ఎక్కువ లోతులో నీరుంది. మొత్తంగా చూస్తే గతేడాది కంటే ఈసారి భూగర్భ జలాలు వేసవిలో పైకి చేరాయి.

# పచ్చదనం పరిచేలా...

వరంగల్ : జిల్లా పచ్చదనంతో ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. 8వ విడత హరిత హారంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటేందుకు యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఈ ఏడాది 13 మండలాలతోపాటు జిల్లాలో విస్తరించిన గ్రేటర్ వరంగల్ మునిసిపాలిటీ, నర్సంపేట, వర్ధన్నపేట మునిసిపాలిటీల్లో 41 లక్షల 3 వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇందుకు కావాల్సిన మొక్కలను జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, అటవీశాఖ ఆధ్వర్యంలో 323 నర్సరీల్లో మొక్కలను పెంచుతున్నారు.
పచ్చదనం ఉట్టిపడేలా...హరితహారంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా గుర్తించిన స్థలాల్లో మొక్కలు నాటేందుకు శాఖల వారీగా మొక్కల కేటాయింపులు చేశారు. వర్షాలు పడగానే పూర్తిస్థాయిలో మొక్కలు నాటేందుకు రెడీ అయ్యారు. రహదారుల వెంబడి, ఖాళీ స్థలాల్లో పెద్ద సంఖ్యలో మొక్కలను నాటేందుకు అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు.




సంరక్షణకు హరిత నిధి ఏర్పాటు...నాటిన మొక్కల సంరక్షణకు హరిత నిధిని ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం ప్రతీ ప్రతీ ఒక్కరిని భాగస్వామ్యం చేయనున్నారు. గ్రామ స్థాయిలో సర్పంచి నుంచి ఎంపీ వరకు, ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న చిరు ఉద్యోగి నుంచి కలెక్టర్ వరకు ప్రతీ ఒక్కరి వేతనం నుంచి హరిత నిధికి నిధులను సమకూర్చనున్నారు. ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్ల వేతనాల నుంచి రూ. 6వేల చొప్పున సేకరించనున్నారు. అఖిల భారత సర్వీసు అధికారుల నుంచి రూ.1200, నాన్ గెజిటెడ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఉద్యోగులు, కార్పొరేషన్లు, సొసైటీలు, విశ్వవిద్యాలయాలు, రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో నడిచే సంస్థల ఉద్యోగుల నుంచి రూ. 300, కార్పొరేషన్ చైర్మన్లు, జిల్లా పరిషత్ చైర్మన్ నుంచి రూ. 1200, ఎంపీపీలు, జడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్ల నుంచి రూ.600 వసూలు చేసి హరిత నిధిలో జమచేస్తారు. ఎంపీటీసీలు, కార్పొరేటర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు రూ. 120తో పాటు రిజిస్ట్రేషన్ చేసే ప్రతీ డాక్యుమెంట్‌కు రూ. 50, వ్యాపార లైసెన్సులు రెన్యువల్ చేసే సమయంలో రూ. 1000 హరిత నిధి కోసం సేకరించనున్నారు.
మొక్కలు సిద్ధం...: మట్టపల్లి సంపత్‌రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారిహరిత హారం 8వ విడతలో జిల్లాలో 41.03 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. శాఖల వారీగా టార్గెట్‌ను నిర్ణయించుకున్నాం. హరితహారానికి అవసరమైన మొక్కలను 323 నర్సరీల్లో సిద్ధంగా ఉన్నా యి. వర్షాలు కురవగానే నిర్ధేశిత ప్రాంతాల్లో గుంతలు తీయించి మొక్కలు నాటిస్తాం.

# వాన అంతంతే!

మహబూబాబాద్ : నైరుతి రుతుపవనాలు ప్రవే శించినా ఇప్పటికీ భారీ వానలు పడలేదు. జూన్‌లో వానాకాలం ప్రారంభమైనా అంతంత మాత్రమే వర్షాలే కురిశాయి. జిల్లాలోని 12 మండలాల్లో గత నెలలో సాధారణ వర్షపాతం నమోదైంది. బయ్యారం, గంగారం మండలాల్లో సాధారణ వర్షపాతం కంటే తక్కువగా పడింది.
జూన్ నెలలో మాములు వానలే పడ్డా యి. జిల్లాలో భారీ వర్షాలు కురియలేదు. అరకొర వర్షాలతో వ్యవసాయ పనులు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. జూన్‌లో ఆశించిన రీతిలో వర్షాలు కురియకపోవడంతో ఈ జూలై, ఆగస్టు నెలలో భారీ వర్షాలు కురుస్తాయని రైతులు ఆశలు పెట్టుకున్నారు.
93,142 ఎకరాల్లో మాత్రమే పంటల సాగు..ప్రస్తుత వానాకాలంలో 3,27,080 ఎకరాల విస్తీర్ణంలో వివిధ పంట లు వేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 93,142 ఎకరాల్లో మాత్రమే వేశా రు. పత్తి 95,881 ఎకరాల సాధారణ విస్తీర్ణం 78,797 ఎకరాల్లో, మొక్కజొన్న 31,375కి బదులగా 7,943 ఎకరాల్లో, పెసర్లు 15,792కు గాను 3,375 ఎకరాల్లో, మినుములు 140 గాను 10 ఎకరాలు, కందులు 4, 908కి గాను 1987 ఎకరాల్లో, జొన్నలు 330కి గాను 30 ఎకరాలు, పసు పు 8526కి గాను 1010 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేశారు. నువ్వులు, పొగాకు, చెరుకు, మిర్చి, వరి ఇంకా వేయలేదు. వర్షాలు అడపాదడప కురుస్తోండటంతో రైతులు విత్తనాలు వేయడానికి కొంతమేర వెనుకంజ వేస్తున్నారు.
ముమ్మరంగా పనులు..ప్రస్తుత వానల నేపథ్యంలో రైతులు తమ చెలకల్లో, తోటల్లో పను లు చేస్తూ బిజీబిజీగా మారిపోయారు. తొలకరి జల్లులతో వేసిన పం టలు మొలకెత్తాయి. వివిధ తోటల్లో కొంతమంది మొక్కలకు ఎరువులు చల్లుతుండగా మరి కొంతమంది రైతులు, కూలీలు చేలలో పెరిగిన కలుపు మొక్కలను తొలగిస్తున్నారు. వరి వేయడానికి నారు పెంచుతుండగా (నర్సరీ) నారు మడులు మాత్ర ఇంకా సిద్ధం చేయలేదు.
వర్షాల వల్ల ఆలస్యం.. ఈ వానాకాలం సీజన్‌లో వర్షాలు ఆలస్యమయ్యాయి. వరిలో మాత్రం నేరుగా విత్తనం వెదజల్లే పద్ధతిలో వేసుకోవడానికి రైతులు సమాయత్తమవుతున్నారని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. జూలై 15 వరకు వరినాట్లు వేసుకోవాల్సి ఉండగా, వాన లు ఆలస్యమవుతోండటంతో ఈనెల 20వ తేదీ నుంచి 25 వరకు వేసుకోనున్నారు. 130-140 పంటకాలంలో వచ్చే పంటలైన 1001 రకం, కేఎన్‌ఎం 118, కునారం సన్నాలు, ఎంటీయూ 1224, జగిత్యాల 24,423, ఆర్ఎన్ఆర్ 15048, జైశ్రీరాం, మహారాజ లాంటి సన్నరకాలను నాటనున్నారు. వర్షాలు ఆలస్యమైతే మా త్రం 120 రోజుల పంట అయినా స్వల్పకాలిక రకాలను సాగు చేయనున్నారు. ఈ సారి పత్తి విస్తీర్ణం పెరిగి మిర్చి విస్తీర్ణం తగ్గే అవకాశాలు ఉన్నాయి.
జూన్‌లో 12 రోజులే కురిసిన వర్షం..వానాకాలం సీజన్ ప్రారంభమైన జూన్ నెలలో కొన్ని మండలాల్లో 8 రోజులు, మరికొన్ని మండలా ల్లో 9, 10, 12 రోజుల వరకు వర్షం కురిసింది. 1వ తేదీన పలు మండలాల్లో చిన్నపాటి జల్లులు కురిసి మొఖం చాటేసిన వర్షాలు 13 నుంచి కొత్తగూడ, డోర్నకల్, గూడూరు మండలాల్లో కురిసిన వర్షం 14నుంచి అన్ని మండలాలకు విస్తరించింది. బయ్యారంలో 140.6 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం కురియాల్సి ఉండగా, 107.3 మి.మీ వర్షం కురిసింది. మైనస్ వర్షపాతం 24.0 మి.మీ వర్షపాతం లోటుగా గుర్తించారు. గంగారంలో 161.9 మి.మీ సాధారణ వర్షపాతం కాగా, 125.3 మి.మీ వర్షం మాత్రమే కురిసింది. మైనస్ 23.0 మి.మీ లోటు వర్షపాతం నమోదైంది. దంతాలపల్లిలో 125.3 మి.మీ సాధారణ వర్షపాతం కాగా, 145.9 మి.మీ వర్షం కురిసింది. కొత్తగూడలో 161.9 కాగా, 171.3 మిల్లీమీటర్ల వాన పడింది. వర్షపాతం ఇలా..జూన్‌లో వర్షపాతం ఇలా ఉంది. గార్లలో 126.1 మిల్లీమీటర్లకు గాను 203.0 మి.మీ డోర్నకల్‌లో 119.8మి.మీగాను 162.0 మి.మీ, కురవి లో 121.1 మి.మీగాను 170.8 మి.మీ, మహబూబాబాద్‌లో 134.6 మి.మీకు వర్షపాతం నమోదైంది.

# 'ప్రైవేటు' దోపిడీ




మహబూబాబాద్ : ప్రైవేటు పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పిస్తూ విద్యనందించాల్సిన యాజమాన్యాలు ధనార్జనే ధ్యేయంగా విద్యతో వ్యాపారం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాం, టై, బెల్టుల అమ్మకాలతో బుక్ స్టాల్స్, బట్టల దుకాణాలను మరిపిస్తున్నాయి. నర్సరీ మొదలుకొని 10వ తరగతి వరకు పదుల సంఖ్యలో స్టడీ మెటీరియల్ అంటూ వేలాది రూపాయలకు విక్రయిస్తూ ప్రతియేటా లక్షలాది రూపాయలు అర్జిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను భేఖాతరు చేస్తూ యథేచ్ఛగా పాఠశాలల్లోనే పుస్తకాలను విక్రయిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకపోవటం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా 100కు పైగా ప్రైవేట్ పాఠశాలలుండగా వాటిల్లో సుమారు 30వేలకుపైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.
ఫీజులు ఎక్కువ..వసతులు తక్కువ...ప్రైవేటు పాఠశాలల్లో ప్రభుత్వం నిర్ధేచించిన ఫీజుల కంటే అధిక మొత్తంలో వసూలు చేస్తున్న యాజమాన్యాలు వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. కొన్ని పాఠశాలల్లో సామర్థ్యానికి మించి ఇరుకు గదుల్లో 30 నుంచి 50 వరకు విద్యార్థులను కూర్చోబెట్టి బోధిస్తుండటంతో పాఠ్యాంశాలు అర్థమయ్యేదెలా అని తల్లిదండ్రులు వాపోతున్నారు. మరో వైపు కొన్ని పాఠశాలల్లో వేలాది మంది విద్యార్థులుంటే మరుగుదొడ్లు, మూత్రశాలలు తక్కువ సంఖ్యలో ఉ ండటం వల్ల క్యూలో నిలబడి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఇక నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోందని తల్లిదండ్రులు వాపోతున్నారు.
ఆర్థిక భారంతో సతమతంపాఠశాలలు ప్రారంభమైన నాటినుంచే ప్రైవేటు పాఠశాలలు షాపులుగా మారాయనే ఆరోపణలు వినవస్తున్నా యి. పట్టుమని పది రోజులు కాకముందే పాఠశాలకు వచ్చిన విద్యార్థుల నుంచి స్టడీ మెటీరియల్ కొనాలనే ఉపాధ్యాయుల ఒత్తిడితో తల్లిదండ్రులు తీవ్ర మానసికవేదనకు గురవుతున్నారు. ప్రారంభంలో పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలతో పాఠ్యాంశాలు మొదలుపెట్టాల్సిన ఉపాధ్యాయులు టై, బెల్టులు, యూనిఫాం, షూ, స్టడీ మెటీరియల్ తప్పనిసరని చెప్పటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్థికభారంతో సతమతమవుతున్నారు.
ఫీజుల మోత..కరోనా ఉధృతి కారణంగా గత రెండేళ్లుగా ప్రజలంతా ఇళ్లకే పరిమితమై పనులు లేక ఆర్థికంగా నష్టపోయారు. అంతేకాకుండ పాఠశాలలు సైతం మూతపడడంతో విద్యార్థులు కాస్తో... కూస్తో చదువుకున్న చదువు సైతం మరిచిపోయారు. ఈక్రమంలో తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తే కాస్త విద్య మెరుగుపడుతుందనే ఆశతో పంపిస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న పాఠశాలల యాజమాన్యాలు అధిక ఫీజులు పెంచడంతో నిరుపేద, మధ్య తరగతి ప్రజలకు పెనుభారంగా మారింది. అధిక ఫీజులను నియంత్రించాల్సిన అధికారులు సైతం తమకేమి సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తూ పాఠశాలల వైపు కన్నెత్తి చూడకపోవడం యాజమాన్యాలు ఫీజుల మోత మోగిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల వసూళ్లపై దృష్టి సారించి నియంత్రించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.
అధిక ఫీజుల వసూళ్లను నియంత్రించాలి : కేలోతు సాయికుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధానకార్యదర్శి, మహబూబాబాద్ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా విద్యార్థుల నుంచి అధికంగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి. పాఠశాలల్లో విద్యార్థుల కనుగుణంగా మౌలిక వసతుల కల్పించకుండా ఇష్టారీతిన ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు చర్యలు చేపట్టకపోవడం విచారకరం. ఇప్పటికైనా ప్రైవేట్ పాఠశాలలపై చర్య తీసుకోవాలి.పాఠశాలల్లోనే అధిక ధరలకు పుస్తకాల విక్రయం : బోనగిరి మధు, పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులుజిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో బుక్‌స్టాళ్లను తలపించేలా స్టడీ మెటీరియల్ విక్రయాలు జరుపుతున్నారు. యజమాన్యాలు ధరలు నిర్ణయించి పైసా తగ్గకుండా అధిక ధరలకు విక్రయించడంతో విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడుతోంది. జిల్లా విద్యాశాఖాధికారులు ప్రైవేట్ పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించి ధరలను నియంత్రించాలి. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి విక్రయిస్తున్న పాఠశాలలపై చర్య తీసుకోవాలి.

# లీజు భూములపై నజర్

మహబూబాబాద్ :రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా స్థానిక సంస్థలు, రాష్ట్ర కార్పొరేషన్లు, కేంద్ర, రాష్ట్రప్రభుత్వ రంగ సంస్థలు, కంపెనీలు, అసోసియేషన్లు, ప్రైవేటు వ్యక్తులకు వివిధ సందర్భాల్లో భూములను లీజుకు ఇచ్చింది. ఈ భూములపై సర్కారు దృష్టి సారించింది. అవి ఎక్కడెక్కడ ఉన్నాయి..? ఏ పరిస్థితుల్లో ఉన్నాయి..? ఎంత విస్తీర్ణంలో ఉన్నాయనే కోణంలో ఆరా తీస్తోంది. ఈ మేరకు రాష్ట్రంలో వివిధ సంస్థలు, వ్యక్తులకు లీజుకిచ్చిన స్థలాలపై ప్రభుత్వం ఇటీవల రెవెన్యూ అధికారులతో క్షేత్రస్థాయిలో విచారణ జరిపించింది. అత్యవసరంగా వాటి వివరాలు పంపాలని కలెక్టర్లను ఆదేశించింది. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రెవెన్యూ అధికారులు లీజు భూములపై గత నెల మొదటి వారంలో ఆరా తీసి ప్రత్యేక ఫార్మాట్‌లో నివేదికను ప్రభుత్వానికి పంపించేశారు. అయితే లీజుకిచ్చిన భూముల వివరాలను సేకరించి వాటిని విక్రయించి ఆదాయం పెంచుకునేందుకే ప్రభుత్వం వాటిపై దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో వేలాది ఎకరాల సర్కారు భూములను వివిధ సంస్థలు, వ్యక్తులకు ప్రభుత్వం లీజుకు ఇచ్చింది. ఇప్పుడు వీటి తాజా పరిస్థితిని తెలుసుకోవాల్సిందిగా కలెక్టర్లు తహసీల్దార్లను ఆదేశించారు. దీనితో రంగంలోకి దిగిన తహసీల్దార్లు.. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం రెవెన్యూ సిబ్బంది గ్రామం, సర్వే నెంబరు, విస్తీర్ణం, లీజు లక్ష్యం, సంబంధిత ఎనిమిది అంశాల వారీగా వివరాలను సేకరించారు. గత నెల 10వ తేదీన లీజు భూములపై నివేదికలను తహసీల్దార్లు కలెక్టర్లకు సమర్పించారు. కలెక్టర్లు వాటిని ప్రభుత్వానికి అందచేశారు. వీటిపై ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుంటుందనేది ఇంకా స్పష్టం కాలేదు. నివేదికలు అందచేసి దాదాపు నెలకావొస్తోంది. రెవెన్యూశాఖ ఉన్నతాధికారులు ఈ నివేదికలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్టు సమాచారం.
క్షేత్రస్థాయిలో..
ఉమ్మడి జిల్లాలోని పట్టణ ప్రాంతాలు, వరంగల్ నగర పాలక సంస్థ, తొమ్మిది మునిసిపాలిటీల పరిధిలోని వాటికి చెందిన స్థలాలు, సర్కార్ భూములతో పాటు ఖనిజ వనరులు, గ్రానైట్ గనులు ఉన్న ప్రాంతాలు, దేవాదాయ శాఖకు చెందిన భూములను రెవెన్యూ అధికారులు క్షుణ్ణంగా సర్వే చేశారు. అంతకుముందే భూములను లీజుకు ఇచ్చే అవకాశం ఉన్న దాదాపు అన్ని ప్రభుత్వ శాఖలు తమ పరిధిలో ఎవరెవరికి ఎన్ని భూములను లీజుకు ఇచ్చింది.. వాటి తాజా పరిస్థితిపై నివేదికలను కలెక్టర్లు కోరారు. ఈ నివేదికల ఆధారంగా తహసీల్దార్లు రంగంలోకి దిగి కింది స్థాయి సిబ్బందితో క్షేత్ర పరిశీలన జరిపారు. రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు వీఆర్ఏలు, గిర్దావర్లు, సర్వేయర్లు లీజుకు ఇచ్చిన భూములను సర్వే నెంబర్ల వారీగా రికార్డులను సేకరించారు. లీజుకు ఎప్పుడు తీసుకున్నది? ఎందుకు తీసుకున్నది? లీజుకు తీసుకున్న ఉద్దేశం ఏమిటీ? అందుకే ఆ భూములను వినియోగిస్తున్నారా? లేదా ఇతరత్రా వ్యక్తిగత ప్రయోజనాల కోసం వాడుతున్నారా? లేక లీజుకు తీసుకున్న భూమిని అదనపు ఆదాయార్జన కోసం ఇతరులకు సబ్‌లీజుకు ఇచ్చారా? లీజుకు తీసుకున్న భూమి కబ్జాకు గురైందా? లేదా లీజు గడువు ముగిసిందా? ముగిసినా కూడా కిందిస్థాయి అధికారులతో కుమ్మక్కై దానిని ఇంకా తమ ఆధీనంలోనే ఉంచుకున్నారా? లీజుకు తీసుకున్న భూమి ప్రస్తుతం మార్కెట్ ప్రకారం ఎంత విలువ ఉంటుంది? ఆ భూమి కోర్టు వివాదాల్లో ఉందా? తదితర వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. లీజుకు తీసుకున్న వారికి నోటీసులు పంపించి విచారించారు. ముఖ్యంగా లీజు గడువు పూర్తికావస్తున్న, పూర్తయిన భూములను ప్రత్యేకంగా గుర్తించారు. జిల్లా, మండల, పట్టణ కేంద్రాల్లో లీజుకు ఇచ్చిన ప్రభుత్వ భూములపై ప్రత్యేక దృష్టి సారించారు.
వెలుగుచూస్తున్న అక్రమాలు
లీజు భూముల పరిశీలన సందర్భంగా అనేక ఆసక్తికరమైన అంశాలు రెవెన్యూ అధికారుల దృష్టికి వచ్చాయి. ముఖ్యంగా వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలోని ముఖ్య కూడళ్లలో పలువురు వ్యాపారులు దుకాణాల సముదాయాలు నిర్మించుకునేందుకు, పెట్రోల్ బంకుల ఏర్పాటుకు 40, 50 యేళ్ల కిందట ప్రభుత్వ స్థలాలను లీజుకు తీసుకున్నారు. ప్రతీసారి లీజు గడువు పెంచుకుంటూ వస్తున్నారు. లీజు గడువు ముగిసినా వాటిని దొడ్డిదారిన తమ సొంతం చేసుకున్నారు. ప్రైవేటు వ్యక్తులు వీటిని తక్కువ ధరకు లీజుకు తీసుకోగా ఆ తర్వాత కాలంలో అధికారులు ఈ భూముల గురించి పట్టించుకోకపోవడంతో సదరు వ్యక్తలు లీజు గడువును పెంచుకోవడం అటుంచి లీజు బకాయిలను చెల్లించడం కూడా మానేశారు. అలాగే ఉమ్మడి జిల్లాలో వివిధ కార్పొరేషన్లు, సంస్థలు, అసోసియేషన్లు, ప్రైవేటు వ్యక్తులు తాము పొందిన లీజు భూములను నిర్దేశిత లక్ష్యానికి వినియోగించడం లేదని తెలుస్తోంది. భూములు తీసుకున్న కొన్ని సంస్థలు, వ్యక్తులు వాటిని ఇతర సంస్థల పేర్లపైకి మార్చాయనే ఆరోపణలు ఉన్నాయి. లక్ష్యం మేరకు వాటిని వినియోగించడం లేదు. లీజుల గుప్పిట్లో ఎన్నివేల ఎకరాలు ఉన్నది కలెక్టర్లకు అందే నివేదికలను బట్టి లెక్కతేలుతోంది. వరంగల్ నగరంలో దేవాదాయ శాఖకు చెందిన కొన్ని భూములు 50 యేళ్ల నుంచి లీజు గుప్పిట్లో ఉన్నాయి.
అక్రమార్కుల్లో గుబులు
లీజు మాటున ప్రభుత్వ భూములను సొంతం చేసుకొని దర్జాగా అనుభవిస్తున్న అక్రమార్కుల గుండెల్లో గుబులు రేపుతోంది. ఇన్నాళ్లు అధికారులతో కుమ్మక్కై తక్కువ ధరకు లీజుకు భూములను తీసుకొని వాటిని ఇతర ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్న వ్యవహారం విచారణలో ఎక్కడ బయటపడుతుందోనని కలవర పడుతున్నారు. లీజు గడువు ముగిసినప్పటికీ రెన్యూవల్ చేయించుకోకుండా, లీజు బకాయిలు చెల్లించకుండా ఎగ్గొడుతున్నవారి బాగోతం కూడా పరిశీలనలో బయటపడనున్నది. రాజకీయంగా పలుకుబడి కలిగిన పలువురు నేతలు విలువైన ప్రభుత్వ స్థలాలను లీజుకు తీసుకొని వాటిని సొమ్ము చేసుకోవడమో, నిబంధనలకు విరుద్ధంగా ఇతరుల పేరు మీదకు మార్చడమో చేయడం ద్వారా అక్రమార్జనకు పాల్పడ్డారు. వీరిగుట్టంతా రట్టుకానున్నది. పారిశ్రామిక యూనిట్ల స్థాపన కోసం ప్రభుత్వ భూములను లీజుకు తీసుకున్నప్పటికీ ఇప్పటి వరకు వాటిలో పరిశ్రమలు స్థాపించకుండా పడావుపెట్టిన వ్యవహారం కూడా బహిర్గతం అయినట్టు తెలుస్తోంది. ఈ భూములన్నిటినీ ప్రభుత్వం స్వాధీనం చేసుకోనుండడంతో లీజుదారులు ఆందోళన చెందుతున్నారు. తమ వ్యవహారం బయటపడకుండా ఉండేందుకు కొందరు అధికారులను మచ్చిక చేసుకునే ప్రయత్నం చేస్తున్నట్టు తెలుస్తోంది.
అమ్మకం కోసమేనా?
భూముల అమ్మకం ద్వారా ఆదాయం సమకూర్చుకోవాలనుకుంటున్న ప్రభుత్వం.. ఇప్పుడు తాజాగా లీజు భూములపై దృష్టి సారించింది. స్థిరాస్తి రంగం జోరందుకుంటున్న నేపథ్యంలో ఆయా భూముల్లో ప్రభుత్వమే రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలనుకుంటోంది. నిబంధనలను ఉల్లంఘించిన లీజుదారులను గుర్తించి భూములను వెనక్కి తీసుకోవడమా లేదా మరింత ఆదాయం వచ్చేలా ప్రణాళికను రూపొందించడమా అనే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తున్నట్టు సమాచారం. ఆదాయం కోసం ఆ భూములను వేలం వేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. మరోవైపు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న పలు ముఖ్యమైన సంస్థలకు కొన్ని జిల్లాల్లో భూమి లభించడం లేదు. వాటికి స్థలాలను అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం ఈ చర్య తీసుకుంటున్నట్టు భావిస్తున్నారు.

# తెల్లకోటుకు.. నకిలీ మకిలీ

ఖమ్మం :జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి అపరేషన థియేటర్‌లో అసిస్టెంట్‌గా పనిచేశాడు. ఎంబీబీఎస్ పూర్తిచేసినట్టు చెప్పుకొని నగరంలోని ఓ ప్రధాన సెంటర్‌లో సొంతంగా ఆసుపత్రిని ప్రారంభించాడు. ఇంటర్‌కూడా చదవని ఈయన కొవిడ్ సమయంలో రోగులకు యథేచ్ఛగా చికిత్స చేసి.. రూ.లక్షలకు.. లక్షలు గుంజారు. వారు ఇంటర్ కూడా చదివారో లేదో తెలీదు కానీ ఏకంగా ఎంబీబీఎస్, ఎండీ జనరల్, ఫిజీషియన, సర్జన ఇలా పలువురు స్పెషలిస్టులు అందుబాటులో ఉన్నారని, తమది మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి అని బోర్డు పెట్టేశారు. వైద్యులకు రూ.లక్షల్లో వేతనాలు ఇచ్చుకుంటూ... ఆసుపత్రి, వైద్యం పేరుతో పెద్దదందానే నడుపుతున్నారు. రిలీఫ్ ఆస్పత్రి... నగరంలో ఓ పేరుమోసిన ఆస్పత్రిపేరును కాపీ చేస్తూ ఓ వ్యక్తి ఏర్పాటు చేసిన ఆసుపత్రి ఇది. ఎంబీబీఎస్, ఎండీ జనరల్ ఫిజీషియన, ఎండీ సర్జన అంటూ వైద్యుల పేర్లే లేకుండా బోర్డు పెట్టేశాడు. ఆర్ఎంపీలను కూడగట్టుకుని యథేచ్ఛగాస్కానింగ్, అబార్షన్లు చేస్తున్నారు. అందులో నిపుణులైన వైద్యులు మాటెలా ఉన్నా.. ఇక్కడ నర్సులే అబార్షన్లు చేస్తున్నారు. ఇటీవల జిల్లా వైద్యాధికారులు చేసిన దాడుల్లో వాస్తవాలు వెలుగులోకి రాగా.. ఆ ఆసుపత్రిని సీజ్ చేశారు. ఐదుగురు సిబ్బందిని, మరో వైద్యుణ్ని కూడా ఈ సంఘటనలో అరెస్ట్ చేశారు. దొరికితే దొంగ.. దొరక్కుంటే దొర అన్నట్టు ఉంది




జిల్లా కేంద్రంలోని కొందరు ఆసుపత్రుల తమకు అర్హత లేకపోయినా సంపాదనే లక్ష్యంగా ఆసుపత్రులను నిర్వహిస్తూ ప్రజలను పీల్చి పిప్పిచేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బోర్డులో ఉండే ప్రముఖ డాక్టర్లు.. సీట్లలో ఉండటం లేదని, చివరకు ఆ డాక్టర్‌కు చూయించుకుందామని వచ్చే వారికి.. 'సార్ సెలవులో ఉన్నారు. ఇంకో డాక్టర్ఉన్నారు' అని చెప్పి దాటేయడం, తూతూ మంత్రంగా వైద్యం చేయడం, అందినకాడికి దండుకోవడం లాంటివి చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. నిబంధనల ప్రకారం ఆసుపత్రి పెట్టాలంటే కనీసం ఎంబీబీఎస్ ఉత్తీర్ణత పొంది ఉండాలి. ఎంబీబీఎస్ ధ్రువపత్రంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు దరఖాస్తు చేస్తే అన్నీ పరిశీలించిన తర్వాతే అనుమతిస్తారు. కానీ అక్రమార్కులు నకిలీ ఎంబీబీఎస్ ధ్రువపత్రాన్ని సంపాదించి అధికారులను ఏమార్చి అనుమతులు పొందుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి బోర్డు ఏర్పాటు చేసి రాజధాని పరిధిలోని ప్రముఖ వైద్యుల పేర్లు బోర్డు మీద రాయిస్తున్నారు. లోపలికి వెళ్తే ఆ వైద్యులు కనిపించడం లేదు. వారిస్థానాల్లో జూనియర్ డాక్టర్లు కనిపిస్తున్నారు. అదేమని అడిగితే మీకు అత్యవసరమైతే వైద్యులను పిలిపిస్తామంటూ రోగులకు, వారి బంధువులకు నచ్చచెప్పుతున్నారు. మరికొన్ని ఆస్పత్రుల్లో మెడికల్ షాపు నిర్వాహకులే వైద్యులతో మందులు రాయించడం, వారి వ్యాపారానికి తగినట్టుగా రోగుల నుంచి అనవసరమైన చికిత్సలు, రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించేలా నిబంధనలు పెడుతూ అటు వైద్యులకు.. ఇటు వైద్య రంగానికి మకిలీ అంటేలా వ్యవహరిస్తున్నారు.
నగరంలో వైరా రోడ్డు సమీపంలోనే..ఈ దందా జరిగేది.. నగరంలోని మారుమూల ప్రాంతంలో అంటే పొరబడినట్టే. పక్కాగా నగర ప్రధాన రహదారి వైరారోడ్డు సమీపంలోనే ఇదంతా సాగుతోంది. వైరారోడ్డు సమీపంలో వందల కొద్ది ఆస్పత్రులు ప్రముఖ వైద్యుల పేర్లుతో పుట్టుకొస్తున్నాయి. వాటిలో ఆర్ఎంపీలు, బంధువులు.. ఇతరత్రా పరిచయం ఉన్న వ్యక్తులతోనే కొనసాగుతున్నాయి. ఇలాంటి ఆస్పత్రులపై కన్నేయాల్సిన వైద్య ఆరోగ్యసిబ్బంది ఏదైనా సంఘటనలు జరిగితే తప్ప మిగతా సమయాల్లో మిన్నకుంటున్నారని ఆరోపిస్తున్నారు.
వైద్య శాఖ అధికారులు ఏం చేస్తున్నారు?తమ పరిధిలో ఆస్పత్రులను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అదికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాల్సి ఉంటుంది. వైద్యానికి సంబంధించిన అంశాలే కాకుండా ఫీజులు, ఇతరత్రా వ్యవహారాలన్నింటిని ఓ కంట కనిపెట్టాల్సి ఉంటుంది. కానీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. శాఖలో పూర్తిస్థాయి సిబ్బంది లేకపోవడం, పని ఒత్తిడి వల్లే ఆస్పత్రులను తరచుగా తనిఖీలు చేయలేకపోతున్నామంటూ చెబుతున్నారు. దీంతో నకిలీలు, వైద్యాన్ని వ్యాపారంగా నిర్వహించే వ్యక్తులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా సాగుతోంది.

# ఆదమరిస్తే గల్లంతే

పినపాక : మండలంలోని ఎల్చిరెడ్డిపల్లి గ్రామానికి వర్షాకాలం వస్తుందంటే చాలు వెన్నులో వణుకే. ఆ గ్రామంలో దాదాపు అన్నీ గిరిజన కుటుంబాలే. 50 ఏళ్లకు పైబడే ఇక్కడ నివసిస్తున్నారు. మూడు వైపులా దారులు మూసుకుపోయి నడక, రవాణా, ఏ ప్రయాణం సాగించాలన్నా తలకు మించిన ప్రయాసే. ఈ గ్రామానికి రెండు వైపులా ప్రవహించే పెద్దవాగు వర్షాకాలంలో ఉధృత రూపం దాల్చుతు ంది. మరో వైపు అభయారణ్య భూమి ఉండడంతో వారికి ఇక మిగిలింది ఒకటే దారి. అది కూడా పెదవాగు కోతకు గురై ప్రమాదకర



ంగా మారింది. నిత్యం ఈ దారిలో రాకపోకలు సాగించాలంటే అరచేత ప్రాణాలు పట్టుకుని వెళ్లాల్సిందే. గత ఏడాది వర్షాకాలం దెబ్బతిన్న ఈ రోడ్డును బాగుచేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఈ మార్గంలో నిత్యం రోజు వారీ పని చేసుకుని జీవించే కూలీలతో పాటు, ఇటు నుంచి వెళ్లే రైతులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉండడమే గాక దీనికి కూతవేటు దూరంలో కస్తూర్బా పాఠశాల, ఎల్చిరెడ్డిపల్లి ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లు కూడా ఉన్నాయి.



# కర్ణాటక సీఎం సిద్ధరామయ్యే

దిల్లీ: కర్ణాటక నూతన ముఖ్యమంత్రి ఎంపికలో ఐదు రోజుల ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. రాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రిగా సీనియర్ నేత సిద్ధరామయ్యను కాంగ్రెస్ ఎంచుకుంది. ఇక, డిప్యూటీ సీఎంగా డీకే శివకుమార్‌ను ఖరారు చేసింది. ప్రభుత్వ ఏర్పాటుపై నిన్న అర్ధరాత్రి దాటిన తర్వాత పార్టీలో ఏకాభిప్రాయం కుదిరింది. అనంతరం గురువారం మధ్యాహ్నం పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, కర్ణాటక వ్యవహారాల ఇన్‌ఛార్జ్ రణ్‌దీప్ సుర్జేవాలా మీడియా సమావేశం ఏర్పాటు చేసి.. ఏఐసీసీ నిర్ణయాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ.. "కర్ణాటక విజయం కాంగ్రెస్‌కు ఉత్సాహాన్నిచ్చింది. ఇందుకోసం పార్టీ హైకమాండ్‌తో పాటు నేతలందరూ ఎంతో కృషి చేశారు. మాది ప్రజాస్వామ్య పార్టీ. నియంతృత్వం కాదు.. ఏకాభిప్రాయంపై మాకు నమ్మకం ఉంది. కర్ణాటక కాంగ్రెస్‌లో గొప్ప నేతలున్నారు. ఈ నెల 14న కర్ణాటక శాసనసభాపక్ష సమావేశం నిర్వహించాం. అందులో సీఎం ఎవరనేదానిపై ఎమ్మెల్యేల అభిప్రాయం సేకరించాం. అనంతరం సీఎంగా సిద్ధరామయ్య పేరును అధిష్ఠానం ఖరారు చేసింది. ఇక రాష్ట్ర ఏకైక ఉపముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ బాధ్యతలు చేపడుతారు. దీంతో పాటు రాష్ట్ర పీసీసీ అధ్యక్ష బాధ్యతలను కూడా ఆయనే నిర్వహిస్తారు. వచ్చే ఏడాది పార్లమెంట్ ఎన్నికల వరకు డీకే ఈ బాధ్యతల్లో కొనసాగుతారు" అని వెల్లడించారు.

**మే 20న ప్రమాణస్వీకారం..** బెంగళూరులో కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో కర్ణాటక నూతన ముఖ్యమంత్రిని ఎమ్మెల్యేలు అధికారికంగా ఎన్నుకుంటారు. అనంతరం తమ నిర్ణయాన్ని గవర్నర్‌కు అందజేస్తారని కాంగ్రెస్ తెలిపింది. మే 20న నూతన ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం చేయనున్నట్లు వెల్లడించింది.

**సోనియా బుజ్జగింపులతో..** సీఎం పదవి కోసం సీనియర్ నేతలు సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మధ్య తీవ్ర పోటీ నెలకొనడంతో ముఖ్యమంత్రి ఎంపిక కాంగ్రెస్‌కు క్లిష్టంగా మారింది. ఈ క్రమంలోనే సుదీర్ఘ మంతనాలు జరిపిన పార్టీ హైకమాండ్.. సీఎంగా సిద్ధరామయ్య వైపే మొగ్గుచూపింది. అయితే, దీనికి అంగీకరించని డీకే శివకుమార్.. తొలుత తన బెట్టు కొనసాగించారు.

ఈ క్రమంలోనే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే బుధవారం అర్ధరాత్రి దాటే వరకు ఇరువర్గాలతో చర్చలు జరిపారు. అటు కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీ కూడా డీకేతో మాట్లాడారు. శివకుమార్ డిప్యూటీ సీఎం పదవి తీసుకునేలా సోనియా.. ఆయనను బుజ్జగించినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ ప్రయోజనాల కోసం అధిష్ఠానం నిర్ణయాన్ని అంగకరించానని డీకే శివకుమార్ ఈ సందర్భంగా తెలిపారు. తనపై మరింత బాధ్యత పెరిగిందని ఆయన అన్నారు.



# రైతు కుటుంబంలో పుట్టి.. రెండు సార్లు సీఎంగా ఎదిగి..

కర్ణాటకలో అఖండ విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ సీఎం అభ్యర్థిని ఖరారు చేసింది. రాష్ట్రంలో పాపులర్ నేతగా ఉన్న సిద్ధరామయ్య వైపే అధిష్ఠానం మొగ్గు చూపింది. దీంతో ఐదేళ్ల విరామం తర్వాత కన్నడ సీఎం పీఠంపై మరోసారి సిద్ధరామయ్య ఆశీనులు కానున్నారు. ఈ మేరకు సిద్ధూ తన కొత్త జట్టుతో కలిసి మే 20న ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ నేపథ్యంలో సిద్ధరామయ్య ప్రస్థానాన్ని ఓసారి పరిశీలిస్తే..

**రైతు కుటుంబంలో పుట్టి రాజకీయ కృషీవలుడిగా..** సాధారణ రైతు కుటుంబంలో పుట్టిన సిద్ధరామయ్య స్వయంకృషితో ఎదిగారు. మైసూరు సమీపంలోని సిద్ధరామనహుండిలో 1948 ఆగస్టు 12న జన్మించారు. తల్లిదండ్రులు నిరక్షరాస్యులు. రాష్ట్రంలో మూడో అతి పెద్ద సామాజిక వర్గమైన 'కురుబ' (ఓబీసీ)కు చెందిన నేత. ఉన్నత చదువులు అభ్యసించిన సిద్ధరామయ్య మైసూరులో న్యాయవాదిగా, న్యాయశాస్త్ర ఉపన్యాసకునిగా పని చేశారు. మరోవైపు, రైతు ఉద్యమాల్లో పాలుపంచుకుంటూ ప్రముఖ రైతు నాయకుడు నంజుండస్వామి ప్రియ శిష్యుడిగా పేరుగాంచారు. ఆయన స్ఫూర్తితోనే 1978లో తాలూకా బోర్డు సభ్యుడిగా ఎన్నికై తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి రాజకీయ కృషీవలుడిగా అంచెలంచెలుగా ఎదిగారు.

**తొలి పోటీలోనే సంచలన విజయం :** 1963లో చాముండేశ్వరి అసెంబ్లీ స్థానం నుంచి భారతీయ లోక్‌దళ్ అభ్యర్థిగా పోటీ చేసి సంచలన విజయం సాధించిన సిద్ధూ.. ఆ తర్వాత జనతా పార్టీలో చేరారు. అప్పటి సీఎం రామకృష్ణ హెగ్డే మాతృభాష పరిరక్షణ కోసం స్థాపించిన 'కన్నడ కావలు సమితి' తొలి అధ్యక్షుడిగా సమర్థంగా పనిచేశారు. 1985 ఎన్నికల్లో గెలిచి హెగ్డే ప్రభుత్వంలో మంత్రిగా పని చేశారు. 1989 ఎన్నికల్లో ఓడిపోయారు. 1992లో జనతాదళ్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1994 ఎన్నికల్లో గెలిచి దేవెగౌడ నాయకత్వంలోని జనతాదళ్ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా పని చేశారు. దేవెగౌడ ప్రధాని పదవిని చేపట్టడంతో 1996లో జేహెచ్.పటేల్ సీఎం అయ్యారు. అనంతరం సిద్ధరామయ్య ఉప ముఖ్యమంత్రి పదవి చేపట్టారు. జనతాదళ్ జేడీఎస్, జేడీయూగా చీలిపోవటంతో సిద్ధరామయ్య.. దేవెగౌడ నాయకత్వంలోని జేడీఎస్‌లో చేరి రాష్ట్ర అధ్యక్షుడయ్యారు. 1999 విధాన సభ ఎన్నికల్లో ఓడిపోయారు. 2004లో ఏర్పడిన కాంగ్రెస్, జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా, ఆర్థిక మంత్రిగా సమర్థంగా పనిచేసే మంచి పేరు తెచ్చుకున్నారు. అయితే, దేవెగౌడ తన తనయుడు కుమారస్వామిని ముందుకు తెచ్చేందుకు 2006లో పార్టీ నుంచి సిద్ధరామయ్యను సస్పెండ్ చేశారు. దీంతో ఆయన కాంగ్రెస్‌లో చేరారు. 2008 ఎన్నికల్లో గెలిచి సీఎల్పీ నేతగా ఎన్నికయ్యారు. 1983 నుంచి ఇప్పటివరకు సిద్ధు మొత్తం 9 సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

**మాట కఠినం.. 13సార్లు బడ్జెట్ ప్రవేశట్టిన అనుభవం.. :** సిద్ధరామయ్య రాష్ట్ర రాజకీయాల్లో అశేష అభిమానుల్ని సొంతం చేసుకున్నారు. దేవరాజ్ అరసు తర్వాత ఐదేళ్ల పాటు సీఎంగా పనిచేసింది ఈయనే కావడం విశేషం. అహింద (బలహీనవర్గాల) సముదాయానికి ప్రతినిధిగా ఉండేందుకు ఇష్టపడే సిద్ధూ.. జనతా పరివార్ నుంచి 2006లో కాంగ్రెస్‌లోకి వచ్చినా పార్టీ భావజాలాన్ని సులువుగానే ఆకళింపు చేసుకున్నారు. జనతాదళ్‌లోనూ డిప్యూటీ సీఎంగా, ఆర్థికమంత్రిగా పనిచేసి ఇప్పటివరకూ 13సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఘనత కూడా ఆయనదే. మాట కఠినంగా ఉన్నా అభిమానుల మనసులు గెలిచిన సిద్ధూపై అవినీతి ఆరోపణలు కూడా పెద్దగా ఏమీ లేవు. 2013లో కాంగ్రెస్‌కు 122 సీట్లతో విజయాన్ని అందించడంలో ఆయన పాత్రను విస్మరించని అధిష్ఠానం సీఎంగా ఆయనకే అవకాశం ఇచ్చింది. అధిష్ఠానం విశ్వాసాన్ని వమ్ము చేయకుండా ఐదేళ్ల పాటు రాష్ట్రంలో ఏ పార్టీ అమలు చేయనన్ని సంక్షేమ పథకాలు ప్రజలకు అందించారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలపైనా ఆయనకు పట్టు ఉంది. అపారమైన రాజకీయ అనుభవం.. పార్టీని, ప్రభుత్వాన్ని ఒంటిచేత్తో నడపగలిగే సత్తా ఆయన సొంతం. అధిష్ఠానం సైతం తన నిర్ణయాన్ని కాదనలేని వాతావరణాన్ని ఆయన సృష్టించుకున్నారు. ఈ ఎన్నికల్లోనూ డీకే శివకుమార్‌తో సీఎం విషయంలో పోటీ ఉన్నా, ఐక్యంగా పనిచేసి పార్టీని గెలిపించడంలో రికార్డు విజయాన్ని సాధించడంలోనూ సిద్ధూ కీలక పాత్ర పోషించారు. దీంతో ప్రజలతో పాటు పార్టీ అధిష్ఠానం మదిని గెలుచుకున్న సిద్ధూనే సీఎం పీఠం వరించింది.

# నీకు టైం తెలియదా?.. నీలాంటి వాళ్లను బొక్కలో వేయాలి.. అజయకల్లంపై దేవినేని ఆగ్రహం



ఎన్టీఆర్: మాజీ మంత్రి వివేకా మరణానికి సంబంధించి సీఎం ముఖ్య సలహాదారు అజయ కల్లం చేసిన వ్యాఖ్యలపై టీడీపీ నేత దేవినేని ఉమా మహేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. చీఫ్ సెక్రటరీ అజయ కల్లం రెడ్డి సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని అన్నారు. "మీలాంటి వారి వల్లే జగన్ రెడ్డి రాష్ట్రాన్ని దోచుకుంటున్నాడు. అమరావతి కమరావతి అని విషం చిమ్మిన ఆ నలుగురిలో ఒకరు బయటికి వచ్చారు! కుల పిచ్చితో జగన్ రెడ్డి పక్కన చేరాడు. అజయ్ కల్లాం రెడ్డి సీబీఐ నిన్న వచ్చి అడిగితే టైం తెలియదు చూసుకోలేదు అని చెబుతున్నావు. నీలాంటి కుల పిచ్చి ఉన్న తప్పుడు అధికారుల వల్ల రాష్ట్రం సర్వనాశనం అయిపోయింది. ఇటువంటి తప్పుడు మాటలు మాట్లాడే వారిని బొక్కలో వేయాలి!.. టైం తెలియని వాళ్లు ఐఏఎస్ ఆఫీసర్లుగా ఎందుకు?. సీబీఐ ముందు చేతులు కట్టుకొని నిల్చున్నారు కదా మీలాంటి వెన్నుముక లేని ఆఫీసర్లు, కుల పిచ్చి ఉన్న అధికారులు అవినీతిలో భాగస్వాములై జగన్ రెడ్డిని సపోర్ట్ చేస్తూ ప్రెస్‌మీట్ పెడతావా?. నీకు టైం తెలియదా? కళ్ళు దొబ్బాయా?.. ఆరోజు జగన్ రెడ్డి తెల్లవారుజామున వచ్చి చెప్పాడు అని తెలిసిన వాడివి నాలుగేళ్లుగా ఎందుకు చెప్పకుండా కూర్చున్నావు?. క్షుద్ర పూజలు చేసింది ఎవరు? కోటి రూపాయలు అడ్వాన్స్ ఇచ్చింది ఎవరు?. నాలుగు కోట్లు పంచుకుంది ఎవరు? నరబలులు ఎవరు చేయమన్నారు? ఆంధ్రజ్యోతి రాసే వరకు నువ్వు నోరు తెరవలేదు! సీబీఐ వాళ్ళు వచ్చేవరకు సమాధానం చెప్పలేదు ముందు నీలాంటి వాళ్ళని సీబీఐ వాళ్ళు బొక్కలో వేయాలి!" అంటూ దేవినేని ఉమా మహేశ్వరరావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

# రాజశ్యామల యాగంపై ధూళిపాళ్ళ నరేంద్ర సంచలన ట్వీట్



విజయవాడ : రాజశ్యామల యాగంపై టీడీపీ సీనియర్ నేత ధూళిపాళ్ళ నరేంద్ర సంచలన ట్వీట్ చేశారు. శత్రువులు నాశనం అయిపోవాలని.. కోర్టు కేసుల్లో సానుకూలత రావాలని.. యాగ సంకల్పం చేసి రాష్ట్రం కోసం యాగం చేస్తున్నట్టు సీఎం జగన్ నమ్మిస్తున్నారంటూ ధూళిపాళ్ల పేర్కొన్నారు. ఈ క్రమంలోని జగన్ యాగ సంకల్పం వినాలని.. వీడియోను ట్విటర్‌లో షేర్ చేశారు. "నీ శత్రువులు నాశనం అయిపోవాలి.. నీ కోర్టు కేసుల్లో సానుకూలత రావాలి... అంటూ యాగ సంకల్పం చేసి ... రాష్ట్రం కోసం యాగం అని నమ్మించే గొప్పవాడివయ్యా" అంటూ జగన్‌ను ధూళిపాళ్ళ నరేంద్ర ట్వీట్ చేశారు.

'ప్రజలారా.. ఇదిగో ఈ సంకల్పం వినండి' అంటూ యాగ సంకల్పం చెపుతున్న వీడియోను ట్విట్టర్‌లో నరేంద్ర షేర్ చేశారు. ఇక ఆ యాగ సంకల్పం చెబుతున్న వీడియోలో శత్రునాశనం జరగాలని, న్యాయస్థానాల్లో విజయం లభించాలని, రాజకీయ క్షేత్రంలో విజయాలు పొందాలని జగన్ నమస్కరిస్తుండగా పండితులు సంకల్పం చెప్పారు.

# మత్స్యకార సంఘం నేతలతో చంద్రబాబు భేటీ



విశాఖపట్నం: విశాఖలో మత్స్యకారులు, మత్స్యకారుల సంఘ నాయకులతో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పరవాద మండలం ముత్యాలమ్మ పాలెం తిక్కవానిపాలెం.. ఎంపీటీసీ, వైఎస్సీ నేతలు చంద్రబాబు సమక్షం లో పార్టీలో చేరారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ... అన్ని వర్గాలను దెబ్బతీసిన వ్యక్తి సైకో ముఖ్యమంత్రి అని అన్నారు. సముద్రం లో ప్రమాదవశాత్తు మృతి చెందిన మత్స్యకారులకు డెత్ సర్టిఫికెట్, సకాలంలో అందిస్తామని తెలిపారు. మత్స్యకారుడిని అన్ని విధాలుగా ఆదుకున్న ప్రభుత్వం టీడీపీ అని చెప్పుకొచ్చారు. ఈ ప్రభుత్వ హయాం లో మత్స్యకారులకు రూ.10,000 తప్ప ఏదైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. ముద్దులు పెట్టి తల నిమిరిన జగన్ ఇప్పుడు పిడిగుద్దులు గుద్దుతున్నారని చంద్రబాబు వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు బండారు సత్యనారాయణ, కళా వెంకట్రావు, గంట శ్రీనివాసరావు, వెలగపూడి, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# పేదల ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా ముందుకు తీసుకెళ్లండి: సీఎం జగన్



అమరావతి: గృహనిర్మాణ శాఖపై తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం సమీక్ష చేపట్టారు. నవరత్నాల్లో భాగంగా పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంపై సీఎం జగన్‌కు అధికారులు వివరాలు అందించారు. గడచిన 45 రోజుల్లో హౌసింగ్ కోసం రూ.1085 కోట్లు ఖర్చు చేశామన్న అధికారులు. ఇప్పటివరకు 3.70 లక్షల ఇల్లు పూర్తి. రూఫ్ లెవెల్.. ఆపైన నిర్మాణంలో ఉన్నవి 5.01లక్షల ఇళ్లు, త్వరలోనే వీటి నిర్మాణం పూర్తవుతుందని వెల్లడించిన అధికారులు. మరో 45 రోజుల్లో వీటిని పూర్తిచేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్న అధికారులు. బేస్‌మెంట్ లెవల్ దాటి వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లు 8.64లక్షలపైనే. వీటి పనులనూ వేగంగా ముందుకు తీసుకెళ్తున్నామన్న అధికారులు. సీఎం ఆదేశాలమేరకు జగనన్నకు చెబుదాం స్పెషల్ ఆఫీసర్లను కూడా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్నారని వెల్లడించిన అధికారులు. సీఎం ఆదేశాల మేరకు ఇళ్ల నిర్మాణంలో వాడే మెటీరియల్ నాణ్యతపై ఎప్పటికప్పుడు పరీక్షలు చేస్తున్నామన్న అధికారులు. సీఎం ఆదేశాలమేరకే ఇళ్ల లబ్ధిదారులైన మహిళలకు మరింత భరోసాగా బ్యాంకుల నుంచి ఆర్థిక సహాయం అందించే కార్యక్రమం. ఇప్పటివరకూ 11.03 లక్షలమందికి రూ. 35 వేల చొప్పున రుణాలు. రూ. 3886.76 కోట్లమేర పావలా వడ్డీకి రుణాలు.



# ముంబయి దాడుల మాస్టర్‌మైండ్ భారత్‌కు అప్పగింత..!

వాషింగ్టన్: వచ్చే నెలలో భారత ప్రధాని నరేంద్రమోదీ అమెరికాలో పర్యటించనున్న నేపథ్యంలో ఉగ్రవాదం కట్టడికి ఇరుదేశాల మధ్య కీలక అడుగుపడింది. 26/11 ముంబయి దాడుల్లో కీలక నిందితుల్లో ఒకడైన తహవూర్ రాణాను అప్పగించాలని భారత్ చేసిన అభ్యర్థనకు ఆమోదం లభించింది. ఈ మేరకు అమెరికాలోని కాలిఫోర్నియా జిల్లా కోర్టు తీర్పునిచ్చింది.

భారత్-అమెరికా మధ్య ఉన్న నేరస్థుల అప్పగింత ఒప్పందానికి అనుగుణంగా కోర్టు ఈ ఆదేశాలిచ్చింది. పాకిస్థాన్ మూలాలున్న తహవూర్ రాణా 2008లో జరిగిన ముంబయి దాడులకు ఆర్థిక సాయం చేశాడన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. 26/11 ముంబయి దాడుల్లో అతడి పాత్రపై ఎన్ఐఏ దర్యాప్తు చేస్తోంది. దీనిలో భాగంగా అతడిని అప్పగించాలని భారత్ కోరడంతో ప్రస్తుతం రాణా అమెరికా పోలీసుల అదుపులో ఉన్నాడు. ఉగ్రమూకలకు సాయం చేశాడన్న ఆరోపణల కింద గతంలో షికాగో కోర్టు 14 సంవత్సరాలు జైలు శిక్ష కూడా విధించింది. 2008 నవంబర్ 26న దేశ ఆర్థిక రాజధాని ముంబయిలో ఉగ్రమూకలు జరిపిన భీకర దాడిలో దాదాపు 166 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే.

ఈ కేసులో ప్రస్తుతం ప్రధాన నిందితుడిగా ఉన్న డేవిడ్ హెడ్లీకి తహవూర్ అత్యంత సన్నిహితుడు. అలాగే దాడులకు ముందు ముంబయిలో తుది రెక్కీ నిర్వహించింది కూడా తహవూరేనని విచారణలో భాగంగా హెడ్లీ గతంలోనే వెల్లడించాడు. ఇదిలా ఉంటే.. జూన్ 22న ప్రధాని అమెరికాలో పర్యటించనున్నారు. అమెరికా అధ్యక్షుడు జోబైడెన్, ప్రథమ మహిళ జిల్ బైడెన్‌లు ప్రధాని మోదీ కోసం స్టేట్ డిన్నర్‌ను ఏర్పాటు చేయనున్నారు.



# జల్లికట్టుపై సుప్రీం కీలక తీర్పు

దిల్లీ: తమిళనాడు సంప్రదాయ క్రీడ జల్లికట్టు విషయంలో ఆ రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. జల్లికట్టుపై తమిళనాడు చట్టాన్ని సర్వోన్నత న్యాయస్థానం సమర్థించింది. జంతు హింస చట్టం ఈ ఆటకు వర్తించదని తెలిపింది. ఈ మేరకు 2014లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తాజాగా ఐదుగురు సభ్యుల ధర్మాసనం సవరించింది. తమిళ సంస్కృతిలో జల్లికట్టు ఓ భాగమని రాష్ట్ర ప్రభుత్వం తెలిపిందని కోర్టు ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. ఈ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను కోర్టు కొట్టేసింది. తమిళనాడులో పొంగల్ పండగ సమయంలో ఈ జల్లికట్టు ఆటను నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. అయితే, ఈ క్రీడపై గతంలో తీవ్ర వ్యతిరేకత రావడంతో 2014లో సుప్రీంకోర్టు జల్లికట్టుపై నిషేధం విధించింది. ఈ క్రీడ జంతువులపై హింస నివారణ చట్టాన్ని ఉల్లంఘించడమేనని అప్పట్లో కోర్టు పేర్కొంది. అయితే, ఈ నిషేధాన్ని వ్యతిరేకిస్తూ తమిళనాట పెద్ద ఎత్తున ఆందోళనలు జరిగాయి. ఈ క్రమంలోనే జల్లికట్టును ప్రివెన్షన్ ఆఫ్ క్రూయాల్టీ టు యానిమల్స్ చట్టం నుంచి తొలగిస్తూ 2016లో కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. అనంతరం 2017లో తమిళనాడు ప్రభుత్వం జల్లికట్టుకు అనుకూలంగా ప్రివెన్షన్ ఆఫ్ క్రూయాల్టీ టు యానిమల్స్ చట్టానికి సవరణలు చేస్తూ కొత్త యాక్ట్ తీసుకొచ్చింది. అయితే, ఈ చట్టాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. 1960 నాటి జంతు హింస నివారణ చట్టాన్ని ఉల్లంఘించేలా ఈ చట్టం ఉందని పిటిషనర్లు పేర్కొన్నారు. దీని వల్ల జంతువులు, మనుషులు గాయాలపాలయ్యే ప్రమాదం ఉందని, హింసతో కూడిన ఈ ఆటను నిషేధించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై గతేడాది విచారణ జరిపిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం.. జల్లికట్టులో హింస ఉంటుందని, అంత మాత్రానా దాన్ని నెత్తుటి క్రీడ అనలేమని పేర్కొంది. అనంతరం తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా సర్వోన్నత న్యాయస్థానం దీనిపై తీర్పు వెలువరించింది. జల్లికట్టుపై తమిళనాడు చేసిన చట్టాన్ని రాజ్యాంగ ధర్మాసనం సమర్థించింది. "గత శతాబ్ద కాలంగా తమిళనాడులో జల్లికట్టును నిర్వహిస్తున్నారు. ఇది ఆ రాష్ట్ర సంస్కృతిలో భాగమా? కాదా? అన్నదానిపై సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకోదు. అది తమ వారసత్వ సంస్కృతిలో భాగమని శాసనసభ నిర్ణయించినపుడు.. న్యాయవ్యవస్థ దాన్ని భిన్నకోణంలో చూడలేదు. దీనిపై శాసనసభ నిర్ణయం తీసుకోవడమే మంచిది" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. దీంతో పాటు మహారాష్ట్ర, కర్ణాటకలోనూ ఇలాంటి క్రీడలను అనుమతిస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించిన చట్టాలను కూడా సుప్రీంకోర్టు సమర్థించింది.



# తిరుమలలో కిలోమీటర్ల మేర భక్తుల బారులు

తిరుమల: కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవారి సన్నిధిలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వేసవి సెలవులు కావడంతో స్వామివారి దర్శనార్థం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు.

దీంతో దర్శనం కోసం కిలోమీటర్ల మేర క్యూలైన్లలో భక్తులు వేచి ఉండాల్సి వస్తోంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్, నారాయణగిరి షెడ్లు కిక్కిరిసిపోయి.. శిలాతోరణం వరకు రెండు కిలోమీటర్ల పొడవున క్యూలైన్‌లో భక్తులు వేచి ఉన్నారు.

శ్రీవారి దర్శనానికి 36 గంటల సమయం పడుతున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తాగునీరు, అన్నప్రసాదాలు అందించేలా అన్ని ఏర్పాట్లు చేశారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు తితిదే అధికారులు, భద్రతా సిబ్బంది తెలిపారు.

# వయ్యారాల వేదిక నడుము నాభి అందం చూడతరమా..!

నందమూరి కల్యాణ్ రామ్ తో కలిసి విజయ దశమి సినిమా లో నటించిన వేదిక అందాల గురించి అందరికీ తెలిసిందే. సినిమా పెద్దగా ఆడకపోయినప్పటికీ ఆమె అందంతో వేలాది మంది అభిమానులను సొంతం చేసుకుంది. అంతే కాదండోయ్ వరుస సినిమా ఆఫర్లను కూడా దక్కించుకుందీ ముద్దుగుమ్మ. తెలుగులోనే కాకుండా తమిళ్ మలయాల కన్నడ చిత్రాల్లో నటిస్తూ దూసుకెళ్తోంది. మూడు పదుల వయసులోనూ పదహారేళ్ల పడుచు పిల్లలా కనిపిస్తూ.. కుర్రకారును కవ్విస్తుంటుంది. తెలుగులో చివరగా బాలయ్య బాబు సినిమా రూలర్ లో నటించింది. అందులోనూ పెద్దగా మెప్పించలేకపోయింది. కానీ తనను అభిమానించే వాళ్లకు సోషల్ మీడియా అకౌంట్ల



ద్వారా ఎప్పుడూ దగ్గరగానే ఉంటుంది. తనకు సంబంధించిన సినిమా అప్ డేట్లతో పాటు తన పర్సనల్ లైఫ్ కు సంబంధించిన విషయాలను కూడా అభిమానులతో పంచుకుంటూ ఉంటుంది. అప్పుడప్పుడూ ఫొటో షూట్ లు చేసి.. తన అందమైన ఫొటోలను నెట్టింట వదులుతుంది. అందులో ఈ హాట్ బ్యూటీని చూసిన కుర్రకారుకు ఫీవర్ రావడం పిచ్చెక్కిపోవడం కామన్ అయిపోయాయి. అయితే తాజాగా ఈమె ఇన్ స్టాగ్రామ్ వేదికగా ఓ మూడు ఫొటోలను షేర్ చేసింది. అందులో బ్లాక్ డ్రెస్ లో కనిపిస్తున్న ఈ హాట్ బ్యూటీ తన వయ్యారాల నడుముతో పాటు ఒంపుసొంపులన్నీ ఒలకబోసింది. అందమైన నాభి అందాన్ని చూపిస్తూ కుర్రకారుకు పిచ్చెక్కిస్తోంది. స్లీవ్ లెస్ టాప్ చిన్న బ్లాక్ కలర్ మిడ్డీ వేసుకొని చేతులు మొత్తం పైకి లేప అందాలను ఆరబోసింది. ఎద అందాలను ఓపెన్ గా చూపించకపోయినా ఎత్తెత్తి చూపిస్తోంది. బ్లాక్ డ్రెస్ లో మిలమిలా మెరిసిపోతోందీ ముద్దుగుమ్మ. సూర్య కిరణాలన్నీ ఆమె అందాలపై పడడంతో చూసేందుకు మరింత హాట్ గా కనిపిస్తోంది. ఈ ఫొటోలను చూసిన అభిమానులు తమదైన స్టైల్ లో కామెంట్లు చేస్తున్నారు. బ్లాక్ డ్రెస్ లో చాలా హాట్ దా ఉన్నావ్ క్యూటీ అంటూ కొందరు నిన్న నీ అందాన్ని చూసి తట్టుకోలేక పోతున్నామంటూ మరికొందరు కామెంట్లు చేస్తున్నారు. ఆమె ఫొటోలు నెట్టింట షేర్ చేసిన గంటలోపే వేలల్లో లైకులు వందల్లో కామెంట్లు వచ్చాయి. ఒక్క ఇన్ స్టాగ్రామ్ లోనే 3.7 మిలియన్ల ఫాలోవర్ల ను కల్గిన ఈ బ్యూటీ 1831 పోస్టులను షేర్ చేసింది ఇప్పటి వరకు.

## చక్కనైన సీతమ్మ.. చీరకట్టులో ముద్దుగా..

మృణాల్ ఠాకూర్.. అంటే గుర్తు పట్టక పోవచ్చు కానీ... సీతారామం సీత అంటే వెంటనే గుర్తు పడతారు. ఆ ఒక్క సినిమాతో తెలుగు ప్రేక్షకులకే కాదు... దేశవ్యాప్తంగా అందరికి హాట్ ఫేవరెట్గా మారిపోయింది ఈ సిల్వర్ స్క్రీన్ సీత. సీతారామం సినిమాతో తెలుగు ఆడియన్స్ ముందుకు వచ్చిన ఈ బ్యూటీ... తెర మీద ఎంత ట్రెడిషనల్గా కనిపించారో తెలిసిందే. రియల్ లైఫ్లోనూ అంతే బ్యూటిఫుల్ గా కనిపిస్తోంది. తాజాగా ఆమె ఇన్ స్టా గ్రామ్ వేదికగా కొన్ని ఫోటోలను పోస్ట్ చేసింది. అచ్చమైన తెలుగమ్మాయిలా.. చీరలో మెరిసింది ఈ భామ. పింక్ కలర్ సారీ కట్టుకుని.. దానికి తగ్గట్లుగా జ్యూవెలరి వేసుకుని క్యూట్ లుక్స్ తో జనాలను ఆకట్టుకునేలా ఉంది. చూడగానే అచ్చం తెలుగమ్మాయిలా మెరిసింది ఈ భామ. ఇక ఈ ఫోటోలు షేర్ చేస్తూ... సారి లవ్ అంటూ క్యాప్షన్ రాసుకొచ్చింది. ఇది చూసిన నెటిజన్లు... కామెంట్ బాక్స్ లో హాట్ లను వర్షం కురిపిస్తున్నారు. సో క్యూట్ అంటూ కామెంట్స్ పెడుతున్నారు. ఇక సీతారామం



సినిమాలో మృణాల్ను చూసిన ప్రేక్షకులు... కలల రాణిగా సీతగా మృణాల్ ను పిలుచుకుంటున్నారు. తొలి సినిమాతోనే సౌత్ ఆడియన్స్ను ఫిదా చేసిన ఈ నార్త్ బ్యూటీ... ట్రెండీ లుక్ లోనే కాదు.. చీరలోనూ అదరగొడుతోంది. ఇక మృణాల్ ఠాకుర్ దుల్కర్ సల్మాన్ కలిసి నటించిన సీతారామం.. తెలుగు తమిళ్ లోనే కాదు.. హిందీలోనూ భారీ కలెక్షన్స్ రాబట్టాయి. హను రాఘవపూడి తెరకెక్కించిన ఈ సినిమాను అశ్వినీ దత్ నిర్మించారు. ప్రస్తుతం నానితో ఓ సినిమా చేయనుంది. నాని తన 30వ చిత్ర అప్డేట్ ను ఇటీవల ప్రకటించాడు. వైర ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై నిర్మాతలు మోహన్ చేరుకూరి డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్న ఈ సినిమాలో మృణాల్ నటిస్తోంది. నూతన దర్శకుడు శౌర్యువ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నాడు. మలయాళ సినిమా హృదయం లాంటి సూపర్ హిట్కు సంగీతాన్ని సమకూర్చిన హేషమ్ అబ్దుల్ వహాబ్ మ్యూజిక్ అందిస్తున్నారు చూడాలి ఈ జోడి ప్రేక్షకులను ఎలా మెస్మరైజ్ చేయనుందో.




# రాజా డీలక్స్ లో నటిస్తున్నట్లుగా చెప్పకనే చెప్పేసింది





ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా గురించి ఇప్పటి వరకు అధికారికంగా ప్రకటన రాలేదు. ఆ సినిమా షూటింగ్ విషయంలో అనేక రకాల పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఆ మధ్య ఒక షెడ్యూల్ పూర్తి అయ్యింది. మరో షెడ్యూల్ కు సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నట్లుగా సమాచారం అందుతోంది. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ లో ఈ సినిమా రూపొందుతున్నట్లుగా సమాచారం అందుతోంది. ఇక ఈ సినిమా లో ప్రభాస్ కు జోడీగా ముగ్గురు ముద్దుగుమ్మలు నటించబోతున్నారని చాలా రోజులుగా వార్తలు వస్తున్నాయి. ముగ్గురు ముద్దుగుమ్మల్లో మాస్టర్ బ్యూటీ మాళవిక మోహనన్ ఒకరు అని కూడా ప్రచారం జరుగుతోంది. ఇన్నాళ్లు కూడా సినిమా గురించే అఫిషియల్ గా ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. ఇక హీరోయిన్ విషయం క్లారిటీ లేనేలేదు. తాజాగా మాళవిక మోహనన్ సోషల్ మీడియాలో అభిమానులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పింది. ఆ సందర్భంగా తెలుగు సినిమా గురించి స్పందించింది.

మాళవిక మోహనన్ ఒక అభిమాని తెలుగు సినిమా ఎంట్రీ ఎప్పుడు అంటూ ప్రశ్నించగా ఆమె స్పందిస్తూ.. తెలుగు సినిమాకు సంబంధించిన వర్క్ జరుగుతోంది. తప్పకుండా త్వరలోనే ఆ సినిమాను గురించి అధికారికంగా ప్రకటించే అవకాశాలు ఉన్నాయి అన్నట్లుగా చెప్పుకొచ్చింది. ఈ అమ్మడు ప్రభాస్ సినిమాలో కాకుండా మరే సినిమాలో నటిస్తున్నట్లుగా వార్తలు రాలేదు. కనుక తాను తెలుగు సినిమాలో నటిస్తున్నాను అంటూ చెప్పింది కనుక అది ప్రభాస్.. మారుతి సినిమా అయ్యి ఉంటుంది అంటూ చాలా మంది భావిస్తున్నారు. రాజా డీలక్స్ టైటిల్ ను పరిశీలిస్తున్నట్లుగా వార్తలు వచ్చాయి. కానీ ఇప్పటి వరకు ఎలాంటి అప్డేట్ అధికారికంగా రాలేదు.

# మెన్ మాస్ సెలూన్ లో డర్టీ బ్యూటీ హాట్ అందాలు





డర్టీ హరి సినిమా లో హీరోయిన్ గా నటించి మంచి గుర్తింపు దక్కించుకున్న ముద్దుగుమ్మ రుహాని శర్మ. ఈ అమ్మడు మెల్ల మెల్లగా ఇండస్ట్రీలో పాతుకు పోయేందుకు ప్రయత్నాలు చేస్తోంది. డర్టీ హరి సినిమా మొత్తం చాలా డర్టీ గా అనిపించినా కూడా రుహాని శర్మ పాత్ర మరియు ఆమె లుక్ మాత్రం చాలా డీసెంట్ గా ఉంటుంది. అందుకే రుహాని ప్రేక్షకులకు నచ్చింది. అంతకు ముందు మరియు ఆ తర్వాత కూడా రుహాని ఒక మోస్తరు స్కిన్ షో చేస్తూ సినిమాల్లో నటించింది.. నటిస్తూనే ఉంది. రుహాని యొక్క స్కిన్ షో చేయాలని ఏ ఫిల్మ్ మేకర్ కూడా భావించలేదు. అంతే కాకుండా ఆమె అందాలను చూపించి ప్రేక్షకులను థియేటర్లకు రప్పించాలని కూడా ఫిల్మ్ మేకర్స్ భావించడం లేదు. హీరోయిన్ గా ఈ అమ్మడు ఇక నుండి స్కిన్ షో చేసేందుకు.. బికినీ ట్రీట్ చేసేందుకు సిద్ధం అన్నట్లుగా ఈ ఫొటోలతో చెప్పకనే చెబుతోంది. ఈ అందాల ముద్దుగుమ్మ రుహాని శర్మ యొక్క అందాల ఆరబోత సోషల్ మీడియాలో హీట్ పెంచుతోంది. మరోసారి ఈ అమ్మడి ఫొటోలు వైరల్ అయ్యాయి. ఒక మెన్ మాస్ సెలూన్ లో ఈ అమ్మడు ఫొటో షూట్ తో నెటిజన్స్ ను రెచ్చగొడుతుంది. అందాల ఆరబోత విషయంలో ఎంతో మంది స్టార్స్ ఈమె ముందు దిగదుడుపే అన్నట్లుగా క్లీ వేజ్ షో చేసి మతులు పోగొడుతోంది. నడుము అందం చూపిస్తూ డీ క్లీ వేజ్ షో చేసిన ఈ అమ్మడి యొక్క అందాల విందు ఎప్పుడు వెండి తెరపై చూస్తామో అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. మీట్ క్యూట్ తో గత ఏడాది ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ అమ్మడు ప్రస్తుతం తెలుగు లో ఒక ప్రాజెక్ట్ ను చేస్తోంది.

ఇదే సమయంలో హిందీ లో ఆగ్ర అనే సినిమా తో ఎంట్రీ ఇవ్వబోతుంది. సౌత్ తో పాటు నార్త్ లో కూడా ఈ అమ్మడు కచ్చితంగా సందడి చేయడం పక్కా అంటూ ఈ ఫొటోలను చూస్తూ ఉంటే అనిపిస్తుంది.

# నడుము అందాలతో మతిపోగొట్టేసిన పార్వతి నాయర్

పార్వతి నాయర్ గురించి టాలీవుడ్ ప్రేక్షకులకి పెద్దగా తెలియకపోవచ్చు కాని మలయాళం తమిళ్ చిత్రాలు చూసే వారికి మాత్రం ఆమె సుపరిచితమే అని చెప్పాలి. ఇక సినిమాల కంటే ఆ మధ్య తన ఇంట్లో పనిచేసే వ్యక్తిపై వేధింపుల ఘటనతో వార్తల్లోకి ఎక్కింది. అయితే అంతకంటే ముందుగా ఈ అమ్మడుకి సోషల్ మీడియాలో మంచి ఫాలోయింగ్ ఉంది. దీనికి కారణం రెగ్యులర్ గా ఈ బ్యూటీ పెట్టె అందాల ఫోటోలే కారణం. అందాల ప్రదర్శనలో ఎలాంటి హద్దులు పెట్టుకోకుండా సోషల్ మీడియాలో హాట్ ఫోటోలతో పార్వతి నాయర్ సందడి చేస్తూ ఉంటుంది. ఆమె సినిమాలలో చేసే గ్లామర్ రోల్స్ కంటే సోషల్ మీడియాలో గ్లామర్ షో పీక్ లో ఉంటుందని చెప్పాలి. 2014లో ఈ బ్యూటీ మలయాళీ చిత్రంతో కెరియర్ స్టార్ట్ చేసింది. స్టార్ హీరోయిన్ రేంజ్ గుర్తింపు లేకపోయిన



నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపుని సొంతం చేసుకుంది. ఇక పార్వతి నాయర్ బ్రదర్ ఇండియన్ క్రికెటర్ గా ఐపీఎల్ లో రాణిస్తున్నాడు. అతని పేరు శంకర్. ఈ విషయం చాలా మందికి తెలియదు. ఇదిలా ఉంటే ఆమె చివరిగా 83 అనే హిందీ సినిమాలో నటించింది. ఇదిలా ఉంటే ఈ తాజాగా ఈ బ్యూటీ ఇన్స్టాగ్రామ్ లో వైట్ కలర్ బ్లౌజ్ జీన్ ఫ్యాంట్ తో నడుము అందాలు కనిపించే విధంగా దిగిన ఫోటోలని ఇన్స్టాలో షేర్ చేసింది. ఇవి షేర్ చేసిన వెంటనే వైరల్ కావడం విశేషం. ఈ లుక్ లో పార్వతి నాయర్ బోల్డ్ అండ్ హాట్ గా కనిపిస్తుందని ఆమె అభిమానులు కామెంట్స్ చేయడం విశేషం. వైట్ బ్లౌజ్ లో క్లీవేజ్ షో తో సంనాన్ని నడుము ఒంపులు చూపిస్తూ కుర్రాళ్ళకి తన అందంతో పార్వతి మతి పోగొడుతుంది అని చెప్పాలి. ఈ ఫోటోలు చూసిన వారి మరింత హాట్ అండ్ నావెల్ ఫోటోలు షేర్ చేయాలని కామెంట్స్ చేస్తున్నారు. కొంత మంది ఈ లుక్ లో చాలా హాట్ గా ఉన్నావంటూ పొగడ్తలు కురిపిస్తున్నారు.

## హిట్ బ్యూటీ థైస్ చూపిస్తూ వయ్యారాల ఒలకబోత

2018 ఫెమినా మిస్ ఇండియాగా నిలిచిన ముద్దుగుమ్మ మీనాక్షి చౌదరి హీరోయిన్ గా తెలుగు సినిమాల్లో 2021 లో ఎంట్రీ ఇచ్చింది. ఇచ్చట వాహనములు నిలుపరాదు అనే సినిమా తో తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ ముద్దుగుమ్మ వరుసగా సినిమాలు చేస్తూ దూసుకు పోతుంది. గత ఏడాదిలో అడవి శేష్ హీరోగా నటించిన సూపర్ హిట్ మూవీ 'హిట్ 2' లో నటించి మెప్పించిన విషయం తెల్సిందే. అడవి శేష్ తో రొమాంటిక్ సన్నివేశాల్లో అలరించిన ఈ అమ్మడు మరిన్ని రొమాంటిక్ పాత్రల్లో ఆసక్తిగా ఉన్నట్లుగా ఈ ఫోటో షూట్స్ ను చూస్తూ ఉంటే అర్థం అవుతోంది.

హీరోయిన్ గా ఈ అమ్మడు ప్రస్తుతం తెలుగు తో పాటు ఇతర భాషల్లో కూడా నటించేందుకు ఆసక్తి చూపిస్తోంది. ఇదే



సమయంలో అందరిని అలరించేందుకు తన హాట్ ఫొటోలను సోషల్ మీడియా ద్వారా రెగ్యులర్ గా షేర్ చేస్తూనే ఉంది. తాజాగా ఈ ఫొటోలతో అలరించింది. థైస్ ను ఎక్స్ పోజ్ చేస్తూ వయ్యారంగా కెమెరాకు ఫోజ్ ఇచ్చిన ఈ అమ్మడి యొక్క అందాన్ని చూస్తూ అలాగే ఉండి పోవాలి అనిపిస్తుంది అంటూ కామెంట్స్ వస్తున్నాయి.

ఇలాంటి అందగత్తె కు టాలీవుడ్ లో స్టార్ హీరోలకు జోడీగా నటించే అవకాశాలు రావాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఇంకొక్క హిట్ టాలీవుడ్ లో పడితే ఈ అమ్మడు వరుసగా స్టార్ హీరోల సినిమాల్లో నటించే అవకాశాలు ఉన్నాయి.



# తెలంగాణకు మరో భారీ పెట్టుబడి.. రూ.3 వేల కోట్లు ఇన్వెస్ట్ చేయనున్న మెడ్‌ట్రానిక్

న్యూయార్క్: తెలంగాణకు విదేశీ కంపెనీలు క్యూకడుతున్నాయి. మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ దిగ్గజ సంస్థ వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ హైదరాబాద్‌లో తమ అంతర్జాతీయ అభివృద్ధి కేంద్రాన్ని (ఐడీసీ) ఏర్పాటు చేస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించింది. తాజాగా మరో మెడికల్ డివైజెస్ ఉత్పత్తిలో గ్లోబల్ లీడర్ అయిన మెడ్‌ట్రానిక్స్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. సుమారు రూ.3 వేల కోట్లతో హైదరాబాద్‌లో మెడికల్ డివైజెస్ ఆర్ అండ్ డీ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నది. ఈమేరకు అమెరికా పర్యటనలో ఉన్న మంత్రి కేటీఆర్‌తో మెడ్‌ట్రానిక్స్ కంపెనీ ప్రతినిధులు సమావేశమయ్యారు. చర్చల అనంతరం రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించారు. మెడ్‌ట్రానిక్స్ నిర్ణయంపట్ల మంత్రి కేటీఆర్ ఆనందం వ్యక్తంచేశారు. తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యాపార అనుకూల విధానాలతో పెట్టుబడులు తరలివస్తున్నాయనడానికి ఇంతకుమించిన నిదర్శనం మరొకటి లేదని ట్విట్టర్ వేదికగా వెల్లడించారు. కాగా, అమెరికా వెలుపల వెడ్‌ట్రానిక్స్ అతిపెద్ద ఆర్ అండ్ డీ సెంటర్‌ను హైదరాబాద్‌లోనే ఏర్పాటు చేస్తుండటం విశేషం.

# వాళ్ళు క్షణికావేశంలో బీజేపీలో చేరారు...




హైదరాబాద్: వివేక్, ఈటల, విశ్వేశ్వర రెడ్డి లాంటి వాళ్ళు కాంగ్రెస్‌లోకి రావాలని ఆహ్వానిస్తున్నమని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ వివేక్, ఈటల, కొండా లాంటి వాళ్ళు క్షణికావేశంలో బీజేపీలో చేరారని, బీజేపీ సిద్ధాంతంతో సంబంధంలేనివాళ్ళు కొందరు బీజేపీని నమ్మి ఆ పార్టీలో చేరారన్నారు. సీఎం కేసీఆర్ వ్యతిరేక పునరేకీకరణ చేయాలనుకునే వాళ్ళు కాంగ్రెస్‌లోకి రావాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి తాను నాయకుడ్ని కాదని, సోనియా, ఖర్గేలే నాయకులన్నారు. తన వల్ల ఇబ్బంది అవుతుంది అనుకుంటే... ఒక మెట్టు కాదు పది మెట్లు దిగడానికి తాను సిద్ధమన్నారు. కర్ణాటక ఫలితాలపై బండి సంజయ్, కేసీఆర్ ఒకేలాగా మాట్లాడుతున్నారని, బండి సంజయ్ మాటలను సీఎం సమర్థించినట్టే ఈరోజు కర్ణాటక, రేపు తెలంగాణ, తర్వాత దేశమంతా కాంగ్రెస్ వస్తుందని రేవంత్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ బ్రతికింది కాంగ్రెస్ పార్టీ వల్లేనన్నారు. సీఎం కేసీఆర్‌కు ఓటమి అర్థమై తప్పించుకోవడానికి ఎమ్మెల్యేలపై నెపం వేస్తున్నారని విమర్శించారు. ప్రజా సొమ్ముతో వేరే రాష్ట్రాల్లో ప్రకటనలు ఇస్తారా? అని ప్రశ్నించారు. త్వరలోనే బీసీ పాలసీ ప్రకటిస్తామన్నారు. బీసీ గర్జన నిర్వహించాలని పార్టీ ఆదేశించిందని, బీసీలకు వ్యతిరేకంగా బీజేపీ కమండల ఉద్యమం చేసిందన్నారు. మోదీని ప్రధాని చేస్తే బీసీల కడుపు నిండదన్నారు. పదవి పోయే ముందు బీజేపీకి బీసీలు గుర్తుకొస్తున్నారా? అని ప్రశ్నించారు. బీసీలకు ప్రాధాన్యత ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనన్నారు. మోదీని ఓడించడానికి కాంగ్రెస్ నాయకత్వం అవసరమని దేశంలోని అన్ని పార్టీలు అనుకుంటున్నాయన్నారు. కర్ణాటకలో చక్రం తిప్పాలని చూసిన కేసీఆర్ నడుములు విరగొట్టారని, కేసీఆర్, మోదీ వేరు వేరు కాదని రేవంత్ అన్నారు. జేడీఎస్‌ను గెలిపించాలని కేసీఆర్ ప్రయత్నించారని, కర్ణాటకలో బీజేపీ చేసిందే తెలంగాణలో బీఆర్ఎస్ చేస్తోందన్నారు. కర్ణాటక ఫలితాలను దేశవ్యాప్తంగా చర్చిస్తున్నారని, ఇక మోదీ బ్రాండ్‌కు కాలం చెల్లిందన్నారు. మోదీ విధానాలకు వ్యతిరేకంగా కర్ణాటక ప్రజలు నిలబడ్డారని కొనియాడారు. కర్ణాటక ప్రజల మధ్య బీజేపీ చిచ్చు పెట్టిందని, మోదీ కుట్రలను కర్ణాటక ప్రజలు తిప్పికొట్టారన్నారు. కాంగ్రెస్ పార్టీతో ప్రత్యక్ష సంబంధం లేనివాళ్ళు కూడా కర్ణాటక ప్రజలను అభినందించారని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# పేదలు ఆత్మగౌరవంతో బతకాలనే డబుల్ బెడ్రూం ఇండ్లు : మంత్రి తలసాని




హైదరాబాద్ : పేదలు ఆత్మగౌరవంతో బతకాలనే డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం చేపట్టినట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని కమలా నగర్‌లో నిర్మించిన 210 డబుల్ బెడ్రూం ఇండ్లను బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌తో కలిసి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. లక్ష డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మిస్తే కాంగ్రెస్, బీజేపీ నేతలకు కనిపిస్తలేవు అని మండిపడ్డారు. ఉచితంగా డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల బ్యాంకు రుణాలను కూడా మాఫీ చేసి పేదలను ఆదుకున్న గొప్ప నేత కేసీఆర్ అని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ గుర్తు చేశారు. 210 డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణానికి మొత్తం రూ.16 కోట్ల 27 లక్షల 50 వేలు ఖర్చు చేయగా, రూ.15.50 లక్షల వ్యయంతో మౌలిక సదుపాయాలు కల్పించారు. ఈ కాలనీకి లక్ష లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్, విద్యుత్ సౌకర్యంతో పాటు 15 దుకాణాలను ఏర్పాటు చేశారు. ఒక్కొక్కటి 560 ఎస్ఎఫ్‌టీ విస్తీర్ణంలో రూ.7.75 లక్షల వ్యయంతో నిర్మించారు. ఈ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు డిగ్నిటీ కాలనీగా నామకరణం చేశారు.




దిల్లీ: తెలంగాణలో మరో ఆరు నెలల్లో ఎన్నికలు ఉన్నందున దుష్ప్రచారాలతో భాజపాను బలహీనం చేసే కుట్రలు చేస్తున్నారని ఆ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. తాను కాంగ్రెస్‌లో చేరనున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. ఆ వార్తలను ఎవరూ నమ్మొద్దని.. భాజపాలోనే తాను కొనసాగుతున్నట్లు స్పష్టం చేశారు. దిల్లీలో రాజగోపాల్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. “కర్ణాటక ఫలితాలు చూసి కాంగ్రెస్‌లోకి మళ్లీ రావాలని నా మిత్రులు అడుగుతున్నారు. నేను భాజపాను వీడుతున్నట్లు కొన్ని తప్పుడు వార్తలు వస్తున్నాయి. రేవంత్ రెడ్డి బ్లాక్‌మెయిల్ చేసి రూ.కోట్లు సంపాదించారు. ఆయన 20 ఏళ్లు తెదేపాలో ఉండి కాంగ్రెస్‌లోకి వచ్చారు. మేం ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్‌లోనే ఉన్నవాళ్లం. ఈ మధ్యే వచ్చిన రేవంత్ నాయకత్వంలో ఎలా పనిచేయాలి? నేను డబ్బుకు అమ్ముడుపోయే వ్యక్తిని కాదు.. పోరాడే వ్యక్తిని. దుష్ప్రచారంతోనే మునుగోడు ఉప ఎన్నికలో నన్ను ఓడించారు. కేసీఆర్‌ను గద్దె దింపేందుకే భాజపాలోకి వచ్చాను. కర్ణాటక, తెలంగాణలో ఒకే తరహా పరిస్థితులు లేవు. అసలు ఎన్నికల్లో గెలవకముందే రాష్ట్ర కాంగ్రెస్‌లో విభేదాలు వస్తున్నాయి. నా 55 ఏళ్ల జీవితంలో ఏనాడూ తప్పు చేయలేదు. డబ్బు, అధికారం కోసం అమ్ముడుపోయే వ్యక్తిని కాదు. కేవలం రాజకీయంగా ఎదుర్కోలేకే దుష్ప్రచారం చేసి ఓడించారు. పారదర్శకంగా నా కంపెనీకి టెండర్ వచ్చింది. కానీ నేను భాజపాకు అమ్ముడుపోయినట్లు ప్రచారం చేశారు. నాకు పదవులు ముఖ్యం కాదు. అప్పులపాలైన తెలంగాణ రాష్ట్రాన్ని గాడిలో పెట్టడం మోదీ, అమిత్‌షా నాయకత్వంలోని భాజపాకే సాధ్యమనే నమ్మకంతో పార్టీలో చేరా. భారాసను ఓడించే శక్తి భాజపాకే ఉందని ప్రజలు బలంగా నమ్ముతున్నారు. మీడియా చేసే దుష్ప్రచారాలకు భయపడే వ్యక్తిని కాదు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్‌ను మార్చాలని ఎవరూ లాబీయింగ్ చేయడం లేదు. ఎన్నికల సంవత్సరం కాబట్టి భాజపాపై దుష్ప్రచారాలు చేస్తున్నారు. ఇదంతా భాజపాను బలహీనం చేసే కుట్రే తప్ప మరేమీ లేదు” అని రాజగోపాల్‌రెడ్డి అన్నారు.

# అన్ని సౌకర్యాలు, వసతులతో ఈఎస్ఐ గ్రేవ్‌యార్డ్ : మంత్రి తలసాని

హైదరాబాద్ : ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించే విధంగా అన్ని సౌకర్యాలు, వసతులతో ఈఎస్ఐ గ్రేవ్ యార్డ్‌ను అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. గురువారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలోని తన చాంబర్‌లో సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని జీహెచ్ఎంసీ, ఇంజినీరింగ్, శానిటేషన్, ఎలక్ట్రిసిటీ, హార్టికల్చర్ తదితర శాఖల అధికారులతో నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న, ఇంకా చేపట్టవలసిన అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని అమీర్‌పేట డివిజన్‌లో గల ఈఎస్ఐ గ్రేవ్ యార్డ్ అభివృద్ధి కోసం రూపొందించిన నమూనాలను ఖైరతాబాద్ జోన్ జోనల్ కమిషనర్ రవి కిరణ్ మంత్రికి ఫోటో ప్రదర్శన ద్వారా వివరించారు. సుమారు ఏడున్నర ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈఎస్ఐ గ్రేవ్ యార్డ్‌ను రూ. 4.5 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసి ఏడాది లోగా అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని మంత్రి వివరించారు. అన్ని సౌకర్యాలు, వసతులతో రాష్ట్రంలోనే నెంబర్ 1 మోడల్ గ్రేవ్ యార్డ్ (వైకుంఠ ధామం) గా నిర్మించడం జరుగుతుందని పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలో కోట్లాది రూపాయల విలువైన అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, అధికారులు వారంలో 2 రోజుల పాటు క్షేత్రస్థాయిలో పర్యటించి పనులు మరింత వేగవంతంగా జరిగేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. కొన్ని పనులు ఇంకా ప్రారంభించలేదని, త్వరితగతిన ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. శంకుస్థాపన జరిగిన వారం రోజుల లోపే పనులు ప్రారంభించే విధంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. పేద, మధ్య తరగతి ప్రజలు అధికంగా ఉండే ప్రాంతాలలో రోడ్లు, డ్రైనేజీ, వాటర్ వంటి సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని చెప్పారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు సమన్వయంతో వ్యవహరించి పనుల మంజూరు, అనుమతుల ప్రక్రియలో జాప్యం జరగకుండా చూడాలని ఆదేశించారు.



# ఇంటి పోరు మరీ .. మల్లారెడ్డికే ఎసరు పెడుతున్న సబిత..!

హైదరాబాద్ : వారసులను రాజకీయాల్లోకి దించాలన్న తపన ఏ రాజకీయ నాయకులకు ఉండదు చెప్పండి. ఇందుకోసం వాళ్లు పార్టీ అధినాయకుల చుట్టూ తిరుగుతూనే ఉంటారు. వారి కృపాకటాక్షం పొందేందుకు నానా తంటాలు పడుతుంటారు. అయితే తమ వారసులకు టిక్కెట్లు ఇప్పించేందుకు ఒకే పార్టీకి చెందిన ఇద్దరు నాయకులు ఒకే సీటుకు కోసం కొట్లాడితే.. అందులోనూ వారిద్దరూ మంత్రులు అయితే.. వెరసి కార్యకర్తలను ఆయోమయంలో పడేస్తుంది. తన కొడుకు కార్తీక్‌రెడ్డికి టిక్కెట్ ఇప్పించాలని మంత్రి సబితాఇంద్రారెడ్డి తన అల్లుడు మర్రి రాజశేఖరరెడ్డికి టిక్కెట్ కోసం మంత్రి మల్లారెడ్డి నానా తంటాలూ పడుతున్నారు.

ఇటీవల కార్తీక్‌రెడ్డి తన రాజకీయ కార్యకలాపాలను దూకుడుగా సాగిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీ లేదా లోక్సభ టిక్కెట్ కోసం శ్రమిస్తున్నారు. ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్రావు ఐటీ శాఖ మంత్రి కెటిఆర్కు కృతజ్ఞతలు తెలుపుతూ నమస్తే తెలంగాణ దినపత్రికలో కార్తీక్ రెడ్డి బుధవారం పూర్తి పేజీ ప్రకటన విడుదల కూడా చేశారు. వారి దృష్టి పడేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే మంత్రి మల్లారెడ్డికి రాజకీయ కంచుకోటగా భావించే మల్కాజిగిరి లోక్సభ స్థానం లేదా మేడ్చల్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేయాలని కార్తీక్‌రెడ్డి భావిస్తున్నట్లు సమాచారం. గత లోక్సభ ఎన్నికల్లో మల్కాజిగిరి నుండి మంత్రి మల్లారెడ్డి అల్లుడు పిసిసి చీఫ్ రేవంత్రెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. మల్లారెడ్డి మాత్రం మేడ్చల్ అసెంబ్లీ స్థానం నుంచి గెలిచి మంత్రి అయ్యారు. కేసీఆర్ చేపడుతున్న రహస్య సర్వేలు మల్లారెడ్డి సేవలు పేలవంగా ఉన్నాయని మళ్లీ సీటు గెలిచే అవకాశం లేదని చెబుతున్నాయట. దీంతో మేడ్చల్ అసెంబ్లీ స్థానానికి ప్రత్యామ్నాయ అభ్యర్థులను ఎంపిక చేసే ఆలోచనలో కేసీఆర్ ఉన్నారని సమాచారం. ఇదే అదును ఈ సీటుపై కార్తీక్ రెడ్డి దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇందుకోసం కార్తీక్ రెడ్డి తన రాజకీయ కార్యకలాపాలను మరింత పెంచి టిక్కెట్టును దక్కించుకునేందుకు కేసీఆర్ కేటీఆర్ల అభిమానం కోసం అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక మల్లారెడ్డి కూడా తన ప్రయత్నాల్లో తానున్నారు. ఇప్పుడు ప్రాతినిథ్యం వహిస్తున్న మేడ్చల్ అసెంబ్లీ సీటు తనకూ అల్లునికి మళ్లీ ఈసారి మల్కాజిగిరి లోక్సభ సీటు అడుగుతున్నారట.

దీంతో ఇద్దరు మంత్రుల మధ్య టిక్కెట్ల కోసం అంతర్యుద్ధం మొదలైంది. మంత్రులిద్దరూ తమ రాజకీయ వారసుల కోసం శ్రమిస్తున్నారు. కార్యకర్తలు చోటామోటా నాయకులను మచ్చిక చేసుకునేందుకు ఎవరికి వారు ప్రయత్నాలు సాగిస్తున్నారని సమాచారం. అయితే మల్కాజిగిరి లోక్ సభ సీటు ఇటు మేడ్చల్ అసెంబ్లీ సీటు బిఆర్ఎస్ బాస్ ఎవరికి కేటాయిస్తారో చూడాలి మరీ.

# కేసీఆర్ లెక్క 105 సీట్లు.. సాధ్యమేనా..?



హైదరాబాద్ : మరో ఆరు నెలల్లో తెలంగాణలో జరగనున్న ఎన్నికల్లో విజయం బిఆర్ఎస్దేనని అంటున్నారు గులాబీ బాస్ కేసిఆర్. సర్వేలన్నీ బిఆర్ఎస్ గెలుస్తుందని చెబుతున్నాయని అంటున్నారు. ఇప్పటికిప్పుడు ఎలక్షన్లు జరిగినా తమ పార్టీ 105 సీట్లు గెలుస్తుందని చెబుతున్నారు. బిజెపికి భారీగా సీట్లు పెరగవచ్చునని రాజకీయ విశ్లేషకులు అంచనాలు వేస్తున్నారు. మరోవైపు కర్ణాటకలో భారీ విజయం సాధించినందు వల్ల అదే పరంపర తెలంగాణలోనూ సాగుతుందని కాంగ్రెస్ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరీ కేసిఆర్ చెబుతున్న 105 సీట్లు తెలంగాణలో బిఆర్ఎస్ వచ్చే అవకాశం ఉందా..? కర్ణాటక ఎన్నికల ఫలితాల తర్వాత పలు రాజకీయ పార్టీల్లో ఎన్నికల హడావిడి మొదలైంది. నవంబర్ లేదా డిసెంబర్లో తెలంగాణలో జరిగే ఎన్నికల పట్ల ఇప్పటికే అధికార బిఆర్ఎస్ పార్టీ అప్రమత్తమైంది. కర్ణాటక ఫలితాలకు ముందే లీడర్లతో సమావేశమైన కేసిఆర్ మరోసారి తాజాగా ఎంపీ ఎమ్మెల్యేలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే తమ పార్టీకి 105 సీట్లు వస్తాయని చెప్పుకొచ్చారు. ఈ సీట్లను ఇలాగే నిలుపుకోవడానికి ఎమ్మెల్యేలు పెద్దగా కష్టపడాల్సిన పని లేదని అన్నారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు బిఆర్ఎస్ చేసిన మేలు ఏంటో చెబితే చాలన్నారు. గత పదేండ్లలో తెలంగాణ ప్రజలకు అమలు చేసిన పథకాలు అభివృద్ధి గురించి వివరించాలని ఎమ్మెల్యేలను ఆదేశించారు. బిఆర్ఎస్ లీడర్లంతా హైదరాబాద్లో మకాం వేయకుండా పూర్తిగా తమ నియోజకవర్గాల్లోనే ఉండాలని ఆదేశించారు. రైతులు పని చేసుకునే స్థలాల్లోకి పొలాల్లోకి వెళ్లి మాట్లాడాలని వారితో కలిసి భోజనం చేయాలని వారి సాధకబాధలను వినాలని అన్నారు. వారికున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని చెప్పారు. గడిచిన 70 సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రజలకు చేసిందేమీ లేదని పదేండ్ల కాలంలోనే రాష్ట్రాన్ని తాము ఎంతగా అభివృద్ధి చేశామో ఎన్నెన్ని పథకాలు అమలు చేశామో చెప్పాలని అన్నారు. ఇక తెలంగాణ ఏర్పడి 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా థాబ్ద ఉత్సవాలు వైభవంగా జరపాలని కేసిఆర్ మంత్రులకుఎమ్మెల్యేలకు ఆదేశాలు ఇచ్చారు. మంత్రులు జిల్లాల్లో తెలంగాణ థాబ్ది ఉత్సవాలను పర్యవేక్షించాలన్నారు. ఇదే వేదికగా రాబోయే ఎన్నికల్లో విజయానికి పునాదులు వేయాలని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ తరపున కూడా గ్రామగ్రామాన థాబ్ది ఉత్సవాలు నిర్వహించాలని కార్యకర్తలకు నాయకులకు ఆదేశాలు ఇచ్చారు.

# మొగ్గలోనే తుంచి పారేసిన కోమటిరెడ్డి బ్రదర్.. ఫుల్ క్లారిటీ ఇచ్చేశారు



హైదరాబాద్ : కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు తెలంగాణ కాంగ్రెస్ నేతల్లో కొత్త ఆశలకు తెర తీసింది. మొన్నటివరకు పార్టీ పని అయిపోయిందని నమ్మిన చాలామందిలో ఇప్పుడు అందుకు భిన్నమైన వాదనల్ని వినిపిస్తున్నారు. కాస్త వీలు చూసుకొని జంప్ అయిపోవాలనుకున్న వారంతా కూడా.. ఇప్పుడు తమకు మించిన వీర విధేయులు పార్టీకి ఎవరుంటారన్నట్లుగా రియాక్టు అవుతున్నారు. ఇదిలా ఉంటే.. కాంగ్రెస్ నుంచి వెళ్లిపోయిన వారి మీద కొత్త వాదనలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ నుంచి వెళ్లిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తిరిగి సొంతగూటికి వచ్చేస్తున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ ప్రచారంలో భాగంగా బీజేపీకి గుడ్ బై చెప్పేసి వచ్చేస్తారంటున్నారు. దీనిపై తాజాగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రియాక్టు అయ్యారు. తాను తిరిగి కాంగ్రెస్ లోకి వెళతానన్న ప్రచారంలో ఏ మాత్రం నిజం లేదని.. తన జర్నీ బీజేపీతోనేనని తేల్చి చెప్పారు.

తప్పుడు ప్రచారం చేసి.. తన క్యాడర్ ను తప్పు దోవ పట్టించే పనిలో భాగంగానే ఇదంతా చేస్తున్నారన్నారు. తాను పార్టీ మారతానని జరిగే ప్రచారాన్ని అస్సలు నమ్మొద్దని.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేపీ అభ్యర్థిగానే పోటీ చేస్తానని స్పష్టం చేశారు. కొద్ది కాలం క్రితం కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి వచ్చి.. తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయటం.. అనంతరం జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలు కావటం తెలిసిందే. బీఆర్ఎస్ నుంచి కూసుకుంట్ల ప్రభాకర్.. కాంగ్రెస్ నుంచి పాల్వాయి స్రవంతి పోటీ చేయగా.. రాజగోపాల్ రెడ్డి బీజేపీ నుంచి బరిలోకి దిగారు. దేశంలోనే అత్యంత ఖరీదైన ఉప ఎన్నికగా ప్రచారం జరిగిన ఈ ఎన్నికను బీజేపీ.. బీఆర్ఎస్ లు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నా.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎత్తుల ముందు రాజగోపాల్ రెడ్డి తేలిపోయారు. అంతిమంగా విజయం బీఆర్ఎస్ నే వరించిందన్న సంగతి తెలిసిందే.

# కొడకండ్ల మినీ టెక్స్‌టైల్ పార్క్‌కు త్వరలోనే శంకుస్థాపన : మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

హైదరాబాద్ : సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు, మంత్రి కేటీఆర్ సహకారంతో పాలకుర్తి నియోజకవర్గం కొడకండ్లలో ఏర్పాటు చేయనున్న మినీ టెక్స్‌టైల్ పార్కుకు త్వరలోనే శంకుస్థాపన చేయనున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తెలిపారు. సిరిసిల్ల మోడల్‌లో గ్రౌండింగ్‌కు ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంత్రి టీఎస్ ఐఐసీ ఎండీ ఈవీ నర్సింహారెడ్డి, టెక్స్ టైల్స్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ మిహిద్, టెక్స్ టైల్స్ అడిషనల్ డైరెక్టర్ వెంకటేశం, కొడకండ్ల సర్పంచ్ పసునూరి మధుసూదన్, సిందె రామోజీ, తదితరులతో నూతన సచివాలయంలోని తన పేషీలో మంత్రి గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ.. చేనేత కార్మికులు కొడకండ్ల చుట్టుముట్టు ప్రాంతాల్లో అధికంగా ఉండి, ముంబై, భీవండి, సూరత్ వంటి ప్రాంతాలకు వలస పోతున్నారన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత అన్ని రంగాల్లో వచ్చిన అభివృద్ధి, మార్పుల మాదిరిగానే, చేనేత రంగంలోనూ మార్పులు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకనుగుణంగా ఈ విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్ళిన వెంటనే కొడకండ్లలో మినీ టెక్స్ టైల్ పార్క్ ఏర్పాటుకు అనుమతిచ్చారని, అలాగే మంత్రి కేటీఆర్ సైతం సహకరించారని చెప్పారు. దీంతో అన్ని రకాల అనుమతులు వచ్చి, భూ సేకరణ కూడా పూర్తయిందన్నారు. అయితే, నిర్ణీత స్థలంలో సిరిసిల్ల మోడల్‌లో పార్క్ ఏర్పాటు చేస్తే, అందుబాటులో ఉండే కార్మికులకు వాటిని సాధ్యమైనంత తక్కువ మొత్తానికి కేటాయించి, ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలని నిర్ణయించామన్నారు. వెంటనే పనులు ప్రారంభించాలని, ఆయా శాఖల అధికారులను మంత్రి ఆదేశించారు. మొదటి దశ పనులను సెప్టెంబర్‌లోగా పూర్తి చేయాలని చెప్పారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com